మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 96 • పేజీలు:12+16 • వెల: రూ.5 | మంగళవారం • 6-3-2018 | www.manamnews.com | /manamnews



నాయకుడి ఖాతాకు రూ.1.8 కోట్లు

- సొమ్ము ట్రాన్స్‌ఫర్ చేసిన కార్తీ చిదంబరం
- తన ఖాతా నుంచే ఐదు విడతలుగా డబ్బు
- నేతలతో సంబంధాలేంటని సీబీఐ.. ఈడీ ఆరా
- కార్తీకి క్విడ్ ప్రో కో కింద రూ.3.1 కోట్లిచ్చాం
- కోర్టుకు పీటర్.. ఇంద్రాణి వెల్లడి

7లో..

రామరాజ్యం కోసమే!


- యూపీలో ఎన్‌కౌంటర్లపై కేశవ్‌ప్రసాద్ మౌర్య
- సాయుధ దాడిచేస్తే పోలీసు కాల్పులే జవాబు
- శాంతిభద్రతల పరిరక్షణ మా ప్రభుత్వ బాధ్యత

7లో..

'మూడు' ముమ్మరం

• గోల్కొండ టు లాల్‌ఖిలా..

థర్డ్ ఫ్రంట్ దిశగా దశలవారీ భవిష్యత్ ప్రణాళిక



- విశ్రాంత ఐఏఎస్‌లతో తొలుత కేసీఆర్ సమావేశం
- అన్ని రంగాల రిటైర్డ్ అధికారులతో భేటీ
- న్యాయ కోవిదులతోనూ చర్చించి వ్యూహం ఖరారు
- ప్రధాన నగరాల్లో పర్యటనకు జోరుగా సన్నాహాలు

హైదరాబాద్, మార్చి 5 (మనం ప్రతినిధి):

దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు లక్ష్యంగా మూడో కూటమి ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వేగంగా పావులు కదుపుతున్నారు. ఈ దిశగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. రాజకీయ ప్రక్షాళన... తద్వారా వ్యవస్థలో మెరుగైన మార్పులపై జాతీయ స్థాయిలో గోష్ఠులు, సమావేశాలు, సభలతో చర్చకు మిగతా 6లో..



సాగు బడ్జెట్‌కు నై



ఆలోచన విరమించుకున్న సర్కారు

నియమ నిబంధనలకు అది విరుద్ధం

- తొలుత ప్రవేశపెట్టాలనే అనుకున్నం
- రాజ్యాంగ నిబంధనలతో విరమించినం
- సాగుకు సర్కారు అధిక ప్రాధాన్యం
- ఈసారి కూడా సంక్షేమ కార్యక్రమాలు
- బడ్జెట్ సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్

6లో..

ఇదీలోకం!



హోదా అటోఇటో తేలేంతవరకు మంచైనా, చెడైనా మీతోపాటు పంచుకుంటామని ఒట్టేసి చెబుతున్నారు సార్..!



12 నుంచి అసెంబ్లీ సమావేశాలు

తొలిరోజు గవర్నర్ ప్రసంగం.. నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, మార్చి 5 (మనం ప్రతినిధి):

తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈనెల 12వ తేదీ ఉదయం 10 గంటల నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగంతో సమావేశాలు ప్రారంభం అవుతాయని అసెంబ్లీ సచివాలయం విడుదల చేసిక ఒక ప్రకటనలో తెలిపింది. సమావేశాలు ఎన్ని రోజులు జరగాలన్న దానిపై బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో నిర్ణయం తీసుకుంటారు.

వ్యూహం విఫలం

ప్రగతి భవన్ ముట్టడికి బీజేపీ ప్లాన్

- ముందుగానే పలువురు నేతల అరెస్టు
- బీజేపీ ఎమ్మెల్యేల గృహనిర్బంధం
- ముట్టడిని అడ్డుకున్న పోలీసులు
- తీవ్రంగా ఖండించిన పార్టీ నేతలు
- సమస్యలపై నిలదీస్తే అణచివేత
- గుణపాఠం చెప్పే సమయం వచ్చింది
- బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు లక్ష్మణ్



చింతల రామచంద్రారెడ్డి తదితరులను అరెస్టు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్, మార్చి 5 (మనం ప్రతినిధి):

ప్రగతి భవన్‌ను ముట్టడించాలని బీజేపీ నేతలు చేసిన ప్రయత్నం విఫలమైంది. పోలీసులు ముందుగానే నేతలు, ముఖ్య కార్యకర్తలను అరెస్టుచేసి.. స్టేషన్లకు తరలించేయడంతో అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. ప్రధానిపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ సోమవారం ప్రగతిభవన్ ముట్టడికి పిలుపునిచ్చింది. పెద్ద ఎత్తున బీజేపీ నేతలు, కార్యకర్తలు నగరంలోని రాజీవ్ చౌక్ నుంచి ప్రగతిభవన్‌కు వెళ్లేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు బీజేపీ నేతలను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకుని ప్రగతిభవన్ వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. సోమాజిగూడ రాజీవ్‌గాంధీ కూడలి వద్ద ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ నేత బద్దం బాల్‌రెడ్డిలతో మిగతా 6లో..

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: పంచమి రా.12.58 తదుపరి షష్ఠి; నక్షత్రం: స్వాతి రా.9.02 తదుపరి విశాఖ; వర్జ్యం: తె.2.59-4.41; దుర్ముహూర్తం: ఉ.8.56-9.43, మ.2.25-3.12; రాహుకాలం: మ.3.24-4.52; అమృతఘడియలు: మ.12.00-1.39; శుభసమయం: సా.4.53-6.00.

సూర్యోదయం: 6.35

సూర్యాస్తమయం: 6.20

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో మంగళవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలలో మార్పులేదు. గంటకు 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 36 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 20 డిగ్రీలు

గాలిలో తేమ: 32 శాతం

అక్కడేం ఉద్ధరిస్తారు?

- రాష్ట్రాన్ని కేసీఆర్ ఏమీ ఉద్ధరించలేదు
- ఆయన చేయించిన సర్వేలు బూటకం
- ఫ్రంట్‌ల పేరుతో కొత్త నాటకం షురూ
- రైతులపై అక్రమ కేసుల బనాయింపు
- ధనిక తెలంగాణ కాస్తా అప్పులమయం
- ఎన్నికల తర్వాత వచ్చేది కాంగ్రెస్ సర్కారే
- కేసీఆర్ వైఫల్యాలే మమ్మల్ని గెలిపిస్తాయి
- పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి

నిజామాబాద్ టౌన్, మార్చి 5 (మనం న్యూస్):

రాష్ట్రంలో అన్ని రంగాల్లో విఫలమై.. సామాన్య ప్రజలను మోసం చేసి.. రాష్ట్రాన్ని ఉద్ధరించలేని ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ స్థాయిలో ఏం ఉద్ధరిస్తారని పీసీసీ మిగతా 6లో..



నిజామాబాద్ సభలో ప్రసంగిస్తున్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి



పరకాల సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

టెక్నాలజీ అంటే ఇదే!

- కొత్తగా ఆలోచించడమే ఆవిష్కరణలకు మూలం
- విద్యార్థులకు ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సూచన
- ఎస్ఆర్ఈ కాలేజీలో ఐటీ సెంటరుకు శ్రీకారం
- ఫార్మా విద్యార్థుల వినతిపై సానుకూల స్పందన
- అన్నింటా మేటిగా హైదరాబాద్: కడియం శ్రీహరి
- ఐటీ రంగం ప్రగతికి మంత్రి కృషి అత్యద్భుతం

వరంగల్, మార్చి 5 (మనం న్యూస్ బ్యూరో):

టెక్నాలజీ అంటే కొత్తగా ఆలోచించడమేనని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖల మంత్రి కె.తారక రామారావు అన్నారు. యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రపంచం అబ్బురపడే ఆవిష్కరణలు తేవాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం ఓరుగల్లు పర్యటనలో భాగంగా హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని ఎస్.ఆర్.ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్నొవేషన్ మిగతా 6లో..

కేసీఆర్‌కు ఆ సత్తా ఉంది

- ప్రజల చూపు ప్రత్యామ్నాయం వైపు
- థర్డ్ ఫ్రంట్ నాయకత్వం కేసీఆర్‌కే సాధ్యం: కడియం



వరంగల్ సర్క్యూట్ హౌజ్‌లో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి

వరంగల్, మార్చి 5(మనం న్యూస్ బ్యూరో): దేశ రాజకీయాలను ముఖ్యమంత్రి కేసీఆర్ నిశితంగా పరిశీలిస్తున్నారని మంత్రి కడియం శ్రీహరి అన్నారు. సోమవారం వరంగల్‌లో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా కడియం పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్క్యూట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ దేశంలో ప్రజలు ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. థర్డ్ ఫ్రంట్‌కు నాయకత్వం వహించే శక్తి కేసీఆర్‌కు ఉందని ఆయన స్పష్టంచేశారు. దేశంలో ఆర్థిక పరిస్థితులు మారలేదనే విషయాన్ని ప్రజలు గుర్తించారన్నారు. కేంద్రంలో ప్రత్యామ్నాయం ఉంటే వాళ్లు ఆలోచిస్తారని కడియం పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు అవినీతి విచ్చలవిడిగా సాగిందన్నారు. ఇక మోదీ నాయకత్వంలో బ్యాంకులు లూటీ అవుతున్నాయని, బ్యాంకుల స్కామ్ వెనుక మోదీ ప్రభుత్వం ఉన్నట్లుందని ఆరోపించారు. ప్రజల సొమ్ముకు సంబంధించి ప్రధాని మోదీ ఎందుకు మాట్లాడడంలేదని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలను తెలుసుకోవడం.. వ్యవస్థలో లోపాలను మోదీ గుర్తించడంలేదని చెప్పారు. ఆర్థిక నేరగాళ్లను అదుపు చేయడంతో ఘోరంగా విఫల మయ్యారన్నారు. ఈ పరిస్థితి పోయి ప్రజలకు మేలు జరగాలంటే కాంగ్రెస్, భాజపాయేతర పార్టీలతో థర్డ్ ఫ్రంట్ రావాలన్నారు. దేశ వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవడంలో కాంగ్రెస్, బీజేపీలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఆ పార్టీల నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని కడియం విమర్శించారు. ఈ నేపథ్యంలో థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, దానికి నాయకత్వం వహించే శక్తి కేసీఆర్‌కు ఉందని పేర్కొన్నారు.

సారు ఢిల్లీలో అడుగెడితే అన్నీ మారతాయ్

- టీఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్



హైదరాబాద్, మార్చి 5(మనం ప్రతినిధి): దేశ రాజకీయాలలో కేసీఆర్ కీలక శక్తిగా మారనున్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు 30కి పైగా పార్టీలను ఒప్పించిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. ఈమేరకు టీఆర్ఎస్ఎల్పీలో సోమవారం శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలది బస్సుయాత్ర కాదు, తుస్సు యాత్ర అని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న సీట్లు కూడా కోల్పోయే పరిస్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. దేశ రాజకీయాలలో గుణాత్మక మార్పు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నపుడు పార్టీలకతీతంగా స్వాగతించాలన్నారు. కానీ కొందరు ప్రతిపక్ష నేతలు నోరుందని ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్ల పసిగుడ్డు తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందంటే అది కేసీఆర్ పాలన చలవేనని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనే చతికిలపడ్డ బీజేపీ రాష్ట్రంలో ఏం ఉద్ధరిస్తుందని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉన్న ఒక్క బీసీ నేత దత్తాత్రేయను కేంద్ర మంత్రి వర్గం నుంచి తప్పించారన్నారు. ప్రస్తుతం తెలంగాణ ఆత్మగౌరవం ఢిల్లీలో కేసీఆర్ రూపంలో గుర్తింపు పొందుతుంటే హర్షించాలని పేర్కొన్నారు. కేసీఆర్ ఒక్కసారి ఢిల్లీలో కాలుమోపారంటే రాజకీయ వాతావరణం మొత్తం మారిపోతుందని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.



రాజ్యసభ ఎన్నికలకు నోటిఫికేషన్

హైదరాబాద్, మార్చి 5(మనం ప్రతినిధి): తెలంగాణకు చెందిన మూడు రాజ్యసభ స్థానాలకుగానూ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎలక్షన్ కమిషన్ సోమవారం విడుదల చేసింది. కాంగ్రెస్ ఎంపీ పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి అనారోగ్యంతో గతేడాది మృతి చెందారు. రాపోలు ఆనందభాస్కర్, సీఎంరమేష్ పదవీకాలం గడువు ఏప్రిల్‌లో రెండో తేదీతో ముగియనుంది. ఆయా స్థానాలను భర్తీ చేసే క్రమంలో ఎలక్షన్ కమిషన్ ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. కాగా పోటీ చేసే అభ్యర్థులు ఈ నెల 12వ తేదీలోపు నామినేషన్ వేయాల్సి ఉంటుంది. 13వ తేదీ నుంచి నామినేషన్ల పరిశీలన, 15వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు ఎలక్షన్ కమిషన్ గడువు విధించింది. మూడు రాజ్యసభ స్తానాలకు గానూ ఈ నెల 23వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటుంది. కాగా ప్రస్తుతం పార్టీల బలాలను పరిశీలిస్తే మూడు స్థానాలు టీఆర్ఎస్ ఖాతాలో పడే అవకాశాలున్నాయి. మూడోస్థానం విషయంలో కాంగ్రెస్ పోటీలో అభ్యర్థిని పెడితే పోలింగ్ జరిగే అవకాశాలు న్నాయి. లేనిపక్షంలో 3 స్థానాలు టీఆర్ఎస్ ఏకగ్రీవంగా గెలుచుకోనుంది.

సుప్రీంలో పొంగులేటి పిటిషన్

హైదరాబాద్, మార్చి 5(మనం ప్రతినిధి): విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలని కోరుతూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీం విచారణకు స్వీకరించింది. ప్రతివాదులుగా తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలను, కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వంలో పలు శాఖలను చేర్చారు.

అసైన్డ్ భూములపై సర్కారు కీలక నిర్ణయం

హైదరాబాద్, మార్చి 5(మనం ప్రతినిధి): అసైన్డ్ భూములకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి ఆదేశాలు జారీ చేశారు. అసైన్డ్‌దారుల నుంచి భూమి కొన్న వారికి రీ అసైన్ చేసే అధికారాన్ని కలెక్టర్లకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. గతంలో భూమి లేని పేదలై ఉండి అసైన్డ్ భూములు కొని సాగు చేస్తున్న వారికి హక్కులు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. అర్హులై ఉంటే అసైన్‌మెంట్ కమిటీలకు బదిలీ చేయకుండా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వ సూచించింది. 2017 డిసెంబర్ 31 నాటికి భూములు కొన్న వారికి ఈ వెసులుబాటు వర్తించనుంది.

కేసీఆర్‌కు ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం అజిత్ మద్దతు

హైదరాబాద్, మార్చి 5 (మనం ప్రతినిధి): బీజేపీ, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయంగా జాతీయస్థాయిలో గుణాత్మకమైన మార్పు తీసుకువచ్చేందుకు కొత్త కూటమి పెడతామన్న సీఎం కేసీఆర్ ప్రకటనకు జేసీసీ అధినేత, ఛత్తీస్‌ఘడ్ సీఎం అజిత్‌జోగి మద్దతు ప్రకటించారు. కేసీఆర్ కూటమిలో చేరతానని, కలిసి పోరాడుదామని జోగి కేసీఆర్‌కు ఫోన్‌లో తెలిపారు. మిగతా పార్టీల నేతలతో కూటమిని బలోపేతం చేద్దామన్నారు. కేసీఆర్‌కు ఇప్పటికే తృణమూల్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ మద్దతు ప్రకటించారు.

రాజ్యసభ ఎన్నికల రేసులో.. ఉద్యమకారులకే ప్రాధాన్యం

- భారీగా పెరుగుతున్న ఆశావహుల సంఖ్య
- ఒకటి సంతోష్‌కు, రెండోది యాదవ్‌లకు ఖాయం
- మూడో సీటు ఎవరికనే దానిపై తీవ్ర ఉత్కంఠ
- తెరపైకి మంద జగన్నాథం.. జి వినోద్..

హైదరాబాద్, మార్చి 5, (మనం ప్రతినిధి): తెలంగాణలో రాజ్యసభ ఎన్నికల సమరం జోరందుకుంది. ఖాళీగా ఉన్న 3 సీట్ల భర్తీపై టీఆర్ ఎస్‌లో ఇప్పటికే రాజకీయ వేడి రాజుకుంది. ఈ నేపథ్యంలో ఉద్యమ పార్టీలో ఆవిర్భావం నుంచి టీఆర్ఎస్‌లో ఉంటూ తెలంగాణ కోసం త్యాగం చేసిన వారి పేర్లు మొదటి వరుసలో ఉన్నాయి. మొదటి పేరు సీఎం కేసీఆర్‌కు నమ్మిన బంటులా ఉన్న టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యద ర్శి జోగినపల్లి సంతోష్ పేరు దాదాపు ఖరారైనట్లు వార్తలు వినిపి స్తున్నాయి. కాగా, మరో సీటును యాదవులకిస్తామని ముఖ్యమంత్రి కేసీ ఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. మూడో సీటు ఎవరికి కేటాయిస్తార న్నదానిపై.. సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. రెండో సీటు కోసం తెరపైన పలువురి యాదవుల పేర్లు జోరుగా వినిపిస్తున్నాయి. అందులో టీఆర్ ఎస్ అవిర్భావం నుంచి పార్టీలో పనిచేస్తున్న గొర్రెల, మేకల పెంపకందారుల అభివృద్ధి ఫెడరేషన్ చైర్మన్ కె. రాజయ్య యాదవ్ పేరు వినిపిస్తోంది. రెండో వ్యక్తిగా గత ఎన్నికల్లో నాగర్జునసాగర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహ్మయ్య యాదవ్ పేరు వినిపిస్తుండగా...ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌లు పేర్లు కూడా విని పిస్తున్నాయి. వీరితో పాటు వరంగల్ జిల్లాకు చెందిన ప్రముఖ పారిశ్రా మికవేత్త, పాఠశాలల యాజమాని సుందర్ రాజ్ యాదవ్ అనే కొత్త పేరు తెరపైకి వస్తోంది. అయితే, సీఎం కేసీఆర్ మాత్రం ఈ సారి ఉద్యమంలో ముందునడిచినవారికి ప్రాధాన్యం ఇచ్చేలా అడుగులు వేస్తున్నట్లు తెలు స్తోంది. ఇక మిగిలిన మూడో సీటు మాత్రం టీఆర్ఎస్ నాయకుల్లో ఉత్కంఠ రేపుతోంది. సీఎం కేసీఆర్ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నేతకి ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. గత కొంత కాలంగా సంచలన కామెంట్స్‌తో టీఆర్ఎస్‌పై గుర్రుగా ఉన్న మంద కృష్ణ మాదిగకు చెక్ పెట్టెందుకు ఉద్యమంలో తనతో ఉంటూ...ఉద్యమ సమయంలో ఎంపీ పదవికి రాజీనామా చేసి టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న మంద జగ న్నాధంను రాజ్యసభకు పంపుతారని వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇక తెరపై మరో పేరుసైతం వినిపిస్తోంది. తెలంగాణ మాస్‌లీడర్ కాకా పెద్దకుమారుడు గడ్డం వినోద్ కూడా ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.


సింగరేణిపై 'కరుణ' చూపవా!

- సీఎం కేసీఆర్ కరుణపైనే 'కారుణ్యం'
- వారసులకు బొగ్గుబాయి కొలువు దక్కేనా?
- నియామకాల కోసం ఎదురుచూపులు
- నిబంధనలపైనే అస్పష్టత.. కార్మికుల్లో బెంగ

హైదరాబాద్, మార్చి 5 (మనం ప్రతినిధి): సీఎం కేసీఆర్ తమపై ఎప్పుడు కరుణ చూపుతారా అని అర లక్ష మంది బొగ్గు బాయి కార్మికులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. ఇటీవలి శ్రీరాంపూర్ పర్యటన సందర్భంగా కారుణ్య నియామకాలపై చేసిన ప్రకటనతో సింగరేణి బొగ్గు గని కార్మికుల్లో మరోసారి ఆశలు చిగురించాయి. కాగా కారుణ్య నియామకాలపై స్పష్టత లేకపోవటంతో కార్మికులు కొంత ఆయోమయానికి గురవుతున్నారు. కారుణ్యంపై సింగరేణి యాజమాన్యం ఎలాంటి నిబంధనలు విధిస్తుందోననే బెంగ కార్మికుల్లో నెలకొంది. వారసత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నవారందరికీ న్యాయం జరుగుతుందని ముఖ్యమంత్రి చెప్పినా, యాజమాన్యం ఎవరికి ప్రాధాన్యం ఇస్తుంది? ఈనెలలో ఉద్యోగ విరమణ పొందేవారికి పథకం వర్తిస్తుందా? దీనికి సర్వీసు నిబంధనలు ఏమైనా ఉంటాయా అనే ఆలోచనలతో కార్మికులు సతమతమవుతున్నారు.

పాతవారికేనా.. కొత్తగా మళ్లీనా?

కారుణ్య నియామకాల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న కార్మికులు మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలా? పాత దరఖాస్తులనే పరిశీలిస్తారా? అన్నది కార్మికుల మదిలో మెదులుతున్న సందేహం. ముఖ్యమంత్రి ప్రసంగంలోనే ఏ గని వారు ఆ గనిలో దరఖాస్తు చేసుకోవాలని, మీరు గెలిపించిన సంఘం నేతలు మీకు సహకరిస్తారని చెప్పిన మాటల్లో కొత్తవారు దరఖాస్తు చేసుకోవడమా? తాజాగా దరఖాస్తులు స్వీకరిస్తారా అనే విషయంలో కొంత స్పష్టం కరువైందని కార్మికులు వాపోతున్నారు. కారుణ్య నియామకమంటే వాస్తవానికి సర్వీసు నిబంధనలు వర్తించవు. వైద్యపరంగా పనిచేయడానికి అనర్హుడైతే వారి వారసులకు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం ఇవ్వాలి. గతంలో భూగర్భంలో పనిచేయడానికి అన్‌ఫిట్ చేసి రెండేళ్లకన్నా సర్వీసు తక్కువగా ఉందనే కారణంతో ఉపరితలంలో పనిచేయాలని, అది వద్దనుకుంటే నెలనెలా వేతనం ఇస్తామనే ప్రతిపాదన చేసినవారికి తిరిగి అవకాశం కల్పిస్తారా అని కార్మికుల్లో చర్చ సాగుతోంది. కారుణ్య నియామకాలకు అర్హులుగా ఏయే జబ్బులకు అవకాశం కల్పిస్తారు. ఎవరెవరు దరఖాస్తులకు అర్హులు? నిమ్స్, గాంధీ, ఉస్మానియా ఆసుపత్రి వైద్యులను చేర్చడం బాగానే ఉన్నప్పటికీ, వారికి లంచాలు ఇవ్వకుంటే పని జరగదనే ప్రచారం గనుల్లో అప్పుడే మొదలవటం విశేషం. సింగరేణిలో ఇప్పటికే 900 మంది కార్మికులు మెడికల్ బోర్డు కోసం ఎదురు చూస్తున్నారు. అనారోగ్యంతో బాధపడ్తూ వైద్య పరీక్షల దరఖాస్తు చేసుకున్నారు. కాగా వారసత్వ ఉద్యోగాలపై కోర్టు తీర్పు నేపథ్యంలో మెడికల్ బోర్డు పరీక్షలు నిలిపివేశారు. ఇందులో కొంతమంది సర్వీస్ పూర్తి కావడంతో రిటైర్డ్ అయ్యారు. ఇదిలా ఉండగా పని జరిగితే అదే పదివేలనుకునే కార్మివర్గానికి కొత్త బోర్డులో ఎంత మేరకు న్యాయం జరుగుతుంది అని కార్మికులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో గతంలోలా కాకుండా ఈసారైనా తమ వారసులకు సింగరేణిలో కొలువు దొరుకుతుందా అని కార్మికులు ఆశతో ఎదురు చూస్తున్నారు.





ఎన్నెన్నో ప్రశ్నలు..

సింగరేణి కార్మికులకు దసరా కానుకగా 1998లో రద్దయిన వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరిస్తున్నట్లు 2016లో సీఎం కేసీఆర్ ప్రకటించారు. దాంతో ఈ ప్రతిపాదనకు అదే ఏడాది నవంబరు 4న సింగరేణి డైరెక్టర్ల బోర్డు ఆమోద ముద్ర వేసింది. డిసెంబరు 20వ తేదీన యాజమాన్యం అమలు ఉత్తర్వులను ఇచ్చింది. కాగా ఆ ఉత్తర్వులను ఒక నిరుద్యోగి కోర్టులో సవాల్ చేయడంతో సమస్య వచ్చింది. వారసత్వ ఉద్యోగాలపై ఇచ్చిన ఉత్తర్వులను రాష్ట్ర హైకోర్టు 2017, మార్చి 16న రద్దు చేయాలని ఆదేశించింది. దాంతో కారుణ్య నియామకాల కింద దరఖాస్తు చేసుకున్న కార్మికుల జీవితాల్లో ఒక్కసారిగా చీకట్లు అలుముకున్నాయి. హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాల్ చేసినప్పటికీ ప్రయోజనం దక్కలేదు. అప్పటికే దరఖాస్తు చేసుకున్న ఐదువేల మంది కార్మికుల్లో వందలాది మంది రిటైర్డ్ అయ్యారు. ఇప్పుడు సర్వీసులో ఉన్నవారిలో ఎవరెవరికి వర్తిస్తుంది. ఎంత సర్వీసు మిగిలి ఉండాలి. విధి విధానాలు ఎలా ఉంటాయి? అని కార్మికులు ఆలోచిస్తున్నారు. ఏడాది సర్వీసులోపు ఉన్న కార్మికులు దాదాపుగా రెండువేల మంది ఉన్నారు. వారికి అవకాశం ఇస్తారా, రేండేండ్ల నిబంధన తీసుకువస్తారా అనే విషయంపై స్పష్టత లేకపోవటంతో కార్మికులు కొంత ఆందోళనకు గురవుతున్నారు. మొదటి సారి ప్రకటించిన సమయానికి రెండున్నరేండ్ల సర్వీస్ ఉన్న కార్మికులకు సర్వీస్ ప్రస్తుతం ఏడాదికి తగ్గింది. ఈ సారికి ఏడాది అవకాశంగా లేదా ప్రస్తుతం పనిచేస్తున్న వారు సర్వీస్‌తో సంబంధం లేకుండా వారసులకు ఉద్యోగ అవకాశాలను యాజమాన్యం కల్పిస్తుందా అని కార్మికులతో పాటు వారి కుటుంబాలు ఆశగా ఎదురు చూస్తున్నాయి.

జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచండి

- బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య
- బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్‌రాములుకు వినతి పత్రం



బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న కృష్ణయ్య, తదితరులు

హైదరాబాద్‌సిటీ, మార్చి 5(మనం ప్రతినిధి): జనాభా ప్రకారం బీసీ రిజర్వేషన్లను 25శాతం నుంచి 50శాతానికి పెంచాలని బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృ ష్ణయ్య విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన బీసీ సంక్షేమసంఘం ప్రతినిధులతో కలిసి బీసీ కమిషనర్ చైర్మన్ బీఎస్ రాములు, బీసీ కమిషన్ సభ్యులు వకులాభరణం కృష్ణమోహన్, జూలూరీ గౌరీశంకర్, ఈడిగ ఆంజనేయులుగౌడ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సంద ర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34శాతం నుంచి 50శాతానికి పెంచి రాజ్యాంగ బద్ధత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను జనాభా దామాష ప్రకారం పెంచాలని సంవత్సరం క్రితమే ఆదేశించినా ఇంత వరకూ ఆచరణలో మాత్రం శూన్య మేనని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నోసార్లు తమిళనాడు తరహా రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించారని కానీ చర్యలు శూన్యమన్నారు. తమిళనాడులో బీసీలకు 49శాతం, కర్ణాటకలో 50శాతం, మహారాష్ట్రలో 34శాతం ఉన్నాయని అలాంటప్పుడు మనరాష్ట్రంలో పెంచడానికి న్యాయపరమైన అవరోదాలు ఎందుకొస్తాయని కృష్ణయ్య ప్రశ్నించారు. జనా భలెక్కల ప్రకారం వివరాలుంటే బీసీల రిజర్వేషన్లు పెంచుకోవచ్చని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని తెలిపారు. దీంతో 50శాతం సీలిం గ్ నిబంధన తొలగిపోయిందని ఆర్. కృష్ణయ్య పేర్కొన్నారు. ఇటీవల జరిగిన సమగ్రసర్వేలో రాష్ట్రంలో బీసీల జనాభా 52శాతం ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు తేల్చాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు నీలం వెంకటేశ్, సి.రాజేందర్, కోట్ల శ్రీనివాస్,బండి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో రైతు ఆత్మహత్య



కారేపల్లి రూరల్, మార్చి 5(మనం న్యూస్): అప్పుల బాధకు తోడు, అధికారులు భూమి తీసుకోని పరిహారం కూడా చెల్లించకపోవడంతో మనస్తాపం చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకు న్నాడు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధి చీమలపాడు గ్రామానికి చెందిన రైతు మాలోత్ లక్ష్మణ్(45) ఆదివారం రాత్రి పురుగులు మందు తాగి ప్రాణం తీసుకున్నాడు. దీంతో సోమవారం ఉదయం గ్రామప్రజలు అతని మృతదేహంతో గిద్దవారిగూడెం స్టేజి వద్ద ఆందోళన చేశారు. సీతారామ ప్రాజెక్టు కాల్వ కింద లక్ష్మణ్‌కున్న భూమిని ఆధికారులు లాగేసుకున్నారని, నష్టపరి హారం కూడా చెల్లించలేదని, దీనికి తోడు అతనికి అప్పుల బాధ విపరీతంగా ఉందని ఆందోళనకారు లు చెప్పారు. దీంతో మనస్థాపం చెంది సీతారామ ప్రాజెక్టు కాల్వలోనే లక్ష్మణ్ పురుగులు మందు తాగి ప్రాణం తీసుకున్నాడని వారు చెప్పారు.

'యూనో'లో ఓడిపోయాడని చంపేశాడు

ముంబై, మార్చి 5: కాలక్షేపం కోసం ఆడే యూనో కార్డు గేమ్‌లో ఓటమిని జీర్ణించుకోలేని ఓ యువకుడు అతనిపై గెలిచిన వ్యక్తిని కత్తితో విచక్షణారహితంగా పొడిచి చంపాడు. దక్షిణ ముంబైలో శనివారం ఈ ఘటన జరిగింది. మంబైలోని అగ్రిపాద పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అబుజర్ అన్సారీ(24) చిన్న ఉద్యోగం చేసుకుంటూ అతని తల్లి అయేషా అన్సారీ(50)తో కలిసి అగ్రిపాద ప్రాంతంలో నివాసముంటున్నాడు. పని ముగించుకుని సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత అబుజర్ చుట్టుపక్కల పిల్లలతో రోజు యూనో ఆడుతుంటాడు. శనివారం సాయంత్రం తమ పక్కింట్లో ఉండే నూర్ మొహ్మద్ మన్సూరీ(22)ని యూనో ఆడదామని పిలిచాడు. మన్సూరీ నిరుద్యోగి. ఇద్దరూ కలిసి అబుజర్ ఇంటి ముందు ఆట ప్రారంభించారు. అబుజర్ తల్లి అయేషా ఇంటి లోపల ఉంది. కొద్ది సేపటికి నువ్వు మోసం చేస్తున్నావంటూ మన్సూరీ అబుజర్‌పై కేకలు వేయడం ప్రారంభించాడు. ఓడిపోతానని తెలిసిన దగ్గరి నుంచి మన్సూరీ మోసం చేస్తున్నావంటూ కేకలు వేస్తున్నాడని, అతని మాటలను పట్టించుకోని అబుజర్ ఎగతాళిగా నవ్వాడని దీంతో అతడి చిర్రెత్తుకుపోయిందని సాక్ష్యులు చెప్పారు. ఆగ్రహంతో ఊగిపోతున్న మన్సూరీ తన జేబులో ఉన్న కత్తిని తీసి అబుజర్‌పై దాడి చేశాడు. వీచక్షణారహితంగా పలుమార్లు పొడిచి అక్కడినుంచి పారిపోయాడు. స్థానికుల సాయంతో అయేషా తన కుమారుడు అబుజర్‌ను సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లింది. అతను అప్పటికే మరణించాడని వైద్యులు చెప్పా రు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొ ని మన్సూరీని అదుపులోకి తీసుకున్నారు.

అరవై ఏళ్ల మహిళ సాహసం

- దొంగను పట్టించిన వీరనారి

న్యూఢిల్లీ, మార్చి 5: ఓ యువకుడు అరవై ఏళ్ల మహిళకు మాయమాటలు చెప్పి మత్తు మందు కలిపిన బిస్కెట్లు తినిపించాడు. ఆమె స్పృహ కోల్పోయాక చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటన జరిగిన 2 రోజుల తర్వాత బాధిత మహిళ తను చోరీకి గురైనచోటే ఆ యువకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించింది. దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఘటన జరిగింది. విజయ్ సహదేవ్(60) అనే మహిళ హరినగర్ వెళ్లేం దుకు ఫిబ్రవరి 28న పశ్చిమ ఢిల్లీలోని ఉత్తమ్‌నగర్ బస్టాప్‌వద్ద వేచి ఉంది. ఫిలిప్ అలియాస్ విక్కీ(24) సహదేవ్ తో మాటలు కలిపాడు. తనకు తల్లిదండ్రులు లేరని, ఆ రోజు తన పుట్టినరోజని మాయమాటలు చెప్పి బిస్కెట్లు ఇచ్చాడు. ఆ బిస్కెట్లు తిని సహదేవ్ స్పృహ తప్పింది. తిరిగి ఓ గంట తర్వాత స్పృహలోకి వచ్చింది. తన పరుసు, చెవి దిద్దులు మాయమైనట్లు గుర్తించింది. ఇది ఇక్కడితో ఆగలేదు.. రెండు రోజుల తర్వాత అక్కడే, అదేవిధంగా చోరీ చేయడానికి ప్రయత్నిస్తున్న దొంగను చాకచక్యంగా పట్టుకొని పోలీసులకు అప్పగించింది. సహదేవ్ అతని కొడుకుతో కలిసి కారులో తిలక్‌నగర్ వెళుతుంది. విక్కీ తనను కలిసిన బస్టాప్ వద్ద కారు ఆపి చూస్తే బస్టాప్‌లో విక్కీ కనిపించాడు. విక్కీని గుర్తించిన సహదేవ్ పెద్దగా కేకలు వేసింది. దీంతో సహదేవ్ కొడుకుతో పాటు స్థానికులు విక్కీని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

ఆర్మీ కోర్టులో 'అమ్మ' విజయం

- కెప్టెన్‌పై ఆయుధాల అమ్మకం కేసు
- మచ్చ చెరిపేసిన మాతృమూర్తి పోరు



జమ్ము, మార్చి 5: ఆర్మీ కోర్టు మార్షల్.. అత్యంత గంభీరమైన వాతావరణం ఉండే చోటు! ఆర్మీ అధికారులే బిక్కుబిక్కుమంటూ కదులుతారు. అటువంటి చోట ఓ 'అమ్మ' పోరాడి విజయం సాధించింది. మరణించిన తన కుమారుడిపై అక్రమంగా పెట్టిన కేసులో మచ్చను చెరిపేసింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వివేక్ ఆనంద్ సింగ్... 16 గఢ్‌వాల్ రైఫిల్స్‌లో ఆర్మీ కెప్టెన్‌గా పనిచేసేవారు. 2007లో మోకాలి గాయంతో ఢిల్లీలోని ఆర్మీ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. ఆయనపై ఆయుధాల అమ్మకం రాకెట్ కేసులో అభియోగాలు నమోదయ్యాయి. కెప్టెన్ వివేక్‌ను ఆర్మీ ఆస్పత్రి నుంచి ఇంటెలిజెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుని.. దాదాపు దాదాపు నెల రోజుల పాటు నిర్బంధంలో ఉంచారు. అనంతరం ఈ కేసును ఆర్మీ జనరల్ కోర్టు మార్షల్‌కు అప్పగించారు. ఈ సమయంలో పలువురు అధికారులు ఈ అభియోగాల్లో వాస్తవం లేదని, కెప్టెన్ వివేక్‌ను ఇందులో అక్రమంగా ఇరికించారని పేర్కొన్నారు. కాగా, అయితే 2011లో మీరట్‌లో బైక్‌పై వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో వివేక్ మరణించడంతో ఆయనపై ఆ మచ్చ అలా మిగిలిపోయింది. తన బిడ్డపై ఇటువంటి అవినీతి మచ్చ ఉండడానికి లేదని, నాటి నుంచి అతడి తల్లి దుర్గావతీ సింగ్ ఆర్మీ కోర్టులో పోరాటం ప్రారంభించారు. కొందరు అధికారుల సాయంతో పిస్టల్ సీజ్ రిపోర్టు ఆధారంగా ఆమె తన వాదనలను వినిపించారు. కెప్టెన్ అమ్మబోతున్నప్పుడు సీజ్ చేశామంటూ అధికారులు 2009లో మార్చిలో కోర్టు మార్షల్ ముందుంచిన పిస్టల్ కూడా అరెస్టు చేసినప్పుడు పొందుపరిచిన దానితో సరిపోలలేదని గుర్తు చేశారు. ఎట్టకేలకు ఇటీవల ఆర్మీ కోర్టు కెప్టెన్ వివేక్‌పై ఉన్న అభియోగాలను కొట్టేసింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ డీపీ సింగ్ ప్రాసిక్యూషన్‌ను తీవ్రంగా తప్పుబట్టారు. ఒక కెప్టెన్ స్థాయి ఆర్మీ అధికారిపై తప్పుడు అభియోగాలను నమోదు చేయడం ద్వారా చట్టాన్ని ఉల్లంఘించారని అభిప్రాయపడ్డారు. కాగా, కోర్టు మార్షల్ విచారణ సమయంలో తన కుమారుడు ప్రమాదంలో మరణించడంపై అనుమానాలున్నాయని, అందులో కుట్ర కోణాన్ని తేల్చాలని ఆ మాతృమూర్తి అభ్యర్థించింది. దీనిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసి దర్యాప్తు చేపట్టాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ఫ్రంట్ సంగతి సరే..
ఓయూలో అడుగుపెట్టగలవా?



- కేసీఆర్‌కు మోదీ భయం పట్టుకుంది: ఇంద్రాసేన రెడ్డి

హైదరాబాద్, మార్చి 5 (మనం ప్రతినిధి): సీఎం కేసీఆర్‌కు మోదీ భయం పట్టుకుని రకరకాలుగా మాట్లాడుతున్నారని బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ ఏ ఫ్రంట్ పెట్టుకున్నా పర్వాలేదు, కానీ ముందు ఉస్మానియాలో అడుగుపెట్టే ధైర్యం చేయగలవా? అని ఆయన సవాల్ విసిరారు. ఈమేరకు సోమవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ మాటిమాటికి తనను జైలు, కేసుల ప్రస్తావన తెస్తున్నారని, ఇంతకీ ఆయనను ఎవరు బెదరించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక వేళ ఎవరైనా బెదిరించి ఉంటే పోలీస్ స్టేషన్‌లో కంప్లయింట్ ఇవ్వాలని సూచించారు. ప్రజల మెప్పు పొందడానికే ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారని ఇంద్ర సేనారెడ్డి అన్నారు. ఇంట్లోనో, ఒంట్లోనో, పార్టీలోనో పరిస్థితి బాగాలేకనో, మోదీ భయం పట్టుకునో కేసీఆర్ రకరకాలుగా మాట్లాడు తున్నారని, పదే పదే అబద్ధాలు చెబుతున్నారని ఆయన అన్నారు. పార్టీలో, ప్రజల్లో, కుటుం బంలో వ్యతిరేకత రాగానే, దాన్నుంచి అందరినీ డైవర్ట్ చేయడానికి కేసీఆర్ సభలు పెడతారని ఆయన విమర్శించారు. నిరుద్యోగులకు ఇప్పటివరకు ముఖ్యమంత్రి ఏంచేశారని, నోటిఫి కేషన్‌లు ఇవ్వకుండా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏం చేస్తుందని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం గర్భిణ స్త్రీల కోసం నిధులు విడుదల చేస్తే, ఆ డబ్బులతో కిట్ తయారు చేయించి, దానికి కేసీఆర్ కిట్ అని పేరు పెట్టుకున్నా ఘనత కేసీఆర్‌దని అన్నారు. కాగా, ప్రగతి భవన్ ముట్టడికి యత్నించిన బీజేపీ కార్యకర్తలను, నాయకులను, ఎమ్మెల్యేలను కేసీఆర్ పోలీసులతో ఎక్కడికక్కడ అరెస్టు చేయించడాన్ని ఇంద్రసేనా రెడ్డి తీవ్రంగా ఖండించారు.

బీజేపీ మేలుకోసమే మూడో ఫ్రంట్: మర్రి

హైదరాబాద్, మార్చి 5(మనం ప్రతినిధి): వచ్చే ఎన్నికల్లో బీజేపీకి మేలు చేసేందుకే సీఎం కేసీఆర్ మూడో ఫ్రంట్ గురించి మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మర్రి శశిధర్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. నోరు తెరిస్తే అబద్ధాలు, అసెంబ్లీలోనే ప్రకటించి కూడా అనలేదని చెప్పే ముఖ్యమంత్రి దేశ రాజకీయాల ను మార్చుతాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజకీయ వ్యవస్థ మారాలని, కొత్త ఫ్రంట్ రావాలని కేసీఆర్ చెబుతున్న మాటలు ఎన్నికల ముందు మరోసారి ప్రజలను మోసం చేసేందుకేనని ఆరోపించారు. తనపై ఉన్న కేసుల విచారణ ఎంతవరకు వచ్చిందో ముందు కేసీఆర్ ప్రజలకు వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈఎస్ఐ ఆసుపత్రుల నిర్మాణానికి అటవి శాఖకు అప్పగించడంపైనా, సహారా గ్రూప్‌కు సొంతంగా పీఎఫ్‌ను నిర్వహించుకోవడానికి అనుమతివ్వడంపైనా సీబీఐ కేసులు ఉన్నాయని, వీటిపై విచారణ పూర్తయిందా? లేదా? చెప్పాలని మర్రి డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ఎన్నికలకు, జీఎస్టీకి, నోట్ల రద్దుకు అడగక ముందే బీజేపీకి మద్దతు ఇచ్చిన కేసీఆర్ ఇప్పుడు వ్యతిరేకిస్తానంటే ఎవరు నమ్ముతారన్నారు. కేవలం కాంగ్రెస్‌ను దెబ్బకొట్టేందుకే మూడో ఫ్రంట్ ప్రతిపాదన చేస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి ఏపీలో ఉన్న సమయంలో తెలంగాణ అప్పులు 70 వేల కోట్లు ఉంటే, కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తరువాత 1.30 లక్షల కోట్ల అప్పుచేశారని, ఈ డబ్బు ఎలా ఖర్చుచేశారో, రానున్న రోజుల్లో దర్యాప్తు జరుగుతుందని చెప్పారు.



తాగునీటికి శాశ్వత ఏర్పాట్లు

- పథకాలను రెండున్నరేళ్లలో పూర్తిచేశాం
- జిల్లాల సర్పంచుల సమ్మేళనంలో జూపల్లి
- నెలాఖరులోగా ఓవర్‌హెడ్ ట్యాంకుల్లోకి నీళ్లు



మాట్లాడుతున్న మంత్రులు జూపల్లి కృష్ణ రావు, ఇంద్రకరణ్ రెడ్డి, జోగురామన్న





నిజామాబాద్, మార్చి 5(మనం న్యూస్ బ్యూరో): దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో మంచినీటికి ఇబ్బందులేకుండా శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేశామని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మొత్తం 29 రాష్ట్రాలలోనే తొలిసారిగా 2 లక్షల కిలోమీటర్లమేర పైపులైన్ ఏర్పాటుచేసి, నదీ జలాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కేవలం మూడేళ్ల వ్యవధిలో ఈ ఏర్పాట్లు పూర్తిచేయడం ప్రపంచ రికార్డని పంచాయతీరాజ్ మంత్రి జూపల్లి తెలిపారు. ఈమేరకు సోమవారం జిల్లా యంత్రాంగం బిఎల్ఎన్ గార్డెన్‌లో 13 జిల్లాల సర్పంచుల ప్రాంతీయ సమ్మేళనం నిర్వహించింది. కలెక్టర్ ఎం.ఆర్.ఎం రావు అధ్యక్షతన నిర్వహించిన సభలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కష్ణరావు, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఆటవీ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న, జిల్లా కలెక్టర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలనచేసి సర్పంచుల ప్రాంతీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు ఖర్చు తగ్గించాలని, మిషన్ భగీరథ ద్వారా మంచి నీటికి 40 వేల కోట్లు వాటర్ గ్రిడ్ పనులను ప్రభుత్వం ఖర్చు చేస్తుందని చెప్పారు. ఈనెల 31 వరకు గ్రామాలలో ఓవర్ హెడ్ ట్యాంకులు నింపుతారని జూన్ 30 వరకు గ్రామాలలో ఇంటరనల్ పైప్‌లైన్ ద్వారా ఇంటింటికి 100 లీటర్ల మంచినీరు అందిస్తుమన్నారు. భూగర్భ జలాల పెంచుటకు మిషన్ కాకతీయ పనుల మంచి నీరు అందిస్తున్నామన్నారు. భూగర్భ జలాల పెంచుటకు మిషన్ కాకతీయ పనుల ద్వారా చెరువలలో పూడిక తీయడం ద్వారా వర్షపు నీటి నిలువ ద్వారా భూగర్భ జలాలు పెరిగి సేద్యానికి ఉపయోగపడుతాయన్నారు. కరెంట్ ఖర్చులు తగ్గించడానికి అన్ని గ్రామ పంచాయతీలలో ఎల్ఈడి బల్బులు వాడాలని ఆయన తెలిపారు. అనంతరం దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ మొత్తం 13 జిల్లాల నుండి గ్రామ సమస్యల అవగాహనకు వచ్చిన సర్పంచుల ఎమ్మెల్యే, ఎంపీల మంత్రుల సహకారంతో గ్రామ పంచాయతీ సర్పంచుల మంధిని సర్పంచు లాగ ఆదాయ వనరులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వల గ్రామాల అభివద్ది కొరకు తపన చేస్తున్నాయని తెలిపారు. భవిష్యత్ భావి తరాలకు నీటి కొరత రాకూడదని మిషన్‌భగీరథ, మిషన్ కాకతీయ పథకాలు ద్వారా భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. గ్రామాలలో ముగురునీరు ఉపయోగించడానికి అందరికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆటవీ శాఖ, బిసి సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ మహాత్మ గాంధి గ్రామ స్వరాజమే దేశ స్వరాజ్య అని అన్నారు. సర్పంచుల గ్రామ పంచాయతీలలో మంచిగా పని చేస్తు ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని తెలిపారు. పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో గ్రామ సర్పంచులు పూర్తిస్థాయిలో నిమగ్నమై పనిచేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ భవిష్యత్తుకు సర్పంచ్ పదవే పునాదిలాంటిదని మంత్రి తెలిపారు.

ఆర్ఎస్ఎస్ వదిలిన బాణం కేసీఆర్

- ప్రగతి భవన్‌లో నాగ్‌పూర్ స్లీపర్‌సెల్స్
- బీజేపీ వ్యతిరేక ఓట్ల కోసమే థర్డ్ ఫ్రంట్
- ఆ పార్టీతో సీఎంకు రహస్య ఒప్పందం
- తారాస్థాయికి కేసీఆర్ కుటుంబ కలహాలు
- రాజ్యసభకు సంతోష్‌కుమార్: రేవంత్



హైదరాబాద్, మార్చి 5(మనం ప్రతినిధి):బీజేపీ రహస్య ఎజెండాలో భాగంగా టీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మూడో ఫ్రంట్‌ను తెరపైకి తెచ్చారని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో మోదీ వ్యతిరేక ఓట్లను చీల్చి, బీజేపీకి లబ్ధి చేకూర్చడమే కేసీఆర్ లక్ష్యమని రేవంత్ అన్నారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగ్‌పూర్ బ్యాచ్ ఆర్ఎస్ఎస్ కునసన్నల్లోనే కేసీఆర్ మూడో ఫ్రంట్ డ్రామా మొదలుపెట్టా రన్నారు. కేంద్రంలో బీజేపీకి మిత్రపక్షంగా చంద్రబాబునాయుడు ఏపీకి జరిగిన అన్యాయం కారణంగా వారిని వీడే అవకాశం ఉందని, కూటములు కట్టడంలో విశేష అనుభవం చంద్ర బాబు జాతీయస్థాయిలో ప్రత్యామ్నాయం ఏర్పా టుకు ప్రయత్నిస్తే తమ గెలుపు కష్టమని భావించి, బీజేపీ కేసీఆర్‌ను రంగంలోకి దింపిందన్నారు. కేసుల భయంతో కేసీఆర్ బీజేపీ చేతిలో పావులో మారాడన్నారు. ఈఎస్ఐ ఆస్పత్రుల నిర్మాణం, సహారా ఇండియాకు పీఎఫ్ నిర్వహణ అనుమతి తదితర కేసుల్లో కేసీఆర్ సీబీఐ విచారణ ఎదుర్కొంటున్నారన్నారు. వాటిని నుంచి తప్పిం చుకునేందుకు మోదీకి అనుకూలంగా వ్యవహరి స్తున్నారన్నారు. మూడో ఫ్రంట్ అంటూ డ్రామా ఆడుతున్నారన్నారు. నాగ్‌పూర్ స్లిపర్‌సెల్స్ ప్రగతి భవన్‌తోపాటు రాష్ట్రమంతా ఉన్నారని, వారి ఎజెండాను కేసీఆర్ అమలు చేసేలా వారు చూస్తున్నారన్నారు. మరోవైపు కేసీఆర్ కుటుంబ కలహాలు తారాస్థాయికి చేరాయని, కేసీఆర్ జాతీయరాజకీయాల గురించి మాట్లాడానికి అది ఓ కారణమన్నారు. కేసీఆర్ ఇంట్లోనే సంతోష్‌కుమార్ మూడో ఫ్రంట్‌గా మారారన్నారు. రాజమార్గంలో సంతోష్‌ను రాజ్యసభకు పంపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. సీఎం పదవి కోసం కేటీఆర్ పట్టుబడుతున్నాడని, ఈ విషయంపై అలిగి ఆయన తండ్రిని వదిలి మై హోంలో ఇల్లు తీసుకుని నివాసముంటు న్నాడన్నారు. కాంగ్రెస్‌కు దక్షిణాదిలో వందకుపైగా సీట్లు వస్తాయని, బీజేపీ 30 నుంచి 40 మాత్రమే వస్తాయని, అలాంటి సమయంలో చంద్రబాబు కూటమి కడితే బీజేపీ తీవ్రంగా నష్టపోతుందని రేవంత్ చెప్పారు. అందువల్లే నాగ్‌పూర్ పెద్దలు కేసీఆర్‌ను తెరపైకి తెచ్చారన్నారు. కేసీఆర్, బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందన్నారు. కేసీఆర్ వాడు వీడు అన్న మాటలను బీజేపీ ఏదోచేయాల న్నట్లుగా ఆందోళన చేస్తుందన్నారు. రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగులు ఇబ్బంది పడుతు న్నా, డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణంజరగకున్నా, ప్రాజెక్టుల్లో అవినీతి జరుగుతున్నా ఏనాడు బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడలేదన్నారు.

ఆ సమాధానాలు వెబ్‌సైట్‌లో పెట్టండి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోషి ఆదేశం

హైదరాబాద్, మార్చి 5(మనం ప్రతినిధి): గత అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను సెక్రటేరియట్ వెబ్‌సైట్‌లో పొందుపరచాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల ఉన్నతాధికారులతో సచివాలయంలో సోమవారం ఆయన సమావేశమయ్యారు. గత అసెంబ్లీ సమావేశాల్లోని రెండు నుంచి ఎనిమిదో సెషన్ వరకు పెండింగ్‌లో ఉన్న ఎల్‌సీక్యూ, ఎల్ఏక్యూ, ఎస్ఎన్‌క్యూ, రూల్ 74, రూల్ 344, జీరో అవర్ మెన్షన్, స్పెషల్ మెన్షన్‌కు సంబంధించిన సమాధానాలను సంబంధిత నోడల్ అధికారుల సాయంతో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆయా శాఖలు తమ సమాధానాలను పెండింగ్‌లో లేకుండా చూడాలని సూచించారు. ఈ నెలలో ప్రారంభమయ్యే సమావేశాలకు సంబంధించి బిల్లులు, అమెండ్‌మెంట్స్, కేబినెట్ మెమోరాండాలకు సంబంధించి చర్యలు తీసుకోవాలన్నారు. శాఖల ప్రగతి నివేదికలు, ప్రస్తుత పరిస్థితి ఇతర వివరాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలను క్లుప్తంగా శాఖలవారీగా రూపొందించి ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రతి శాఖ నుంచి నోడల్ అధికారిని నియమించుకుని శాసనసభ అధికారులతో సమన్వయం చేసుకునేలా చూడాలన్నారు. సమాధానాలు క్లుప్తంగా, కచ్చితంగా ఉండాలని, అనుబంధ విషయాలు ప్రత్యేక రూపంలో ఉండాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన వెబ్‌సైట్లలో సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. రాష్ట్రానికి సంబంధించిన మాస్టర్ డేటా ఇంటిగ్రేషన్‌పై చర్చించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అజయ్ మిశ్రా, చిత్రా రామచంద్రన్, ముఖ్య కార్యదర్శులు అధర్ సిన్హా, అరవింద్ కుమార్, శశాంక్ గోయల్, రాజీవ్ త్రివేది, వికాస్ రాజ్, శివశంకర్, కార్యదర్శులు బి.వెంకటేశం, సీ.జగదీశ్వర్, సందీప్ కుమార్ సుల్తానియా, బుద్ధప్రకాశ్ జ్యోతి, మహేష్ దత్ ఎక్కా, విజయ్ కుమార్, నిరంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అరుణారెడ్డికి క్రీడాకార్యదర్శి అభినందన

హైదరాబాద్, మార్చి 5(మనం ప్రతినిధి):ఆస్ట్రేలియాలో జరిగిన ప్రపంచ జిమ్నాస్టిక్ చాంపియన్ షిప్‌లో కాంస్య పతకం సాధించిన అరుణారెడ్డి, రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని సోమవారం సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా అరుణారెడ్డిని బుర్రా వెంకటేశం అభినందించారు. వచ్చే కామన్ వెల్త్ పోటీల్లో బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు. కాంస్య పతకం సాధించిన అరుణా రెడ్డికి ప్రభుత్వం ప్రకటించిన పారితోషకాన్ని త్వరలో అందిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ చైర్మన్ ఎ.వెంకటేశ్వర రెడ్డి, అరుణారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

15 నుంచి ఆక్వా ఎక్స్‌పో

- హాజరుకానున్న 12 దేశాల ప్రతినిధులు
- పలు అంశాలపై మత్స్యకారులకు శిక్షణ
- ఎగ్జిబిషన్ ఏర్పాట్లుపై మంత్రి తలసాని సమీక్ష



హైదరాబాద్, మార్చి 5(మనం ప్రతినిధి):మత్స్య రంగంలో నైపుణ్యం, ఆధునిక పరిజ్ఞానం వాడకం, మార్కెటింగ్ వంటి అంశాలపై మత్స్యకారులకు అవగాహన కల్పించేందుకే ఆక్వా ఎక్స్ పో- 2018 నిర్వహిస్తున్నామని పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సొసైటీ ఫర్ ఇండియన్ ఫిషరీస్ అండ్ ఆక్వా కల్చర్ సహకారంతో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు హెచ్ఐసీసీలో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తుందని తలసాని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ... దక్షిణాసియాలో మత్స్య రంగ అభివృద్ధికి మొదటిసారిగా నిర్వహిస్తున్న ఈ ఆక్వా ఎక్స్‌పో 2018 కు హైదరాబాద్ వేదికయ్యిందన్నారు. ఈ సదస్సుకు దాదాపు 12 దేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నారని తెలిపారు. ఇందులో 120 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులకు పలు అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. గత 70 ఏండ్లుగా రాష్ట్రంలో మత్స్య శాఖ నిర్లక్ష్యానికి గురయ్యిందని సీఎం కేసీఆర్ చొరవతో గత మూడేళ్లలో 70 కోట్లకు పైగా చేప పిల్లల పంపిణీ చేశామని తలసాని అన్నారు. ఈ ఏడాది 80 కోట్ల చేప పిల్లల పంపిణీ చేయాలనే లక్ష్యంగా పెట్టుకు న్నామని పేర్కొన్నారు. వెయ్యి కోట్ల ఖర్చుతో మత్స్య శాఖ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్టు తెలిపారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా నీటి వనరులు పెరిగి మత్స్య రంగం అభివృద్ధికి అవకాశాలు పెరిగాయన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, హోం శాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్ త్రివేది, పశు సంవర్ధక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, జీహెచ్ఎంసీ జనార్ధన్‌రెడ్డి, మత్స్య శాఖ కమిషనర్ సువర్ణ, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సమాచార, పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు నాగయ్య కాంబ్లే తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ విధానం బలోపేతం చేయాలి

- రవాణాశాఖలో దళారీ వ్యవస్థపై ఆగ్రహం
- బండ్లగూడ వ్యవహారంలో ముగ్గురి సస్పెన్షన్
- రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 5(మనం ప్రతినిధి): రవాణా శాఖలో అవినీతికి ఆస్కారం లేకుండా ఆన్‌లైన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శాఖలో దళారీ వ్యవస్థ మీద ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం సచివాలయంలో రవాణా శాఖ ఆధునికీకరణ, అవినీతి నివారణ, ఎస్ఐసీ ఆధారిత కార్యకలాపాలపై ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్ శర్మ, జేటీసీ రమేష్, రాష్ట్ర ఐటీ కార్యదర్శి, ఓఎస్డీ రమాదేవితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లా డుతూ.. రంగారెడ్డి జిల్లా బండ్లగూడ ఆర్టీఏ కార్యాలయంలో ఇటీవల పాత వాహనాల రిజిస్ట్రేషన్, ఆర్సీల జారీ అంశంలో చోటు చేసుకున్న అవినీతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. ఎన్నిచర్యలు తీసుకుం టున్న అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించా రు. ఇందులో భాగంగా బండ్లగూడ ఆర్టీఏ కార్యాలయంలో వాహనాల వయస్సు, ధరను తగ్గిస్తూ అవినీతికి పాల్పడి ప్రభుత్వ ఖజానాకు రూ.1.20 కోట్లు నష్టం కల్గించిన నలుగురు అధికారులను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పురుషోత్తంను రవాణాశాఖ కేంద్ర కార్యాలయానికి అనుసంధానం చేయాలని సూచించారు. నష్టపోయిన మొత్తాన్ని రికవరీ చేయాలని సూచించారు. వాహన రేటులో కృత్రిమ డిస్కౌంట్ సృష్టించి పన్ను ఎగవేతకు అవకాశం లేకుండా కంప్యూటర్ సిస్టమ్‌లో ఎక్స్ షోరూం ధరను పెట్టాలని నిర్ణయించారు. ప్రతి దస్త్రాన్ని క్లర్క్‌తోపాటు ఏవో స్థాయిలోనూ పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకునే విధంగా కంప్యూటర్ సిస్టమ్‌లో మార్పులు చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాలనుంచి సెంకడ్ హ్యాండ్‌లో కొనుగోలుచేసే వాహనాల డాటా ఎంట్రీ సమయంలో కేంద్ర ఆధ్వర్యంలో నడిచే ఎస్ఐసీ నుంచి వివరాలు తీసుకుని రేటు, వయస్సు నిర్ణయించి ట్యాక్స్ వసూలుచేయాలని ఆదేశించారు. రవాణా శాఖ సాఫ్ట్‌వేర్‌ను దుర్వినియోగం చేసి అవకతవకలకు పాల్పడకుండా బ్లాక్ చైన్ సాంకేతికత పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు.

తాత్కాలిక ఉద్యోగులకు వెయిటేజి..
ప్రతిభావంతులకు అన్యాయమే: కోర్టు



హైదరాబాద్, మార్చి 5(మనం లీగల్ ప్రతినిధి): ట్రాన్స్‌కో, మెడికల్ శాఖల్లో వివిధ పోస్టుల భర్తీ సమయంలో తాత్కాలిక, ఒప్పంద కార్మికులకు ప్రాధాన్యమిస్తూ వెయిటేజీ మార్కులు ఇవ్వడాన్ని సవాల్ చేసిన పలు రిట్ పిటిషన్లపై సోమవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. నేడు సమయం సరిపోకపోవడంతో కేసు ప్రాధాన్యత దృష్ట్యా బుధవారం సమగ్రంగా విచారణ కొనసాగిస్తామని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. తా త్కాలిక, ఒప్పంద ప్రాతిపదికపై ఉద్యోగాలు చేసే వారికి వెయిటేజీ మార్కులు ఇస్తే పోటీపరీక్షల్లో ప్రతిభ చూపేవారికి తీరని అన్యాయం జరుగుతుందన్నది పిటిషనర్ల లాయర్ వాదన. సుప్రీంకోర్టు కూడా పోటీపరీక్షల్లో అందర్నీ సమానంగానే చూడాలని, వెయిటేజీ మార్కులు ఇవ్వడం చెల్లదని చెప్పిందని ఆయన చెప్పారు. విచారణ 7వ తేదీకి వాయిదా పడింది.

శ్రీనివాసన్ హాజరుపై తీర్పు వాయిదా

హైదరాబాద్, మార్చి 5(మనం లీగల్ ప్రతినిధి): ఇండియా సిమెంట్స్‌కు గనుల లీజు, నీటి కేటాయింపులపై ఈడీ నమోదు చేసిన కేసు విచారణకు స్వయంగా కోర్టు విచారణకు హాజరుకావాలన్న ఉత్తర్వుల్ని రద్దు చేయాలని కోరుతూ ఆ కంపెనీ చైర్మన్ శ్రీనివాసన్ దాఖలు చేసుకున్న వ్యాజ్యంపై హైకోర్టు తీర్పు వాయిదా పడింది. శ్రీనివాసన్ పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో వాదప్రతివాదనలు ముగియడంతో తీర్పును తర్వాత వెలు వరిస్తామని న్యాయమూర్తి షమీమ్ అక్తర్ వెల్లడించారు. వయసు మీదపడినందన, ఇప్పటికే ఇదే తరహా ఆరోపణలపై సీబీఐ పెట్టిన కేసును హైకోర్టు కొట్టేసినందున ఈకేసులో కూడా తనకు అనుకూలంగా ఉత్తర్వులు ఇవ్వాలని శ్రీనివాసన్ లాయర్ వాదించారు.

కోర్టుకు హాజరయ్యేందుకు శ్రీనివాసన్‌కు ఎందుకు అభ్యంతరమో అర్థం కావడం లేదని, అంత వయసులో అనేక వ్యాపారాలు ఎలా చేయగలుగుతున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ తరపు లాయర్ వాదించారు. అనంతరం హైకోర్టు తీర్పు వాయిదా పడింది.

దేశ రాజకీయాలను కాదు..
ముందు మా జీవితాలు మార్చు సారూ!

- ఏపీ సచివాలయంలో తెలంగాణ ఉద్యోగుల ఆవేదన

హైదరాబాద్, మార్చి 5, (మనం ప్రతినిధి): దేశ రాజకీయాలను మార్చడం తర్వాత.. ముందు మా జీవితాలను మార్చాలని ఏపీ సచివాలయంలో పని చేస్తున్న తెలంగాణకు చె ందిన నాల్గో తరగతి ఉద్యోగులు సీఎం కేసీఆర్‌ను కోరారు. సోమవారం సచివాలయం ఎదుట నిరసనకు దిగారు. నిరసన కార్యక్రమంలో 233 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాధనలో తాము ఎంతో కష్టపడామని తెలిపారు. రాష్ట్రం వచ్చినప్పుడు ఆరునెలల్లో ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను తిరిగి తీసుకొస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారని, నాలుగేండ్లు కావస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలు తెలంగాణలో తాము ఏపీలో పని చేయడం ఎంతో కష్టంగా ఉందని పేర్కొన్నారు. వారానికోసారి వచ్చి వెళ్లడంతో రవాణా సమస్య తలెత్తుతోందని తెలిపారు. తమపై ఏపీ ప్రభుత్వం సానుకూలంగా ఉందని, కేసీఆర్ చొరవ చూపి తమను తెలంగాణ ప్రాంతానికి రప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

చిన్నారెడ్డి ఓ సైకో

- వనపర్తి ఎమ్మెల్యేపై నిరంజన్‌రెడ్డి ఫైర్
- రేవంత్‌రెడ్డి దొరికిపోయిన దొంగ

వనపర్తి, మార్చి 5(మనం ప్రతినిధి): వనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ జి.చిన్నారెడ్డిపై రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. చిన్నారెడ్డి ఓ సైకో అని అన్నారు. నిరంజన్‌రెడ్డి వనపర్తిలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. బహిరంగంగా దొరికిన దొంగ రేవంత్‌రెడ్డితో నాపై తప్పుడు ఆరోపణలు చేయిస్తావా అంటూ ఆయన చిన్నారెడ్డిపై విరుచుకుపడ్డారు. వనపర్తిలో ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన సింహగర్జన సభకు కొడంగల్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డిని పిలిపించి నాపై తప్పుడు ఆరోపణలు చేయించి పైశాచిక ఆనందం పొందుతావా అని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. గత ఎన్నికల్లో చీప్ లిక్కర్ పంపిణీ చేసిన ఘనత చిన్నారెడ్డికే దక్కుతుందని ఆయన అన్నారు. తాము చేసిన త్యాగాలు, ఉద్యమాల వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. దిగజారుడు రాజకీయాలకు చిన్నారెడ్డి నిదర్శనమని ఆయన ఒక సైకో అని దుయ్యబట్టారు.

నాలుగు పార్టీలు మారిన ఊర కుక్కను తీసుకొచ్చి తనను తిట్టించినంత మాత్రానా పెద్ద నాయకులు కాలేరని, తాను రాజకీయాల్లోనే కాదు ఓ న్యాయవాదిగా పేద ప్రజలకు ఎంతో సేవ చేసిన వ్యక్తిని అని చెప్పారు. పెద్ద నోట్ల రద్దు జరిగిన రాత్రి 29 కేజీల బంగారం కొన్నట్లు తనపై చేసిన ఆరోపణలకు రుజువు ఉంటే వాటిని తీసుకొని మీడియా ముందుకు రావాలని, లేకపోతే 12 గంటల్లో భేషరతుగా క్షమాపణలు చెప్పాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పని చేసిన చిన్నారెడ్డి నాలుగు ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేకపోయాడన్నారు. మతిస్థిమితం లేకుండా పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడితే ప్రజలే బుద్ధి చెబుతారని, చిన్నారెడ్డి నీచ చరిత్ర చెప్పడానికి ఆయన భార్య చాలు అని అన్నారు. నిజాలు బయటపెడితే చిన్నారెడ్డి ఆత్మహత్య చేసుకుంటాడన్నారు. సొంత గ్రామానికి కూడా నీళ్లు తెచ్చుకోలేని దుస్థితిలో ఉన్నాడని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో చిన్నారెడ్డిని ఘోరంగా ఓడిస్తానని నిరంజన్‌రెడ్డి చెప్పారు.



మాట్లాడుతున్న ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
మంగళవారం, మార్చి 6

శూన్యం నుంచి శిఖరానికి...

ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ అద్భుత ప్రతిభను చూపింది. ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించినట్లుగా బీజేపీ త్రిపురలో విజయం సాధించడం ద్వారా శూన్యం నుంచి శిఖరానికి చేరింది. విజయం చిన్నదే అయినా విలువైన విజయంగా దేశవ్యాప్త సంకేతాలు పంపింది. ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వచ్చినా, అవి ఆ పార్టీ ఈశాన్య రాజకీయ జైత్రయాత్రకు మైలురాళ్లుగా నిలిచాయి. త్రిపురలో వేర్పాటువాద ఇండిజీనియస్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ)తో కలిసి పోటీ చేసిన బీజేపీ 25 ఏళ్ళ పాటు ఉనికిలో ఉన్న సీపీఎమ్ నేతృత్వంలోని వామపక్ష కూటమిని గద్దె దించింది. త్రిపురలో బీజేపీ 35 స్థానాల్లో, దాని మిత్రపక్షం ఐపీఎఫ్‌టీ 8 స్థానాల్లోనూ విజయం సాధించింది. నాగాలాండ్‌లో బీజేపీ 11 స్థానాల్లోనూ, దాని మిత్రపక్షం అధికార పార్టీ నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) 27 స్థానాల్లోనూ, తాజా మిత్రపక్షం నేషనల్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ) 16 స్థానాల్లోనూ విజయం సాధించి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పరచే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి. అదేవిధంగా మేఘాలయలో బీజేపీ కేవలం 2 స్థానాల్లోనే విజయం సాధించినా, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ), యూడీపీ, స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 38 స్థానాల్లో ఆ పార్టీకి అనుకూలురు విజయం సాధించడంతో వారందర్నీ కలుపుకొని మిశ్రమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ విజయానికి ప్రధాన కారణంగా స్థానిక ఆదివాసీ ప్రజల స్వయం పాలనాధికార డిమాండ్ సహా, ఆదివాసుల సమస్యలపై పోరాడుతున్న ప్రాంతీయ పార్టీల మద్దతును కూడగట్టడమే. రెండేళ్ళ క్రితం వరకు ఏడు ఈశాన్య రాష్ట్రాల్లో నామమాత్రంగా ఉనికిలో ఉన్న బీజేపీ ప్రస్తుతం వాటిలో ఐదు రాష్ట్రాల్లో అధికారాన్ని కైవసం చేసుకోవడమే కాక, మేఘాలయలో కూడా బీజేపీ అనుకూల సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడనుంది. మిజోరంలో బీజేపీ/ఎన్డీఏయేతర ప్రభుత్వం ఉన్నప్పటికీ, ఈ ఏడాది చివరలో జరుగబోతున్న ఆ శాసనసభ ఎన్నికలు ఎలాంటి తీర్పునిస్తాయో వేచి చూడాలి.

జాతీయ స్థాయిలో ఏమంత రాజకీయ ప్రాధాన్యం సంతరించుకోని ఈశాన్య రాష్ట్రాలలో బీజేపీ అధికారంలోకి రావడానికి ఏ సామాజిక, రాజకీయ అంశాలు దోహదం చేశాయి? అస్సాంలో ఐదుగురు, అరుణాచల్‌ప్రదేశ్‌లో 11 మంది, ఇతర ఈశాన్య రాష్ట్రాలలో ఒకరిద్దరు శాసనసభ్యులు మాత్రమే ప్రాతినిధ్యం ఉన్న బీజేపీ ఒక్కసారిగా అధికారంలోకి రావడానికి దోహదం చేసిన అంశాలేమిటి? ఈ ప్రాంతం నుంచి కేవలం 24 మంది ఎంపీలు మాత్రమే లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, అనేక ప్రాంతాల్లో క్రైస్తవ మతం ప్రబలంగా ఉన్నప్పటికీ, బీజేపీ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ ఈ ప్రాంతంపై తన కాలాన్ని, వనరులను పెద్ద ఎత్తున వినియోగించడంలో పరమార్థమేమిటి? ఈశాన్య ప్రాంత ఆదివాసీలలో పాతుకుపోతున్న క్రైస్తవ మతాన్ని నిలువరించే లక్ష్యంతో రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆరెస్సెస్) సుదీర్ఘకాలంలో మారుమూల పర్వతప్రాంతాలలో పనిచేయడం బీజేపీ విజయానికి పునాదులు వేసింది. అదీకాక ప్రత్యేక రాష్ట్రాల ఏర్పాటు, వివిధ జాతుల స్వయం ప్రతిపత్తి ఆకాంక్షలను, డిమాండ్లను బీజేపీ స్వాగతించడంతో ప్రాంతీయ, జాతుల స్వయం నిర్ణయాధికార డిమాండ్‌పై పనిచేస్తున్న ప్రాంతీయపార్టీల మద్దతు లభించింది. అదీకాక జాతీయ సమగ్రత పేరుమీద 'అఖండ్ భారత్' అనే బీజేపీ నినాదానికి కీలకమైన ప్రాంతాలు దేశ సరిహద్దులేనని ఆ పార్టీ భావిస్తోంది. దాంతో దేశ ప్రధాన భూభాగానికి దూరంగా విసిరివేసినట్లు, బలహీనమైన ఆర్థిక, రాజకీయ అనుసంధానంతో కొనసాగుతున్న ఈశాన్య ప్రజానీకాన్ని సంఘటితం చేయడంపై సంఘపరివార్ కొన్నేళ్లుగా కృషిచేస్తోంది. దాంతో ఈశాన్య రాష్ట్రాలు బీజేపీ రాజకీయ కార్యాచరణలో సరిహద్దులుగా కాక, కీలక వ్యూహాత్మక ప్రాంతాలుగా మారాయి. ఈశాన్య భారతంపై కాషాయి జెండా ఎగిరేందుకు ఈ నేపథ్యం దోహదం చేసింది.

ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ విజయపథం దేశవ్యాప్తంగా ప్రభావం ఇస్తాయని, సార్వత్రిక ఎన్నికల్లో ఈ విజయాలు అనుకూలిస్తాయని ఆ పార్టీ నాయకత్వం, శ్రేణులు జోరుగా ఊహాగానాలు చేస్తున్నాయి. రోడ్లు, వంతెనలు, నీటి సరఫరా, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలతో ఈశాన్య భారతం దశాబ్దాలుగా కేంద్ర ప్రభుత్వ పక్షపాతం వైఖరి కారణంగా అభివృద్ధికి నోచుకోలేదు. అపారమైన సహజ వనరులకు ఆలవాలమైనప్పటికీ పారిశ్రామిక, వ్యవసాయక అభివృద్ధి జరగలేదు. బ్రిటీష్ కాలం నాటి నుంచి పాలకుల వివక్షకు గురవుతున్న ఈశాన్య భారతంలో స్వయం నిర్ణయాధికార డిమాండ్‌తో జాతుల పోరాటాలు సఫలం కాలేకపోయాయి. పర్యవసానంగా స్వయంప్రతిపత్తి కోసం, ప్రత్యేక రాష్ట్ర సాధన డిమాండ్ చేసే ప్రాంతీయ పార్టీలు ఉనికిలోకి వచ్చాయి. చిన్న రాష్ట్రాల ఏర్పాటుతోనే ప్రగతి సాధ్యమనే నినాదంతో బీజేపీకి అది లాభించింది. ఈశాన్య రాష్ట్రాల ప్రత్యేక పరిస్థితులను ప్రతిబింబిస్తూ వచ్చిన ఎన్నికల ఫలితాలను దేశవ్యాప్త సాధారణ ధోరణికి ప్రతీకగా భావించడం సరికాదు. అదీకాక ఇతర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు ఈసారి బీజేపీ తరపున పోటీ చేశారు గెలిచారు. అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి, ఆయన అనుచర గణం కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చి చేరడమే కాక, నాగా పీపుల్స్ ఫ్రంట్, సిక్కిం డెమొక్రటిక్ పార్టీలు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలుగా చేరడం కూడా బీజేపీకి కలసి వచ్చింది. త్రిపురలో కాబోయే ముఖ్యమంత్రి బిప్లాబ్ దేవ్ మినహా మిగిలిన వారెవరూ బీజేపీ-ఆరెస్సెస్ మాతృక నుంచి వచ్చిన వారు కారు. ఆర్థికాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించి పాలన సాగించినప్పటికీ మెజారిటీ ప్రజలను ఓటు బ్యాంకులకు మార్చే దృక్పథం నుంచి బీజేపీ బయటపడి ఆదివాసీ తదితర మైనారిటీలకు అవకాశం కల్పించనంత వరకు ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ పాలన సాఫీగా సాగదు. ఆదివాసీల సంస్కృతి జీవనశైలికి వ్యతిరేకమైన గో మాంస నిషేధం వంటి అంశాలలో బీజేపీ రాజీపడక తప్పదు. ఏకీకృత హిందూ అస్తిత్వ నినాదంతో అధికారం కోసం మెజారిటీ సమూహ ఏకీకరణ కార్యకలాపం సుదీర్ఘకాలంలో విద్వేషకాండలకు దారితీసే ప్రమాదముంది. శూన్యం నుంచి శిఖరానికి చేరుకోవడం ఎంత కష్టమో, తేడా వస్తే శిఖరం నుంచి శూన్యానికి దిగజారడం అత్యంత సులభమనే సత్యాన్ని గుర్తించాలి.




మంచిమాట



'జీవితంలో ప్రతిరోజూ క్రితం రోజు కన్నా కాస్తో కూస్తో ఎక్కువ విషయాలు నేర్పుతుండాలి.'

- రవీంద్రనాథ్ ఠాగూర్



సమీర్ శర్మ, ఐ.ఎ.ఎస్


సమాలోచన

2జి... రాజకీయాలు-ఐఏఎస్‌లు

పాలనా యంత్రాంగం వెబర్ నమూనా నుంచి దూరం జరగాలి. విధాన నిర్ణయాల ఆరంభస్థానం సంప్రదాయకమైనదే కావచ్చు- సంభావ్య ప్రభావాల అంచనాలు, ప్రత్యామ్నాయాల జాగరూక విశ్లేషణ ప్రాతిపదికన కార్యాచరణపై నిర్ణయం తీసుకునేది కావచ్చు. ఈ ఆరంభస్థానం తర్వాత పాలనా యంత్రాంగం సాంకేతిక కాఠిన్యానికి దూరంగా రాజకీయ పాలనతో అంగీకారానికి రావాలి - రాజకీయ నాయకులతో కలసి పనిచేయడం, అభివృద్ధి కార్యక్రమాలతో పటిష్ఠ పాలనా పద్ధతులు-ప్రక్రియలను చక్కగా జోడించడం, వ్యూహాత్మక ఆలోచనలను ప్రవేశపెట్టి తద్వారా లక్ష్యాలను సాధించాలి.

గత నెలలో ఢిల్లీలో చోటుచేసుకున్న పరిణామాలు, 2017 డిసెంబర్‌లో 2జి కుంభకోణం కేసుపై తీర్పు ఫలితంగా రాజకీయాలు-అధికార యంత్రాంగం మధ్య సంబంధాలపై ఇప్పుడు అందరి దృష్టీ కేంద్రీకృతమైంది. అధికార యంత్రాంగం పనితీరుకు రాజకీయాలు కీలకమన్న విషయం భారత సివిల్ సర్వీసు (ఐసీఎస్) ధ్రువీకరించింది కూడా. 'స్వతంత్రం సిద్ధించిన తొలినాటి నుంచే రాజకీయాల్లోనే పరిపాలన సాగిందన్నది నిర్వివాదాంశ'మని దేశానికి స్వాతంత్ర్యం రాగానే మంగత్ రాయ్ వ్యాఖ్యానించారు. అలాగే 'రాజకీయాలు-ఆచరణాత్మక ఆలోచనలన్నవి వాస్తవంలో విడదీయరానివి' అని లాల్ కూడా పేర్కొన్నారు. ఆ తర్వాతి కాలంలో ఉన్నతస్థాయి అధికార యంత్రాంగంలో తన అనుభవాలను ఎల్.పి.సింగ్ 1971 నాటి శిక్షణార్థి ఐఏఎస్‌ల బృందానికి ఇలా వివరించారు. 'ఆచరణాత్మకంగా చూస్తే ప్రభుత్వమంటే రాజకీయమే... మీరు చేసేది ఏదైనా అది రాజకీయంతోనే ముడిపడి ఉంటుంది. అందువల్ల మన దేశంలో లేదా కనీసం ఇతర దేశాల్లోని రాజకీయ వ్యవస్థలకు సంబంధించి రాజకీయ నడవడిని, సమస్యలను అనునిత్యం మీరు అధ్యయనం చేస్తుండాలి. లేనిపక్షంలో మీరు ఎన్నటికీ అగ్రశ్రేణి ఉన్నత ప్రభుత్వోద్యోగి (సివిల్ సర్వెంట్) కాలేరు. సివిల్ సర్వెంట్లకు ఎదురయ్యే సమస్యల్లో అత్యధికం మన రాజకీయ వ్యవస్థ పనితీరుకు సంబంధించినవే కావడం సర్వసాధారణం. ప్రభుత్వ వ్యవహారాల విషయంలో సివిల్ సర్వెంట్లకు గల అత్యంత ఆదర్శవాద ధృక్పథంతో పాటు రాజకీయాలకు అధికారమే పరమావధి అన్న వాస్తవాన్ని గుర్తించకపోవడం కూడా ఇందుకు కారణం' అని స్పష్టం చేశారు.

దీన్నిబట్టి ఐసీఎస్ అధికారులు చెబుతున్నదేమిటంటే- రాజకీయాలను అధికార యంత్రాంగ విధి నిర్వహణకు వెలుపలి అంశంగా కాకుండా అంతర్భాగంగా పరిగణించాలి. రాజకీయ 'జోక్యాన్ని' 'కార్యాచరణ'గా రూపుదిద్దడం కోసం రాజకీయాలతో వ్యవహరించే ప్రమాణాల రూపకల్పన అవసరం. వ్యవహరణ అంటే-రాజకీయ పాలనాధికారితో సంబంధాన్ని సిద్ధాంత వైరుధ్యంగా కాకుండా ప్రయోజన వైరుధ్యంగా మాత్రమే అధికార యంత్రాంగం పరిగణించడం. ఏకాభిప్రాయ సాధనదిశగా అధికార యంత్రాంగం సిద్ధాంత వైరుధ్యాన్ని ప్రయోజన వైరుధ్యంగా మార్చగలగాలి (అంటే ఏదో ఒక ఒప్పందానికి రావడం కాదు). ఇదెలా సాధ్యమవుతుంది? దీనికి సంబంధించి మార్గదర్శనం చేయగల సాధారణ నియమాలు, సార్వత్రిక నిబంధనలేవీ లేవు. సిద్ధాంత వైరుధ్యాలను ప్రయోజన వైరుధ్యాలుగా మలచడానికి ప్రభావశీలురైన కొందరు విధాన రూపకర్తలు (ఉదా॥ వాల్డన్) అనుసరించిన విధానాల సంకలనం కొన్ని సూచనలతో పాటు నాలుగు విస్తృత ప్రాతిపదికలను నిర్దేశిస్తోంది. అవేమిటంటే- చురుకైన రాజకీయ ఆచరణ, 'ఆలోచనలో దిట్ట'ల గుర్తింపు, పౌర భాగస్వామ్యంపై దృష్టి, పరిణామానుసరణపై శ్రద్ధ.



చురుకైన రాజకీయ ఆచరణ- ఇందులో మొదటి సూత్రం వెబర్ సూచించిన సాంకేతిక కాఠిన్యానికి దూరం జరగడం. ఆ మేరకు రాజకీయ పరిపాలనతో అంగీకారానికి రావడం- రాజకీయ నాయకులతో కలసి పని చేయడం, పటిష్ఠ పాలన పద్ధతులు-ప్రక్రియలను అభివృద్ధి కార్యక్రమంతో చక్కగా జోడించడం, తద్వారా లక్ష్యాల సాధన. రెండోది- 'ఏ ఆలోచనైనా కేవలం దాని సామర్థ్యం ఆధారంగా తనంతట తాను విజయవంతం కాజాలదు' కాబట్టి దానికి వెలుపలి నుంచి మద్దతు కోసం అధికారులు అన్వేషించాలి. వర్తమాన అభివృద్ధి కార్యక్రమాలలో సదరు ఆలోచనలు ఇమడగలగాలి. అంతేగాక రాజకీయ నాయకుల, ప్రజల అవసరాలపై అవగాహన ప్రాతిపదికగా పాలనపరమైన ప్రతిస్పందనలుండాలి. ఆలోచనలను సమర్థించుకునే సమయంలో సంబంధాలు ముఖ్యం. సంబంధాలంటే భావోద్వేగాలు. రాజకీయ భాగస్వాములు, పౌరుల నుంచి కొత్త ఆలోచనల స్వీకరణకు తోడ్పడతాయి గనుక భావోద్వేగాలకు చాలా ప్రాముఖ్యం ఉంటుంది. మూడోది- ప్రభావశీల పౌర భాగస్వామ్యం... ప్రత్యేకించి పౌరజోక్యం గల ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో చాలా అవసరం. అంటే... 'ప్రజా బాహుళ్యం' నిర్ణయాలను గౌరవించడమేగాక లక్ష్యసాధన కోసం పౌర భాగస్వామ్య అవకాశాలను సద్వినియోగం చేసుకోవడమన్న మాట. సంప్రదాయకంగా ప్రజలతో సంప్రదింపుల ద్వారా ఒక్కసారి వారిని ఆకట్టుకోగలిగితే పౌర భాగస్వామ్యాన్ని సాధించడం సులువైపోతుంది. దాంతోపాటు వారి ఆందోళనలను, సమస్యలను సానుభూతితో ఆలకించడమూ అవసరం. దీనికి అర్థం... వారి అభిప్రాయాలను తీవ్రంగా పరిగణించడమో, వారి తరపున వారే కార్యాచరణకు దిగే అవకాశం ఇవ్వడమో కాదు.

ఏదేమైనా- నిజమైన ప్రజాభాగస్వామ్యమంటే... 'సంఘటితంగా వ్యవహరించగల, సాపేక్షంగా తమ చుట్టూ గల పరిస్థితులను సానుకూలం చేయగల ప్రభావశీలురైన ప్రజలు తమను తాము విభిన్నంగా పరిగణించుకోవడం. ఆ మేరకు తాము ప్రభావితులం కాదని కర్త-కర్మ-క్రియ తామేనని వారు భావిస్తారు. ఇలాంటి మెరుగైన ప్రపంచ దృక్పథాన్ని అలవరచుకున్న వారు దాన్ని సాధించడం కోసం సమన్వయంతో వ్యవహరించగలరు.' నాలుగోది- ఏ పనీ దానంతట అది పూర్తికాదు కాబట్టి వినూత్న చొరవతో ఆలోచనలకు రూపుదిద్ది వాటిని ముందుకు తీసుకెళ్లాలి. దాంతోపాటు తదనంతర పరిణామాల అనుసరణలో భిన్న మార్గాల ఎంపికకు వెసులుబాటు ఉండటమన్నది లక్ష్యసాధనకు బాటలు పరుస్తుంది. ఇతరుల ఆలోచనలను సాకల్యంగా ఆలకించి, స్పందించడమన్నది ఇందులో కీలకం. సుస్థిరత దిశగా కార్యాచరణతో పాటు పథక నిర్మాణానికి స్వరూపమిచ్చే విస్తృత బాధ్యత ఏర్పడటానికి ఇది దోహదపడుతుంది. అంటే మీరు చేసే మంచి పనుల కీర్తి తరచూ ఇతరులకు ఆపాదించబడుతుంది. అయితే, అనుకున్న పని చక్కగా పూర్తయిందన్న అంతిమ సంతృప్తి మాత్రం అందరికీ మిగులుతుంది.

అందువల్ల పాలనా యంత్రాంగం వెబర్ నమూనా నుంచి దూరం జరగాలి. విధాన నిర్ణయాల ఆరంభస్థానం సంప్రదాయకమైనదే కావచ్చు- సంభావ్య ప్రభావాల అంచనాలు, ప్రత్యామ్నాయాల జాగరూక విశ్లేషణ ప్రాతిపదికన కార్యాచరణపై నిర్ణయం తీసుకునేది కావచ్చు. ఈ ఆరంభస్థానం తర్వాత పాలనా యంత్రాంగం సాంకేతిక కాఠిన్యానికి దూరంగా రాజకీయ పాలనతో అంగీకారానికి రావాలి- రాజకీయ నాయకులతో కలసి పనిచేయడం, అభివృద్ధి కార్యక్రమాలతో పటిష్ఠ పాలన పద్ధతులు-ప్రక్రియలను చక్కగా జోడించడం, వ్యూహాత్మక ఆలోచనలను ప్రవేశపెట్టి తద్వారా లక్ష్యాలను సాధించాలి. ఆయా రాష్ట్రాల్లోనేగాక ఒకే రాష్ట్రంలోనూ పాలనా వ్యవస్థలు, విలువలు, సంస్కృతి దేనికదే భిన్నంగా ఉంటాయన్నది వాస్తవమే! అయితే, సిద్ధాంతాలను ప్రయోజనాలుగా మలచగలిగే నైపుణ్యాన్ని పాలనా యంత్రాంగం అభ్యాసం ద్వారా సాధించగలదన్నదే ఈ వ్యాసమిస్తున్న ఉత్తమ సందేశం.

(రచయిత కేంద్ర పట్టణాభివృద్ధి వ్యవహారాల శాఖలో అదనపు కార్యదర్శి. ఇందులోని అభిప్రాయాలు పూర్తిగా ఆయన వ్యక్తిగతం)

మన లేఖలు

థర్డ్ ఫ్రంట్ తక్షణావసరం

నిజానికి స్వతంత్రం వచ్చినప్పటి నుంచి ఎక్కువ కాలం కేంద్రంలో రెండే పార్టీలు దేశాన్ని పాలిస్తున్నాయి. అప్పట్లో కొందమంది నాయకులు థర్డ్ ఫ్రంట్ పై చర్చలు జరిపారు కాని అవి కార్యరూపం దాల్చలేదు. నేడు కె.సి.ఆర్ థర్డ్ ఫ్రంట్ గూరించి మాట్లాడటమే కాకుండా దేశంలో గుణాత్మక మార్పు రావాలని అవసరమైతే నాయకత్వం వహిస్తానని చెప్పడం ఆహ్వానించ తగినదే. వివిధ కారణాల చేత తెలుగువారు బౌగోళికంగా విడిపోయాము కాని తెలుగు వారు అంతా ఒకటేనని నిరుపించాల్సిన అవసరం ఉంది. తెలు గు వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా ఆనాడు ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి అధికారంలోకి రావడమే కాకుండా థర్డ్ ఫ్రంట్‌కి నాయకత్వం వహించారు కూడా. అలాంటి సత్తా కేసీఆర్‌కే ఉందని చెప్పవచ్చు. ఎందు కంటే ఆయన అనుకున్నది సాధించకుండా ఉండరు. పూర్వం ఎంపీగా, కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఇంకా చెప్పాలంటే ఆయన ప్రత్యేక హోదా గురించి మాట్లాడి ఇటు ఆంధ్ర ప్రజల మనసులు కూడా గెలుచుకున్నరనే చెప్పాలి. ఎప్పటి నుంచో దక్షిణాదిని చిన్నచూపు చూస్తున్నారు అనే భావన ఉంది. బడ్జెట్‌లో కేటాయింపులు దక్షిణ రాష్ట్రాలకు తక్కువే. కావునా దక్షిణాది పార్టీలు అన్నీ ఒక్కటిగా నిలవాల్సిన అవసరం ఉంది. ఇప్పటికిప్పుడు థర్డ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోవచ్చు కాని అధికార బిజెపి దూకుడుకు అడ్డుకట్ట మాత్రం పడుతుంది. నిజానికి రాహుల్ సారథ్యంలో కాంగ్రెస్ పార్టి బిజెపిని పెద్దగా ఎదుర్కోలేకపోతోంది. మోదీ ప్రవేశపెట్టిన నోట్ల రద్దు పై కాని, కోట్లు దోచుకొని దేశం విడిచిన మోసగాళ్ళ తీరుపై గాని కాంగ్రెస్ పోరాడలేకపోయింది. ఇలాంటి సమయంలో కేంద్ర ,రాష్ట్ర రాజకీయాలపై పూర్తీ పట్టు ఉన్న నాయకుల అవసరం ఉంది. అటు కెసిఆర్ వ్యూహాలు ఇటు చంద్రబాబు చాకచక్యం కూడా అవసరమే. ఇక పవన్ కళ్యాణ్ మద్దతు ఎలాగో ఉంది. ఇప్పటికే అటు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మమత బెనర్జీ కెసిఆర్ స్టేట్మెంట్ కి పూర్తీ మద్దతు తెలిపారు ఇలాగే అన్ని ప్రాంతీయ పార్టీల మద్దతు తీసుకుంటే తప్పకుండా బిజెపికి దీటుగా జవాబు చెప్పినవారౌతారు.

- విరాజిత (నిజాగ్ని),
సామాజిక విశ్లేషకురాలు

చేనేత సంత

చేనేత కార్మికుల సంత ఈ నెల 9 నుంచి మూడురోజుల పాటు (11వ తేదీ వరకు) హైదరాబాద్‌లో జరుగుతుంది. అమీర్‌పేటలో గల బిగ్‌సీ పక్క సందులోని నాగార్జుననగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటలవరకు జరుగుతుంది.

- కవుల సరస్వతి
చేనేత చైతన్య వేదిక

ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు పంపేవారు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ రెండు ఫార్మాట్‌లలో పంపవలసిందిగా సూచన.
e-mail: manamlekhalu@gmail.com

మొగ్గలు



కవిత


కలం ఒక ధనుస్సు అయితే
అక్షరం గుండెల్లో గుచ్చే గునపం
కవి పహారా కాసే ప్రజారక్షకుడు
ధీరుడు దేనికి తలవంచనట్లే
కవి కవిత్వాన్ని విరమించడు
మానవాళికి వీరిద్దరూ ఆదర్శప్రాయులు

అందరికీ అన్నం పెట్టే అన్నదాత
నువు ఆగమైతే నిలువగలడా ఆ విధాత
దేశానికి నువ్వే కదా భాగ్యదాత
మద్యం సేవిస్తే మధురమెక్కడుంటుంది
మతిపోయే మైకం తప్ప
ఆరోగ్యానికి మద్యం ఎప్పటికీ హానికరం
ధూమపానం పీల్చితే గమ్మత్తు ఏముంటుంది
గతి తప్పే మనసుకు రోగం తప్ప
ఆరోగ్యనికి హానికరం ధూమపానం

- డాక్టర్ గుంటి గోపి

ఉన్నత విద్యావ్యవస్థకు ఊతమేది?

ప్రపంచంలోనే అతి ప్రాచీన విశ్వవిద్యాలయాలుగా పరిగణింపదగిన, యునెస్కోచే సైతం గుర్తింపు ఉన్న తక్షశిల, నలంద విశ్వవిద్యాలయం లాంటి వాటితో పాటుగా అనేక ఇతర విశ్వవిఖ్యాత విద్యాసంస్థలకు సైతం వేదికై విశ్వగురువుగా స్థానం పొంది ప్రపంచం నలుమూలలకు జ్ఞానాన్ని ప్రసరింపజేసి విద్యారంగంలో తన ప్రతిభను ఏనాడో చాటుకున్న భరతభూమి నేడు అంతటి స్థాయి విశ్వవిద్యాలయాలు లేక వెలవెలబోతున్నది. పూర్వకాలంలోనే అనేక శాస్త్రాలకు నెలవుగా ఉన్న మన భరత భూమి విశిష్ట అధ్యాపకులను, విఖ్యాత ఆచార్యులను, వినూత్న పరిశోధకులను కలిగి ఉండటమే కాక ప్రపంచ నలుమూలల నుంచి సైతం విద్యార్థులను ఆకర్షించిందంటే గతంలోనే మనదేశం విద్యారంగంలో ఎంతటి కీర్తి ప్రతిష్టలు సాధించిందో ఊహించుకోవచ్చు. కానీ కాలగమనంలో మన భరతభూమిపై జరిగిన విదేశీయుల దాడులతో విశ్వవిద్యాలయాలు నేలమట్టమవటమే గాక విలువైన జ్ఞానసంపద సైతం భూగర్భంలో కలిసి పోయింది. ఇప్పటికీ దేశంలో అనేక రంగాలలో నిష్ణాతులు అద్భుత ఆలోచనలు ఆవిష్కరణలు చేయగల వారికి కొదవలేనప్పటికీ సరైన ప్రోత్సాహం ప్రభుత్వ సహకారం లేకపోవడంతో భారత దేశం విదేశాలపై ఆధారపడటం ఎక్కువైంది. ప్రఖ్యాత మేగజైన్ టైమ్స్ పత్రిక విడుదల చేసిన 1000 ప్రపంచ ఉత్తమ విశ్వవిద్యాలయాల జాబితాలో భారత స్థానం దిగదుడుపే. ముఖ్యంగా జాబితాలో యూరోపియన్ దేశాల విశ్వవిద్యాలయాలదే అగ్రస్థానమవగా, ప్రతి ఏడు అవే విశ్వవిద్యాలయాలు కాస్త అటుఇటుగా తమ స్థానాన్ని కొనసాగిస్తున్నాయి. మొత్తం 77 దేశాలు 20,000 వర్సిటీలను 13 అంశాల ప్రాతిపదికగా ఎంపిక చేయగా పశ్చిమదేశాలు తమ ప్రభావాన్ని చాటాయి. ఇకపోతే ఆసియా ఖండంలో ఉత్తమ 350 విశ్వ విద్యాల యాల జాబితాలో చైనా,



జపాన్ తమ ఆధిక్యతను కొనసాగించగా, మనదేశం నుంచి 40కి పైగా విద్యా సంస్థలు ఎంపిక అయినప్పటికీ టాప్- 20లో ఏ ఒక్క భారతీయ ఉన్నత విద్యా సంస్థ లేక పోవడం దురదృష్టకరం. వినూత్న ఆలోచనలకు, విశ్వజనీన అంకురార్పణలకు వేదికలవ్వాల్సిన విశ్వవిద్యాలయాలు దేశంలో ప్రభుత్వాల నిర్లక్ష్యంతో కొట్టుమిట్టాడుతున్నాయి. అంతేకాకుండా సాంకేతికత, ఆధునిక ఆవిష్కరణలను, విలువైన మానవ వనరులను సమన్వయం చేసుకుంటూ ఉపయోగించుకుని పారిశ్రామిక, సేవారంగాలలో చైనా, జపాన్‌లు అద్భుతంగా ప్రగతిపథంలో దూసుకుపోతుండగా, మనదేశం అందుకు విరుద్ధంగా నూతన ఆవిష్కరణల దిగుమతితో విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని నష్ట పోవడం దురదృష్టకరం. ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయి పోటీనిస్తున్న ఐఐటీ, ఐఐఎంలు, మరికొన్ని శాస్త్ర సాంకేతిక సంస్థలు, కేంద్రీయ విశ్వ విద్యాల యాల పరిస్థితి కొంత నయమనిపిస్తున్నప్పటికీ రాష్ట్ర విశ్వవిద్యాలయాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వాల నిర్లక్ష్యం, ఆర్థిక తోడ్పాటు లేమికి తోడు మూస విధానాలు, నూతన కోర్సుల సృష్టి జరగకపోవడం, ఆచార్యుల ఖాళీలు, మౌలిక వస తులలేమి, ప్రోత్సాహం లే ని పరిశోధన రంగం వంటి సమస్యలు వర్సిటీలు, ఉన్నత విద్యా వ్యవస్థలను పట్టి పీడుస్తున్న ప్రధాన సమస్యలు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని విద్యారంగానికి విస్తృతమైన ప్రాధాన్యం కల్పించి అధికంగా కలిగిన యువజనాభాను విద్యా, ఉపాధి, పరిశ్రమలకు అనుసంధానించి, సృజనాత్మకత, నైపుణ్యాల పెంపు, ఆర్థిక తోడ్పాటు వంటి చర్యలతో మనదేశాన్ని ఆవిష్కరణలకు కేంద్రస్థానంగా, ఉత్పత్తి స్థావరంగా, మేథోసంపత్తికి నెలవుగా మారేలా త్వరిత గతిన నిర్ణయాలు గైకొనకపోతే యువభారతంతో నిండిన మన సమాజం సమస్యలను కూడా తెచ్చిపెట్టే ప్రమాదం లేకపోలేదు. ప్రస్తుత కేంద్ర బడ్జెట్లో ప్రతి 1000 ఫెలోషిప్పు ఇంజినీరింగ్ పరిశోధనలకు ప్రకటించటం హర్షణీయమే అయినప్పటికీ వాటి సంఖ్య మరింత పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పరిశోధనలకు వెచ్చించే ప్రతి రూపాయికి ఫలితం ఆశించటం కంటే అద్భుతమైన పరిశోధన దేశప్రగతిని ఎలా మార్చగలదో ఆలోచించి పరిశోధన రంగానికి విస్తృతంగా నిధులు కేటాయించాలి. అంతేకాకుండా ఇంజినీరింగ్ విద్యకే పరిమితమవకుండా వ్యవసాయం, వైద్యం, సామాజిక, మానవీయ, భాషాశాస్త్రాల పరిశోధనలకు సైతం ప్రోత్సాహకాలు ఇస్తూ పరిశోధకుల విశ్వవిద్యాలయాల పనితీరు మెరుగుకై మరిన్ని చర్యలు గైకొంటే నవ్య ఆవిష్కరణలు అంకురించి, అంకుర పరిశ్రమలు ఆవిర్భవిస్తే స్థానిక సమస్యలే పరిశోధనాంశాలుగా భావించి పరిష్కారం కనుగొంటే పరిశోధన, అభివృద్ధి రంగం మరింత పునరుత్తేజితమై మేధోవలస నియంత్రణతో పాటు పేటెంట్ హక్కులు పెరిగేలా కృషి జరిగితే నిజమైన అభివృద్ధితో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరిగి గతంలోనే కాదు వర్తమానంలోనూ భారతదేశం విద్యా వరప్రదాయినిగా మారడం తథ్యం.

వినోద్‌కుమార్ సుద్దాల
రీసెర్చ్ స్కాలర్,
ఉస్మానియా యూనివర్సిటీ

మనం
కుటుంబం
మంగళవారం, 6 మార్చి 2018
www.manamnews.com



వెరైటీ బ్యాంక్

అదో వెరైటీ బ్యాంక్.. అక్కడ అప్పులు ఇవ్వరు, కానీ ఈ బ్యాంకుకు సామాన్య మహిళలు రుణపడేలా మాత్రం సాయం చేస్తుంది. వినేందుకు వింతగా ఉన్నా ఇది సంఘసేవ కోసం ప్రారంభించిన బ్యాంక్.

ప్యాడ్ బ్యాంక్

అక్షయ్ కుమార్ హీరోగా నటించిన ప్యాడ్ మ్యాన్ సినిమా పెద్ద ట్రెండ్ సెట్టర్ గా దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతోంది. మెనుస్ట్రువల్ హైజీన్ అనే సబ్జెక్ట్ పై బహిరంగంగా మాట్లాడటం మొదలైనతర్వాత, శ్యానిటరీ న్యాప్కిన్స్ పెద్ద చర్చనీయాంశంగా మారింది. న్యాపిక్స్ గురించి మాట్లాడటం పెద్ద టబూగా ఉన్న ఈ రోజుల్లో ఏకంగా న్యాప్కిన్ బ్యాంకులే ప్రారంభించేలా ఈ చిత్రం ప్రభావం చూపింది. ఉత్తరాదిన ఇప్పుడు ఇది పెద్ద సమాజ సేవగా మారింది. అంతేకాదు మహిళా సాధికారతకు, స్కూళ్లలో బాలికల హాజరు శాతం వంటివన్నీ న్యాప్కిన్స్ శాసిస్తోందని గుర్తించిన స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖులు ఈదిశగా తమకు చేతనైనంత సాయం చేసేందుకు ఉద్యమిస్తున్నారు.









పింకిష్ గ్రూప్ అనే మహిళా స్వచ్ఛంద సంస్థ ఉత్తర్ ప్రదేశ్ లోని ఘజియాబాద్ లో చేస్తున్న వినూత్న ప్రయోగం ఆరంభంలోనే మంచి ఫలితాన్ని ఇస్తోంది. ప్యాడ్ బ్యాంకులను ప్రారంభించిన పింకిష్ గ్రూప్, మహిళలకు ఉచితంగా న్యాప్కిన్స్ అందిజేస్తుంది. అంతేకాదు మారుమూలన ఉన్న గ్రామాలకు కూడా వీరు స్వయంగా వెళ్లి, గ్రామ ప్రజలతో ఈ అంశంపై అవగాహన కల్పిస్తున్నారు. దీంతోపాటు భారీ నిర్మాణాలు జరుగుతున్న చోట్ల ఉన్న కూలీలవద్దకు వెళ్లి, న్యాప్కిన్స్ ఆవశ్యకతను వివరిస్తున్నారు. వీరికి ఉచితంగా ప్యాడ్స్ పంపిణీ చేస్తున్నారు. ఈ సంస్థ బ్రాంచ్ లు ఉన్నచోటి నుంచి ఉచితంగా న్యాప్కిన్స్ ను అందుకునే అవకాశం కల్పించారు. దీంతో నిరుపేదలు ఇక్కడి నుంచి ప్యాడ్స్ సాయాన్ని పొందుతున్నారు. ఇక ఇలాంటి వారిని గుర్తించి రేషన్ కార్డు తరహాలో ప్యాడ్ కార్డులు కూడా జారీ చేసి, ప్యాడ్స్ పంపిణీ చేస్తున్నారు.

డొనేషన్స్‌తోనే..

ఇక ఈ బ్యాంక్ నడపాలంటే కాస్త ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కనుక వీరు ఇందుకు పాడ్ డోనర్స్ ను సంప్రదించి, ఆన్ లైన్, ఆఫ్ లైన్ లో ప్యాడ్స్ సేకరిస్తున్నారు. మొత్తం నాలుగు బ్రాంచ్ లతో పని ప్రారంభించిన పింకిష్ గ్రూప్ కు వచ్చిన స్పందన అద్భుతమనే చెప్పాలి. ఎందుకంటే ఈ బ్యాంక్ ప్రారంభించిన తొలి రెండు రోజుల్లోనే వెయ్యికి పైగా ప్యాడ్స్ ను చాలా ఈజీగా వీరు పోగుచేయగలిగారు. టెక్నాలజీని జోడించి, ప్యాడ్ డోనర్ వివరాలు, వారు చేస్తున్న సాయానికి గుర్తింపుగా ఈ సమాచారాన్ని వెబ్ సైట్ లో అప్ లోడ్ చేస్తున్నారు. పింకిష్ గ్రూప్ నిర్వహిస్తున్న శాలిని గుప్త మాటల్లో చెప్పాలంటే మహిళలే కాదు, పురుషులు కూడా ఇక్కడ ప్యాడ్స్ డొనేట్ చేసేందుకు ముందుకు వస్తుండడం అభినందించదగ్గ విషయం. దేశవ్యాప్తంగా పలు చోట్ల ఇలాంటి చొరవ చూపేందుకు పలు ఎన్జీఓలు ముందుకు వస్తుండడం, సమాజంలో స్త్రీ, స్త్రీ సమస్యల పట్ల చోటు చేసుకుంటున్న మార్పుకు నిలువెత్తు రూపంగా భావించవచ్చు.



మనదేశంలో లేటెస్ట్ ఫ్యాషన్ అంటే ఇప్పుడు ఫ్యూజన్ ట్రెండ్స్ దే. అందుకే ప్లాజూ వంటి సెమి క్లాసిక్ స్టైల్స్‌ను ఫాలో అయ్యే వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది.

ఒక్కసారి వాడితే..

ప్లాజూలా? ఏంటవి? లూజ్ గా అదోలా ఉంటాయి.. వామ్మో ఇవి వేసుకుంటే నేనింకా లావు కనిపిస్తా.. నేనైతే మరీ పొట్టిగా కనిపిస్తా.. ఇలా ఆలోచించే అమ్మాయిలు చాలామందే ఉంటారు. కానీ ప్లాజూలు చాలా అందంగా, హుందాగా ఉంటాయన్న విషయంపై వీరికి అవగాహన లేక ఇలా ఆలోచిస్తుంటారన్న విషయం ఇక్కడ ప్రధానమైంది. అందుకే ప్లాజూను ఒక్కసారి వాడి చూస్తే చాలు ఇక రోజూ ప్లాజూ (పలాజూ అని కూడా అంటారు) అయితే హాయిగా ఉంటుందనే అడిక్షన్ లా ఫీల్ అవుతారన్నది నిజం. అంత కంఫర్ట్ మనకు మరే డ్రెస్ లో రాదు. ఇక లుక్ అంటారా ఇదో ఫ్యాషన్ స్టేట్ మెంట్ కనుక స్టైలిష్ లుక్ కు వచ్చిన ఢోకా ఏమీ లేదు సరికదా, ప్లాజూపై మరింత సమాచారాన్ని కూడా మిమ్మల్నే అడుగుతారు.





వావ్ ప్లాజూ







హీల్ తప్పనిసరి

ప్లాజూ వాడేవారు సాధారణంగా చేసే మిస్టేక్ ఏమిటంటే వీరు సరైన యాక్సెసరీస్ ధరించకపోగా, హీల్ కూడా వేయరు. ఫ్లాట్స్, షూ, ఫ్లిప్ ఫ్లాప్స్ వంటివి వేస్తే ప్లాజూలో ఉన్న అందం కనిపించదు. మీ పాదాలు ఎప్పుడూ ఎత్తులో ఉంటేనే ప్లాజూ బాగా ఎలివేట్ అవుతుంది కనుక పాయింటెడ్ అయినా కాకపోయినా మీరు హీల్ వాడితే ఏ శరీరాకృతి వారికైన ప్లాజూ నప్పుతుంది. ఇది చాలా సింపుల్ ఫ్యాషన్ ట్రిక్. ఆఫీస్, కాలేజ్, డిన్నర్.. ఇలాంటి అకేషన్స్ అన్నింటికీ సూట్ అయ్యే ప్లాజూ తప్పనిసరిగా ఫ్యాషన్ ప్రియులందరి వార్డ్ రోబ్ లో ఉండితీరాల్సిందే.



సమ్మర్‌కు పర్‌ఫెక్ట్ ఫిట్

టైట్ లెగ్గిన్స్, జెగ్గిన్స్ వేస్తే కాస్త డిస్ కంఫర్ట్ గా సమ్మర్ లో అనిపిస్తుంది. అదే మీరు ప్లాజూ వేశారనుకోండి ఇక ఆరోజు మీకు హాయిగా గడిచిపోతుంది. వేసవికి సరైన డ్రెస్ కలెక్షన్ గా ప్లాజూను పేర్కొనవచ్చు. ఎంత ఉక్కపోత ఉన్న మీకు చిరాకు రాకుండా ఉంటే కంఫర్ట్ నెస్ ప్లాజూ సొంతం. ఫ్లోరల్ కలెక్షన్, హ్యాండ్ లూమ్, ప్రింట్స్, ఇక్కట్ వంటి క్లాత్ వెరైటీలతో వేసవిలో ప్లాజూలు ధరిస్తే మీరు సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలవడం ఖాయం.

కాంబినేషన్ ఏంటి?

ప్లాజూలతో వచ్చిన అసలు అడ్వాంటేజ్ ఏమిటంటే ఇవి ఏ మోడల్ డ్రెస్ అయినా సెట్ అయిపోతాయి. కుర్తీ వేసుకున్నా, షర్ట్ వేసుకున్నా.. షార్ట్ లెంత్ చూడీదార్ లేదా టాప్స్ తో కూడా ఇవి ఎలివేటెడ్ లుక్ ను ఇస్తాయి. కుర్తీ వంటి కొన్ని కాంబినేషన్లలో ఇవి ఎథ్నిక్ లుక్ ఇస్తే, షార్ట్ లెంత్ టాప్స్ తో ఇవి వెస్ట్రన్ లుక్ ఇస్తాయి. షర్ట్ తో అయితే ట్రెండీగా కనిపిస్తాయి. టీ షర్ట్ తో ప్లాజూను ట్రై చేయండి అదో సెలబ్రిటీ ఫ్యాషన్ గా ఉంటుంది. ఇక లాంగ్ కుర్తీ, మల్టీ స్లిట్స్ ఉన్న కుర్తీలతో ట్రై చేస్తే ఎథ్నిక్, నవాబీ లుక్ వస్తుంది. లేయర్స్ ఉన్న ప్లాజూ ప్యాంట్ డిఫరెంట్ గా కనిపిస్తుంది. క్రాప్ టాప్ తో ట్రై చేస్తే మీకు ఫుల్ మార్క్స్ పడటం ఖాయం. కనుక మీరు ఒక్క ప్లాజూ ట్రై చేయాలనుకుంటే, అదే ప్లాజూతో డిఫరెంట్ లుక్ పొందే ఛాన్స్ ఉంటుందన్నమాట. ఇవి కేవలం లూజ్ గానే కాకుండా టైట్స్ లో కూడా వస్తాయి. కొన్ని లైనింగ్ క్లాత్ తో మరికొన్ని దళసరి గుడ్డతో తయారై ఉంటాయి. వీటిపై వర్క్ కూడా చేసి, మరింత అందంగా కనిపించేలా ప్లాజూలు మార్కెట్ ను ముంచెత్తుతున్నాయి. స్టైలిష్ ఔట్ ఫిట్ అయిన ప్లాజూతో ప్రయాణాల్లో మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. దూరం నుంచి చూస్తే లాంగ్ స్కర్ట్ లాంటి ఇంప్రెషన్ ఇచ్చే ప్లాజూ ప్యాంట్స్ ఆన్ లైన్ లో చాలా ఎక్కువ వెరైటీల్లో లభిస్తున్నాయి. జిప్సీ లుక్ కావాలంటే జంక్ జువెలరీతో ప్లాజూ ట్రై చేయండి మీరు పదహారణాల జిప్సీలా కనిపిస్తారు. టూరిస్టులకు హాట్ ఫేవరెట్ డ్రెస్ గా ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన జిప్సీలు మీరు అన్ని ప్రధాన పర్యాటక ప్రదేశాల్లోనూ విస్త తంగా చూడవచ్చు.

నేడు గడియారం రామకృష్ణశర్మ శతజయంతి ఉత్సవాలు

హైదరాబాద్ సిటీ, మార్చి 5(మనం ప్రతినిధి): తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవన కృషీవలుడు డా.గడియారం రామకృష్ణ శర్మ శతజయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరగనున్నాయని తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డా.జె.చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తు..దేవులపల్లి రామానుజారావు కళామందిరంలో సాయంత్రం 6గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వప్రధాన సలహాదారు డా.కె.వి రమణాచారి ప్రారంభించే ఈ కార్యక్రమంలో తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ఆంధ్రజ్యోతి పత్రిక సంపాదకులు కె.శ్రీనివాస్, ప్రముఖసాహితీవేత్తలు హాజరవుతారని తెలిపారు.

అక్కడేం ఉద్ధరిస్తారు?

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. బస్సు యాత్రలో భాగంగా నిజామాబాద్ జిల్లాలో ఉన్న ఆయన.. సోమవారం నిజామాబాద్ పట్టణంలో స్థానిక కాంగ్రెస్ నాయకుడి ఇంట్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ చేయించినట్లు చెబుతున్న సర్వేలన్నీ బూటకమేనని, రాబోయే ఎన్నికల ఫలితాల గురించి భయంతోనే ఫ్రంట్‌ల పేరిట ప్రజల దృష్టి మరలించడానికి ఆయన కొత్త నాటకానికి తెరలేపారని అన్నారు. రైతులకు ఏకకాలంలో రుణామాఫీలు లేవని, రైతుల నడ్డి విరుస్తున్నారని, రైతులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, మైనార్టీలను మోసం చేస్తున్నారని, ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కాస్తా ఇప్పుడు అప్పులమయంగా మార్చేస్తున్నారంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ ఏడాది డిసెంబర్‌లో జరగబోయే ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం వస్తోందని, కేసీఆర్ వైఫల్యాలే కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తాయని ఆయన చెప్పారు. నాలుగేళ్లలో రైతులు ఆత్మహత్యలు పెరిగాయని, నేటి వరకు ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని, కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ భయపెడుతున్నారని, రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.


సాగు బడ్జెట్‌కు నై

హైదరాబాద్, మార్చి 5 (మనం ప్రతినిధి): వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేయాలని.. ఈ ఏడాది ఆ రంగానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలని భావించిన తెలంగాణ ప్రభుత్వం.. 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సాగుకు ప్రత్యేక బడ్జెట్ ఆలోచనను విరమించుకుంది. రాజ్యాంగ నిబంధనలు, అసెంబ్లీ నియమావళి ప్రకారం శాఖల వారీగా ప్రత్యేక బడ్జెట్ పెట్టడానికి వీలులేదు. వ్యవసాయరంగానికి పెద్దపీట వేసే క్రమంలో ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలని ప్రభుత్వం తొలుత భావించింది. అయితే రాజ్యాంగపరమైన నిబంధనల కారణంగా ఆ ఆలోచనను విరమించుకున్నామని సీఎం కేసీఆర్ చెప్పారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌పై సోమవారం మంత్రులు, అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన దగ్గరి నుంచి వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని కేసీఆర్ అన్నారు. ఈసారి బడ్జెట్‌లో కూడా రైతుల కోసం నిర్వహిస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తామన్నారు. వాస్తవానికి వ్యవసాయరంగానికి ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కాగా శాఖల వారీగా బడ్జెట్లు ప్రవేశపెట్టడానికి రాజ్యాంగ నిబంధనలు అంగీకరంచవని అధికారులు ఈ సమావేశంలో సీఎంకు వివరించారు. అసెంబ్లీ నియమావళిలోని రూల్ నెంబర్ 150 ప్రకారం ఆదాయ, వ్యయాలు మాత్రమే బడ్జెట్ కిందకు వస్తాయని అధికారులు వెల్లడించారు. ఇతరత్రా ప్రణాళికలు, వివరణలన్నీ పద్దుల కిందకే వస్తాయి కానీ ప్రత్యేక బడ్జెట్ కింద పరిగణించడానికి వీలు లేదని అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఒకసారి వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు వివాదాస్పదమైందని చెప్పారు. కేంద్రంలో రైల్వే బడ్జెట్‌ను ప్రధాన బడ్జెట్‌లోనే ప్రవేశపెడుతున్న విషయాన్ని సీఎంకు వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు టి. హరీశ్‌రావు, పోచారం శ్రీనివాసరెడ్డి, ఈటల రాజేందర్, మహేందర్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావుతో పాటు ఉభయసభల చీఫ్ విప్‌లు పి. సుధాకర్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ఆర్థిక సలహాదారు జీఆర్ రెడ్డి, ముఖ్య కార్యదర్శులు ఎస్.నర్సింగరావ్, రామకృష్ణారావు, పార్థసారథి, వ్యవసాయశాఖ కమిషనర్ జగన్ మోహన్, ఉద్యానశాఖ కమిషనర్ వెంకట్రాంరెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

‘మూడు’ ముమ్మరం

(మొదటిపేజీ తరువాయి)

తెరతీస్తున్నారు. ఇందులో భాగంగా తొలుత దేశమంతటా పర్యటించి, అన్ని రంగాల ముఖ్యులను సంప్రదించాలని నిర్ణయించారు. తదనుగుణంగా దేశ ప్రజలంతా చల్లగా ఉండాలని ఆకాంక్షించే ప్రతి వర్గంతో సమావేశం కావడానికి సన్నద్ధమవుతున్నారు. ఢిల్లీ జైత్రయాత్ర దిశగా 2016లోనే కేసీఆర్ నాంది పలికారని చెప్పవచ్చు. రాష్ట్రం ఏర్పాటయ్యాక తొలిసారిగా ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన సూచనప్రాయంగా తన ఆలోచనను బయటపెట్టారు. తదుపరి సార్వత్రిక ఎన్నికల (2019) నాటికి కాంగ్రెస్, బీజేపీయేతర ప్రత్యామ్నాయానికి బాటలు వేయాలని భావిస్తున్నట్లు అప్పట్లోనే వెల్లడించారు. ఆ మేరకు నాలుగైదు ప్రాంతీయ పార్టీలతోనూ మాట్లాడి జట్టుకట్టాల్సిన అవసరాన్ని ఆయా పార్టీల అధినేతలకు నొక్కిచెప్పారు. ప్రాంతీయ పార్టీలన్నీ ఏకమై లోక్‌సభలో 300 స్థానాలు సాధించే వీలుందని కూడా ఆయన అభిప్రాయపడ్డారు.



రిటైర్డ్ ఏఐఎస్ అధికారులతో తొలుత భేటీ

తొలిదశలో... అఖిల భారత సర్వీసు (ఏఐఎస్)లైన ‘ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్’ రిటైర్డ్ అధికారులతో కేసీఆర్ సమావేశానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. వారితో ముమ్మర చర్చలద్వారా దేశ ప్రగతికి అవసరమైన కార్యక్రమ రూపకల్పనకు బీజం పడుతుందని భావిస్తున్నారు. వారినుంచి దేశాభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు స్వీకరించి ప్రణాళికను రూపొందించడం సులువు కాగలదని కేసీఆర్ భావిస్తున్నారు. రెండో దశలో... సైనిక, వాయుసేన, నావికా సిబ్బందితో ఆయన సమావేశం కానున్నారు. వీరే కాకుండా దేశంలోని న్యాయకోవిదులు, దిగ్గజ న్యాయవాదులు, అఖిలభారత రైతు సంఘాల ప్రతినిధులను కూడా కేసీఆర్ కలుసుకుంటారు. అలాగే ఉద్యోగ విరమణ చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సిబ్బంది సంఘాల నాయకులను కూడా కేసీఆర్ కలుసుకోనున్నారు. మీడియా సంస్థలుసహా పాత్రికేయుల, పారిశ్రామిక వేత్తలు, కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశానికీ కేసీఆర్ సన్నాహాలను వేగవంతం చేశారు. కేంద్ర, రాష్ట్రాల స్థాయిలో ఆర్థికశాఖ కార్యదర్శులతోనూ ఆయన సమావేశం కానున్నారు. తన ఆలోచనలతోపాటు దేశాభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా హైదరాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, చెన్నై, బెంగళూరు వంటి నగరాల్లో ఆయా వర్గాలతో సమావేశాలు నిర్వహిస్తారు. ఈ దిశగా ఆయా వర్గాల ప్రతినిధులతో వరుస సమావేశాలతోపాటు ఆయా వర్గాలతో సంప్రదింపుల కోసం ప్రత్యేకంగా సమన్వయ కర్తలను కూడా కేసీఆర్ నియమించటం విశేషం. ఇలా అన్ని వర్గాల వారితో సమావేశాలు నిర్వహించిన అనంతరం జాతీయ అజెండాను ఆయన రూపొందిస్తారని సమాచారం.

ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం అజిత్ జోగి ఫోన్

జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించేందుకు సిద్ధమన్న కేసీఆర్ ప్రకటనకు చురుకైన స్పందన లభిస్తోంది. ఈ మేరకు సోమవారం ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి ఛత్తీస్‌గఢ్ జనతా కాంగ్రెస్ అధినేత అజిత్ జోగి మద్దతు తెలిపారు. కేసీఆర్ ఏర్పాటు చేయబోయే కొత్త ఫ్రంట్‌లో భాగస్వామి కావడానికి సిద్ధంగా ఉన్నట్లు ఫోన్‌చేసి చెప్పారు. తెలంగాణ ఉద్యమాన్ని విజయవంతంగా నడిపించి, ప్రత్యేక రాష్ట్రం సాధించారని ఈ సందర్భంగా కొనియాడారు. ఆ ఉద్యమ విజయంతో గొప్ప నాయకుడిగా రూపొందిన ఆయన, మరింతగా ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని అజిత్ పేర్కొన్నారు. ఆయనకు మద్దతుగా జాతీయ స్థాయి నేతలతో సంప్రదింపులలో తనవంతు తోడ్పాటు అందిస్తానని ప్రకటించారు.

వ్యూహం విఫలం

(మొదటిపేజీ తరువాయి)

పాటు, 100 మంది పార్టీ కార్యకర్తలను పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. పంజాగుట్టలోనూ పలువురు నేతలు, కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ప్రగతిభవన్ వద్దకు చేరుకున్న కొందరు బీజేపీ కార్యకర్తలు, నేతలు కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే ప్రధానికి కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు వారిని అడ్డుకునేందుకు యత్నించడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. నాయకులు, కార్యకర్తల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని బీజేపీ నేతలు అన్నారు. కేసీఆర్ పాలన నిజాం నిరంకుశ పాలనను తలపిస్తోందని ఆరోపించారు. అక్రమ అరెస్టులు బీజేపీని ఏమీ చేయలేవన్నారు. ఇలాంటి తాటాకుచప్పుళ్లకు భయపడే పార్టీ బీజేపీ కాదని, ప్రధానిపై సీఎం చేసిన అనుచిత వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణలు చెప్పేవరకు బీజేపీ ఉద్యమం ఆగదన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని తెలిపారు. చిక్కడపల్లిలోని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ కార్యాలయం వద్ద పెద్దసంఖ్యలో పోలీసులు మోహరించారు. కిషన్ రెడ్డి, రాజాసింగ్, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌లను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు. ఎమ్మెల్సీ రాంచంద్రరావును ముందస్తుగా అరెస్టు చేసి బొల్లారం స్టేషన్‌కు తరలించారు. బీజేపీ మానవహక్కుల సెల్ కన్వీనర్ కప్పర ప్రసాద్, రాష్ట్ర మీడియా కో కన్వీనర్ ఎం శ్రీనివాస్‌లను అరెస్ట్ చేసి కంచన్‌బాగ్ స్టేషన్‌కు, హుమాయూన్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో పది మంది, జూబ్లీహిల్స్ పీఎస్ పరిధిలో మరో 20 మంది కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు.



టీఆర్ఎస్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారు: లక్ష్మణ్

బీజేపీ కార్యకర్తలు, నాయకులను పోలీసులతో అరెస్టు చేయించడాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఖండించారు. ఇది అప్రజాస్వామికమని విమర్శించారు. తెలంగాణలో నియంతృత్వం రాజ్యమేలుతోందన్నారు. ప్రజా సమస్యలపై నిలదీస్తే టీఆర్ఎస్ అణచివేతకు పాల్పడుతోందని, ప్రశ్నించేవారే ఉండొద్దన్న రీతిలో సీఎం ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్రంలో హిట్లర్‌ను మించిన పాలన కొనసాగిస్తున్న కేసీఆర్‌కు.. ప్రజలు తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. బీజేపీ గెలుపును చూసి, కేసీఆర్‌కు బీజేపీ ఫోబియా పట్టుకుందన్నారు.



శూన్యం భర్తీకే వచ్చా!

- జయలలిత మరణంతో ఖాళీ ఏర్పడింది
- తమిళనాడుకు ఓ నాయకుడు కావాలి
- కాబట్టే రాజకీయ రంగప్రవేశం చేస్తున్నా
- రజనీకాంత్ తొలి బహిరంగ ప్రసంగం



చెన్నై, మార్చి 5: జయలలిత మరణానంతరం తమిళనాడులో ఏర్పడిన రాజకీయ శూన్యాన్ని భర్తీ చేసేందుకే రాజకీయ రంగప్రవేశం చేయాలని నిర్ణయించుకున్నానని సూపర్ స్టార్ రజనీకాంత్ స్పష్టం చేశారు. సోమవారం ప్రైవేటు వర్సిటీ అయిన డాక్టర్ ఎంజీఆర్ విద్యా-పరిశోధన సంస్థ ప్రాంగణంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన వారినుద్దేశించి మాట్లాడారు. నిరుడు డిసెంబరు నెలాఖరున రాజకీయ రంగప్రవేశం గురించి ప్రకటించిన తర్వాత తొలిసారి ఆయన బహిరంగంగా ప్రసంగించడం గమనార్హం. ఇంతకుముందు జయలలిత, కరుణానిధి వంటి బలమైన నాయకులు ఉండేవారని గుర్తుచేశారు. నేడు జయలలిత మనమధ్య లేరని, కరుణానిధి వృద్ధాప్యంతో అశక్తులయ్యారని పేర్కొన్నారు. ఈ పరిణామాలవల్ల రాష్ట్ర రాజకీయాల్లో ఏర్పడిన శూన్యమే తనను రాజకీయ అరంగేట్రానికి ప్రేరేపించిందని చెప్పారు. ‘తమిళనాడుకు ప్రస్తుతం ఒక నాయకుడు అవసరం. అందుకే నేనొచ్చాను’ అని అభిమానుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. రాజకీయాల్లోకి వచ్చిన సినిమా వాళ్లంతా ఎంజీఆర్ కాలేరని చాలామంది వ్యాఖ్యానించినట్లు ఈ సందర్భంగా చెప్పారు. ‘‘నిజమే అందరూ ఎంజీఆర్ కాలేరు... ఆయనో యుగపురుషుడు. కానీ, ఎంజీఆర్ ఇచ్చిన సుపరిపాలనను అందించగలనన్న విశ్వాసం నాకుంది’’ అని పేర్కొన్నారు. సినిమా రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చేవారిని అన్నా డీఎంకే ఎందుకు ఏవగించుకుంటున్నదో అర్థం కావడంలేదన్నారు. రాజకీయ ప్రత్యర్థులు తనకు ఎర్రతివాచీతో స్వాగతం చెబుతారన్న భ్రమలేవీ లేవని, అయినా వారెందుకు తనను అడ్డుకోజూస్తున్నారో తెలియడంలేదని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో పాములు, ముళ్లు, ఎన్నెన్నో కష్టాలుంటాయని తనకు తెలుసునన్నారు. కరుణానిధి, జీకే మూపనార్, చో రామస్వామి వంటివారి సాంగత్యంతో తనకూ రాజకీయం కాస్త ఒంటబట్టిందని చమత్కరించారు.

టెక్నాలజీ అంటే ఇదే!

(మొదటిపేజీ తరువాయి)

సెంటర్‌ను ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరితో కలసి ప్రారంభించారు. ఎంజీఎం ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం పరకాలలో నిర్వహించిన సభలో ప్రసంగిస్తూ విద్యారంగానికి ఎస్.ఆర్.ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కళాశాలలో ఇన్నొవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం వల్ల వరంగల్ యువతకు ఎంతో మేలు కలుగుతుందని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సామాన్యులకు ఉపయోగపడేలా మలచుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలు, స్టార్టప్‌లంటే తెలియనివారు దేశంలో కోట్లాదిగా ఉన్నారని, సాంకేతికతతో అలాంటివారికి కూడా ప్రయోజనం లభించాలని కేటీఆర్ సూచించారు. ప్రపంచ దేశాలకు దీటుగా భారత యువతరం వినూత్న ఆలోచనలు చేయాలని పిలుపునిచ్చారు. నల్గొండ జిల్లావాసి మల్లేష్ నేత కార్మికులకు ఉపయోగపడే యంత్రాన్ని తయారుచేయడం ఆశ్చర్యపరిచిందన్నారు. అతని ప్రతిభకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం రూ.కోటి ఆర్థిక సహాయం అందిస్తుందని ప్రకటించారు. వినూత్న ఆలోచనలను... ప్రత్యేకించి గ్రామీణ రంగంలో ఉపయోగపడే ఆవిష్కరణలను ఇతోధికంగా ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. సాంకేతిక పరిజ్ఞాన సద్వినియోగంద్వారా పదిమందికీ ఉపాధి కల్పించేలా యువత ఎదగాలని ఆకాంక్షించారు. సృజనాత్మకతకు ప్రభుత్వం సదా అండదండలు కల్పిస్తుందని చెప్పారు. సాఫ్ట్‌వేర్ రంగంలో హైదరాబాద్‌లోనే అత్యున్నత అవకాశాలు లభిస్తున్నాయని గుర్తుచేశారు. త్వరలోనే వరంగల్‌ను కూడా ఆ స్థాయిలో అభివృద్ధి చేసి, ఐటీ కూడలిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. డ్రోన్ టెక్నాలజీతో సునిశిత రీతిలో కీలక సమాచారం సేకరించవచ్చని చెప్పారు.

అన్నింటా మేటిగా హైదరాబాద్

హైదరాబాద్ నగరం అన్ని రంగాల్లోనూ మేటిగా ప్రపంచ గుర్తింపు పొందిందని కడియం శ్రీహరి అన్నారు. రాష్ట్ర రాజధానిని కీలక ఐటీ కూడలిగా తీర్చిదిద్దడంలో మంత్రి కేటీఆర్ కృషి అద్భుతమని ప్రశంసించారు. ఇక వరంగల్‌ను కూడా ఆ స్థాయికి తెస్తామని ఆయన ప్రకటించడం హర్షణీయమని పేర్కొన్నారు. ఐటీ రంగంలో కేటీఆర్ కృషిని ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా కూడా కొనియాడారని గుర్తుచేశారు. ఉద్యమాల్లో, ప్రశ్నించడంలోనేగాక చదువుల్లోనూ వరంగల్ యువత ముందంజలో ఉందన్నారు. అదేవిధంగా ప్రయోగాలు చేయడంలో కూడా అందరికీ ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. సభలో జడ్పీ చైర్‌పర్సన్ పద్మ, నగర మేయర్ నన్నపునేని నరేందర్, ఎంపీ పసునూరి దయాకర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య, మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, జేఎన్‌టీయూ వైస్‌చాన్సలర్ వేణుగోపాల్‌రెడ్డి, హరికేష్ మిట్టల్, రవి త్యాగి, వరదారెడ్డి, డేవిడ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మా సమస్యలు పరిష్కరించరూ!

మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని ఫార్మా-డీ విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. తమ చదువుకు గుర్తింపు కోరుతూ నెలనుంచీ ఆందోళన చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం విన య్ భాస్కర్ ఆధ్వర్యంలో వారు మంత్రిని కలిసి విన్నవిం చారు. దీనిపై కేటీఆర్ సానుకూల స్పందన వ్యక్తంచేస్తూ- వైద్య-ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డితో మాట్లాడి వారి సమస్య లు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మరోవైపు ప్రజారోగ్య సిబ్బంది కూడా వేతనాల పెంపుదల కోసం మంత్రికి విజ్ఞప్తి చేశారు. నగర మేయర్ నరేందర్, టీఎండబ్ల్యూయూ అధ్యక్షుడు రవికుమార్ వారి సమస్యను మంత్రి దృష్టికి తెచ్చారు. హెల్త్ కార్డుల అంశాన్ని కూడా ఆయనకు తెలిపారు. వేతనాల పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని, రాష్ట్ర బడ్జెట్‌కు పెంపు ప్రకటన ఉంటుందని మంత్రి శుభవార్త వినిపించారు.

ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే!

- విభజనతో ఏపీ నష్టపోయింది
- సవాళ్లను అధిగమిస్తున్నాం
- 2019నాటికి పోలవరం పూర్తి
- బడ్జెట్ ప్రసంగంలో గవర్నర్

అమరావతి, మార్చి 5 (మనం ప్రతినిధి):

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇచ్చి తీరాల్సిందేనని గవర్నర్ నరసింహన్ స్పష్టం చేశారు. విభజనతో రాష్ట్రం ప్రధాన ఆర్థిక కేంద్రాన్ని కోల్పోయి రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిందన్నారు. కేంద్రం వెంటనే విభజన హామీలన్నీ నెరవేర్చాలని, రెవెన్యూ లోటును భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నిమిషాలకు సభ మొదలవగానే, గవర్నర్ నరసింహన్ ఉభయసభలనుద్దేశించి దాదాపు గంట సేపు ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విజయాలను, లక్ష్యాలను ఆయన ప్రకటించారు. తమ ప్రభుత్వం మూడున్నరేళ్లుగా హామీల అమలు కోసం ప్రయత్నం చేస్తోందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఎదు రైన అనేక సవాళ్లకు బెదరకుండా సీఎం చంద్రబాబు నాయకత్వంతో... ప్రతీ సంక్షోభాన్ని అవకాశంగా మలుచుకుని ముందుకు వెళ్తోందని, ఏపీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని నరసింహన్ చెప్పుకొచ్చారు. ఏపీ అభివృద్ధి చెందే వరకు కేంద్రం సహాయం చేయాల్సి ఉందన్నారు. ప్రత్యేక హో దా, రైల్వే జోన్ హామీలు అమలు కావాలన్నారు. 9, 10 షె డ్యూల్ ప్రకారం ఆస్తుల పంపిణీ జరగాలని, వెనుకబడిన జిల్లా ల అభివృద్ధికి కేంద్రం మరిన్ని నిధులు ఇవ్వాలని గవర్నర్ తన ప్రసంగంలో డిమాండ్ చేశారు. విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు, రోడ్డు అనుసంధానం కావాల్సి ఉందని, అమరావతికి ఆర్థికసాయం, జాతీయ ప్రాముఖ్యత గల సంస్థలు ఏర్పాటు కావాలని తెలిపారు. కేంద్ర నిధులతో గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం ఏర్పాటుచేయాల్సి ఉందన్నారు. అసెంబ్లీ సీట్ల పెంపు, పన్ను విధింపు విషయాల్లో తేడాలను పరిష్కరించాలని, రాష్ట్రం విభజన కష్టాలను అధిగమించాలంటే కేంద్ర సాయం అనివార్యమని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

2019నాటికి పోలవరం పూర్తి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పోలవరం ప్రాజెక్టు ను 2019 నాటికి పూర్తి చేస్తామని గవర్నర్ నరసింహన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని నదులను అనుసంధానం చేస్తూ... 29 ప్రా ధాన్య ప్రాజెక్టులను పూర్తిచేయాలని లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. ఆ ప్రాజెక్టుల్లో 8 సాగునీటి ప్రాజెక్టులను ప్రారం భించామన్నారు. 2018 జూన్ చివరి నాటికి మరో 15 ప్రాజెక్టులు పూర్తిచేసేందుకు పనులు కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్రంలో భూగర్భ జలమట్టం 4.5 మీటర్లు పెరిగిందని చెప్పుకొచ్చారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా..

రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధి చేయటమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని గవర్నర్ నరసింహన్ స్పష్టం చేశారు. ‘‘రాష్ట్రంలో అభివృద్ధి ఫలాలు చిట్టచివరి వ్యక్తికి చేరేవరకు నిర్విరామంగా కృషి చేస్తున్నాం. సహజసిద్ధ వనరులు, తీరప్రాంతం, అధిక నైపుణ్యం కలిగిన సిబ్బంది సహకారంతో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగంలో నిలుపుతాం. ప్రభుత్వం ఏర్పడ్డాక శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసు వ్యవస్థ ఆధునీకరణ చేశాం.’’ అని గవర్నర్ స్పష్టం చేశారు.

అగ్రిగోల్డ్ అతిపెద్ద స్కామ్..

రాష్ట్రంలో అగ్రిగోల్డ్ అతిపెద్ద స్కామ్ అని గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. డిపాజిట్‌దారులు రూ.6,380 కోట్ల మేర కోల్పోయారని తెలిపారు. అగ్రిగోల్డ్ ఆస్తుల స్వాధీనానికి ఎస్సెల్ గ్రూప్ ముందుకొచ్చిందన్నారు. ఆత్మహత్య చేసుకున్న 136 మంది అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం చేశామని చెప్పుకొచ్చారు. ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. సంతోషకర, సమ్మిళిత, వినూత్న సమాజంగా ఉండాలనే మన కలలను సాకారం చేసుకునేవరకు ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తుందని ఈ రాష్ట్ర ప్రజలకు పునరుద్ఘాటిస్తున్నానని నరసింహన్ ముగింపు వాక్యాలను సభలో చదివారు.

విద్యార్థులూ! పరీక్షలు బాగా రాయండి

- చిరునవ్వు చెరగొద్దు..
  విశ్వాసం చెదరొద్దు: ప్రధాని



న్యూఢిల్లీ, మార్చి 5: దేశవ్యాప్తంగా 10, 12 తరగతుల విద్యార్థులు పరీక్షలు చక్కగా రాయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. కేంద్ర మాధ్యమిక విద్యా బోర్డు (సీబీఎస్ఈ) నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు హాజరవుతున్న వారందరికీ సోమవారం ఆయన ట్విట్టర్‌ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. చిరునవ్వు చెరగకుండా, ఆత్మవిశ్వాసం చెదరకుండా ధైర్యంగా జవాబులు రాసేందుకు యత్నించాలని కోరారు. ''సీబీఎస్ఈ నిర్వహిస్తున్న 10, 12 తరగతుల పరీక్షలకు హాజరయ్యే యువ మిత్రులందరికీ నా శుభాకాంక్షలు. ఈ పరీక్షలను చిరునవ్వుతో, ఆత్మవిశ్వాసంతో రాయండి. ఆత్మవిశ్వాసానికి మందులేవీ ఉండవు. అలాగే సుదీర్ఘ ఉపన్యాసాలు విన్నంత మాత్రాన ధైర్యం పుట్టుకు రాదు. జీవితంలో అడుగడుగునా మనల్ని మనం పరీక్షించుకోవడమే ఆత్మవిశ్వాసానికి సిసలైన ఔషధం'' అని ఉత్సాహపరిచారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా పట్టువీడరాదన్న దృక్పథాన్ని అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. కాగా, 'సమగ్ర నిరంతర మూల్యాంకనం' (సీసీఈ) పద్ధతిని రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు సీబీఎస్ఈ ప్రస్తుత ఏడాది నుంచే 10వ తరగతి పరీక్షలను పునఃప్రారంభించింది.

ముస్లింలు 'అయోధ్య'ను వదిలేయాలి

- **లేకపోతే భారత్ మరో సిరియా అవుతుంది!**
- **ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్**



న్యూఢిల్లీ, మార్చి 5: అయోధ్యపై ముస్లింలు తమ వాదనను వదులుకోవాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ స్పష్టం చేశారు. రామాలయ నిర్మాణం సమస్యను త్వరగా పరిష్కరించకపోతే భారత్ మరో సిరియా కాగలదని హెచ్చరించారు. ఒక పత్రికా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రామ జన్మభూమి–బాబ్రీ మసీదు వివాదానికి ఆయన ఆజ్యం పోశారు. ఈ అంశంపై వివిధ పక్షాలతో చర్చిస్తున్న నేపథ్యంలో– అయోధ్య ముస్లింలకు ఆరాధనీయ ప్రదేశం కాదని, ఈ విషయంలో పట్టువీడి సౌహార్దత చాటుకోవాలని సూచించారు. సిరియాలో ఎనిమిదేళ్లుగా సాగుతున్న బహుముఖ అంతర్యుద్ధం ఇప్పటికే 4.65 లక్షల మందిని బలిగొన్నదని గుర్తుచేశారు. అలాగే 10 లక్షల మంది గాయపడ్డారని, 1.2 కోట్లమంది నిరాశ్రయులయ్యారని వివరించారు. ''రాముడు అయోధ్యలో కాకుండా మరో చోట జన్మించేలా చేయలేం! అంతేగాక వివాదాస్పద స్థలంలో ప్రార్థనలను ఇస్లాం అనుమతించదు. ఈ వాస్తవాన్ని ముస్లింలు దృష్టిలో ఉంచుకుని సౌహార్దత ప్రదర్శించాలి'' అని వ్యాఖ్యానించారు. వివాదాస్పద స్థలంలో ఆస్పత్రి వంటి ప్రజోపయోగ నిర్మాణంద్వారా వివాదానికి ముగింపు పలకాలన్న కొందరి ప్రతిపాదనను ఆయన కొట్టిపారేశారు. అయోధ్య వివాదంపై కోర్టు వెలుపల పరిష్కారం దిశగా ఏడాది నుంచీ వివిధ వర్గాలతో రవిశంకర్ చర్చిస్తున్నారు. ఈ మేరకు అయోధ్య, బెంగళూరు, లఖ్‌నవ్, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నైలలో వ్యక్తిగతంగా, వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా చర్చల్లో పాల్గొన్నారు. ''ఈ వివాదమే ఊపిరిగా కొందరు వర్ధిల్లుతున్నారు. అందుకే నా ప్రయత్నాలను వారు వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు కోర్టు తీర్పు ఎలా ఉన్నా అందరూ దానితో ఏకీభవించరన్నది వాస్తవం'' అని పేర్కొన్నారు.

ప్రజా తీర్పును గౌరవిస్తాం

- **మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై రాహుల్**



న్యూఢిల్లీ, మార్చి 5: త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పరిస్థితి ఘోరంగా దిగజారడంపై పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఎట్టకేలకు స్పందించారు. ఈ మేరకు సోమవారం ట్విట్టర్‌లో ఒక ప్రకటన చేశారు. ''మూడు రాష్ట్రాల్లో ప్రజా తీర్పును కాంగ్రెస్ గౌరవిస్తోంది. ఈశాన్యంలో మా పార్టీని బలోపేతం చేసి, ప్రజల నమ్మకాన్ని తిరిగి నిలబెట్టుకోవడానికి కట్టుబడి ఉన్నాం. త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాల్లో పార్టీ విజయం కోసం అంకితభావంతో కృషిచేసిన కార్యకర్తలందరికీ ధన్యవాదాలు'' అని పేర్కొన్నారు. కాగా, శనివారం ఈ మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడే వేళ రాహుల్ ఇటలీ పర్యటనలో ఉన్నారు. తల్లి సోనియా జన్మభూమి కావడంతోపాటు ఆ దేశంలోనూ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ''ఇటలీలోనూ ఎన్నికలున్నాయిగా... అందుకే రాహుల్ అక్కడున్నారు మరి!'' అని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఎద్దేవా చేశారు. వాస్తవానికి ఇటలీలో ఉన్న అమ్మమ్మను పరామర్శించేందుకు రాహుల్ అక్కడికి వెళ్లారు. కాగా, రాహుల్ తీరును బీజేపీ నేత గిరిరాజ్ సింగ్ వెటకారం చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో ఏ పార్టీ అధ్యక్షుడూ తమ పార్టీ కార్యకర్తలను ఇలా వదిలేసి పారిపోడంటూ ఎద్దేవా చేశారు. ఓ జాతీయ పార్టీ అధ్యక్ష పదవిని ఆయన ఆషామాషీగా తీసుకుంటున్నారని విమర్శించారు.

చికిత్స కోసం అమెరికాకు పరికర్?

- ముంబైలో గోవా సీఎంకు వైద్య పరీక్షలు



న్యూఢిల్లీ, మార్చి 5: గోవా మనోహర్ పరికర్ ముంబైలో వైద్య పరీక్షలు చేయించుకుంటారని, అవసరమైతే చికిత్స కోసం అమెరికా వెళ్తారని సోమవారం ఆయన కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. వైద్యుల సలహా మేరకు అవసరమైతే విదేశాలకు వెళ్లే అవకాశం ఉందని పరికర్ వ్యక్తిగత కార్యదర్శి తెలిపారు. కాగా ముంబై వెళ్లే ముందుగా పరికర్ తన నివాసంలో సీనియర్ మంత్రులతో సమావేశమయ్యారు. తన గైర్హాజరీలో ప్రభుత్వ పరంగా నిర్ణయాలు తీసుకోవడానికి కేబినెట్ సలహా కమిటీని ఏర్పాటు చేశారు. కాగా గత నెల 15న చికిత్స కోసం పరికర్ ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వారం రోజుల తర్వాత డిశ్చార్జి అయ్యారు. గోవా అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. నాలుగు రోజుల తర్వాత పరికర్ మళ్లీ అస్వస్థతకు గురికావడంతో గోవా మెడికల్ కాలేజి ఆస్పత్రిలో చేరారు. ఈ నెల 1న ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ముంబైలో వైద్య పరీక్షలు చేయించుకున్న తర్వాత అవసరమైతే అమెరికాలో చికిత్స చేయించుకునేందుకు, ఆయన కుటుంబ సభ్యులు ఇప్పటికే అమెరికాలోని ఓ ఆసుపత్రితో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది.



లాలూ కూతురు.. అల్లుడికి ఊరట

- మనీలాండరింగ్ కేసులో బెయిల్ మంజూరు

న్యూఢిల్లీ, మార్చి 5: బిహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె మీసా భారతి, అల్లుడు శైలేష్ కుమార్‌లకు సీబీఐ కోర్టు ఊరట కల్పించింది. ఈడీ దాఖలు చేసిన మనీలాండరింగ్ కేసులో ఈ ఇద్దరికీ ఢిల్లీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. కోర్టు అనుమతి లేనిదే దేశం దాటి వెళ్లరాదని ఆదేశించింది. మీసా భారతి దంపతులు 2008–09 మధ్య తమ కంపెనీ మిశైల్ ప్యాకర్స్ అండ్ ప్రింటర్స్ పేరుతో ఢిల్లీ ఫామ్ హౌస్ కొనుగోలుకు సంబంధించిన కేసులో ఈడీ చార్జిషీటు దాఖలు చేసింది. షెల్ కంపెనీల ద్వారా అక్రమ మార్గాల్లో వచ్చిన రూ.1.2 కోట్లతో దాన్ని కొనుగోలు చేసినట్లు ఆరోపిస్తోంది. అయితే ఆ కంపెనీకి సంబంధించిన వ్యవహారాలు తాను చూడడంలేదని, తన భర్త శైలేష్ కుమార్, సందీప్ శర్మ(ఇప్పటికే మరణించారు) అనే చార్టెడ్ అకౌంటెంట్ మాత్రమే వాటిని చూసుకునే వారని మీసా భారతి పేర్కొంది. కాగా, కంపెనీ వ్యవహారాలు తాను చూస్తున్నప్పటికీ ఆర్థిక వ్యవహారాల్లో తాను జోక్యం చేసుకునే వాడిని కాదని, సందీప్ శర్మ మాత్రమే వాటిని చూసేవారని చెప్పాడు. అయితే ఈ కంపెనీలో మీసా భారతి దంపతులు డైరెక్టర్లుగా ఉన్నారని, దానికి సంబంధించిన వ్యవహారాలకు బాధ్యత వహించాల్సిందేనని ఈడీ వాదిస్తోంది. ఈ కేసులో సోమవారం ఢిల్లీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు వీరిరువురికి బెయిలు మంజూరు చేసింది.

అప్పుడే 'మహా' ఎండ!

43 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు.. అత్యంత వేడి జిల్లాగా నందుర్బార్

నాసిక్, మార్చి 5: మార్చి నెల మొదటి వారమైనా గడవక ముందే ఎండలు మండిపోతున్నాయి. మహారాష్ట్రలో అప్పుడే భానుడి భగభగలు తారస్థాయి చేరాయి. పగటి వేళ అడుగు బయటపెట్టాలంటే అక్కడి ప్రజలకు ముచ్చెమటలు పడుతున్నాయి. దేశంలోనే అత్యంత వేడి జిల్లాగా అక్కడి నందుర్బార్ జిల్లా రికార్డుల్లోకెక్కింది. ఈ సమయానికి గతంలో ఎప్పుడూ లేనంతగా ఉష్ణోగ్రత 43 డిగ్రీ సెంటిగ్రేడ్‌కు చేరింది. ఆదివారం ఈ స్థాయి ఉష్ణోగ్రత నమోదు కావడంతో వారాంతపు సెలవులో ప్రజలకు ఇంటికే పరిమితమయ్యారు. ఇక, దేశవ్యాప్తంగా పది అత్యధిక వేడి ప్రాంతాల్లో మూడు మహారాష్ట్రకు చెందిన జిల్లాలే ఉన్నాయని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ వెల్లడించింది. నందుర్బార్ తర్వాత జలగావ్ 38.8 డిగ్రీలతో రెండో స్థానంలో ఉంది. అలాగే మెల్‌గావ్‌లో 37.4 డిగ్రీలు, నాసిక్‌లో 34.8 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



నాయకుడి ఖాతాకు రూ. 1.8 కోట్లు

సొమ్ము ట్రాన్స్‌ఫర్ చేసిన కార్తీ చిదంబరం

తన ఖాతా నుంచే ఐదు విడతలుగా డబ్బు

- **నేతలతో సంబంధాలేంటని సీబీఐ.. ఈడీ ఆరా**
- **కార్తీకి క్విడ్ ప్రో కో కింద రూ. 3.1 కోట్లిచ్చాం**
- **కోర్టుకు పీటర్.. ఇంద్రాణి ముఖర్జియాల వెల్లడి**
- **ఒక రోజు పీటర్ విచారణకు ఈడీకి కోర్టు అనుమతి**

న్యూఢిల్లీ, మార్చి 5: ఇన్నాళ్లూ కార్తీ చిదంబరాన్ని కేవలం రూ. 10 లక్షల లంచం కేసులో అరెస్టుచేశారనే అంతా అనుకుంటున్నారు. కోట్లకు కోట్లు తినేసిన వాళ్లను వదిలి ఇంత చిన్నదానికే అరెస్టా.. అంటూ సోషల్ మీడియాలో ఒక వర్గం వాళ్లు దుమ్మెత్తి పోశారు కూడా. కానీ, వాళ్లనుకున్నట్లు కార్తీ ఏమీ అమాయకుడు కాదట. తన బ్యాంకు ఖాతా నుంచి ఒక ప్రముఖ రాజకీయ నాయకుడి ఖాతాలోకి రూ.1.8 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు కనుగొన్నారు. రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్లండ్ (ఆర్‌బీఎస్) చెన్నై బ్రాంచిలోని తన ఖాతా నుంచే కార్తీ ఈ నిధులు బదిలీ చేశారని ఈడీ ఆరోపిస్తోంది. ఈ కేసు రాజకీయంగా కూడా చాలా సున్నితం కావడంతో అత్యంత జాగ్రత్తగా దీన్ని డీల్ చేస్తున్నారు. డబ్బు తీసుకున్న వ్యక్తి కేంద్రంలో కొన్ని దశాబ్దాల పాటు చాలా కీలకమైన బాధ్యతలు నిర్వర్తించాల్సి వచ్చిందని, అయితే ఆయన పేరు బయటపెడితే దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందని ఈడీ అధికారులు చెప్పారు. అవసరమైతే సదరు రాజకీయ దిగ్గజాన్ని కూడా పిలిపించి విచారించాలని ఈడీ భావిస్తోంది. 2006 జనవరి 16 నుంచి 2009 సెప్టెంబరు 23 వరకు కార్తీ ఖాతా నెం. 397990 నుంచి ఐదు వాయిదాల్లో ఈ డబ్బు బదిలీ అయింది. ప్రస్తుతం కార్తీని సీబీఐ కస్టడీకి తీసుకుని విచారిస్తున్నందున అది అయిన తర్వాత తాము కస్టడీ కోరాలని ఈడీ భావిస్తోంది. ఈనెల ఆరోతేదీ వరకు సీబీఐ కస్టడీలోనే కార్తీ ఉంటారు. అంత పెద్ద మొత్తంలో డబ్బు పంపడానికి కారణాలేంటి, అలాగే ఆ నాయకుడితో ఉన్న సంబంధాలేంటనే విషయాలు విచారించాల్సి ఉందని అంటున్నారు. కార్తీకి విదేశాల్లో ఉన్న కొన్ని సంస్థల ద్వారా దాదాపు రూ. 3.1 కోట్లు చెల్లించినట్లు ఐఎన్ఎక్స్ మీడియా ప్రమోటర్లు ఇంద్రాణి, పీటర్ ముఖర్జియా కోర్టులకు తెలియజేశారు. తమ టీవీ చానల్ కోసం విదేశీ పెట్టుబడులకు ఫారిన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎఫ్ఐపీబీ) నుంచి క్లియరెన్సు పొందడానికి క్విడ్ ప్రో కో పద్ధతిలో ఈ డబ్బు ఇచ్చినట్లు వాళ్లు వెల్లడించారు. ఎఫ్ఐపీబీ ఆర్థిక మంత్రిత్వశాఖ పరిధిలో ఉంటుంది. అప్పట్లో ఆర్థికమంత్రిగా చిదంబరం ఉండేవారు. ముఖర్జియాలు ఈ అనుమతి కోసం 2007 మార్చిలో దరఖాస్తు చేసి, రెండు నెలల్లోనే అనుమతి పొందారు.

పీటర్‌ను ప్రశ్నించేందుకు అనుమతి


ఇదే కేసులో పీటర్ ముఖర్జియాను ప్రశ్నించేందుకు ఈడీకి కోర్టు అనుమతి లభించింది. పీటర్‌ను ఒకరోజు ప్రశ్నించుకోవచ్చని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులకు కోర్టు అనుమతి ఇచ్చింది.

సుప్రీంను ఆశ్రయించిన కార్తీ

మరో వైపు, ఎఫ్ఐఆర్‌లో పేర్కొనని అంశాలపై ఈడీ, సీబీఐ అధికారులు దర్యాప్తు చేయడాన్ని సవాలుచేస్తూ కార్తీ చిదంబరం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాను దర్యాప్తు సంస్థలతో పూర్తిగా సహకరిస్తున్నానని, కానీ వాళ్లు మాత్రం ఐఎన్ఎక్స్ మీడియాలో పెట్టుబడులతో సంబంధం లేని అంశాలు కూడా చూస్తున్నారని ఆరోపించారు. గత సంవత్సరం మే నెలలో వాళ్లు దాఖలుచేసిన ఎఫ్ఐఆర్‌కు కూడా సంబంధం లేకుండా తనను వేరే విషయాల్లోకి లాగాలని సీబీఐ, ఈడీ ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు.

సీబీఐకి 'ఎస్ఎస్‌సీ' కేసు


- ప్రశ్నపత్రం లీకేజిపై విచారణ: రాజ్‌నాథ్



న్యూఢిల్లీ, మార్చి 5: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ప్రశ్నాపత్రం లీకేజ్ కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు చేయనుంది. ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగిస్తూ కేంద్రం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పేపర్ లీక్ కావడంపై విద్యార్థులు ఆందోళనకు దిగడం, విచారణ చేయాలని డిమాండ్లు రావడంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. బీజేపీ నేతలు మనోజ్ తివారి, మీనాక్షి లేఖి ఈ విషయాన్ని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకువెళ్లి సీబీఐ విచారణ చేయించాలని విన్నవించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా ఇదే డిమాండ్ చేశారు. లీకేజ్ వ్యవహారంపై కేంద్రం ఎందుకు మౌనంగా ఉందంటూ కాంగ్రెస్ నేత శశిథరూర్ ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కేంద్రం సీబీఐ విచారణకు అంగీకరించింది. పేపర్ లీకేజ్ ఆరోపణలపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు, డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని సీబీఐ దర్యాప్తునకు ఆదేశించినట్టు రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. విద్యార్థులు ఆందోళన విరమించాలని కోరారు. ఇదిలావుండగా, ఎస్ఎస్‌సీ ప్రశ్నాపత్రం లీకేజీపై విచారణ జరిపించాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది.

కశ్మీర్‌లో ఉద్రిక్తత

- కాల్పుల్లో ఆరుగురి మృతి
- వారిలో ఇద్దరు ఉగ్రవాదులు



శ్రీనగర్, మార్చి 5: దక్షిణ కశ్మీర్‌లోని షోపియన్ జిల్లాలో ఆదివారం రాత్రి జరిగిన కాల్పుల్లో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. కాల్పుల ఘటన తర్వాత ఓ ఉగ్రవాది అతనికి సహకరించిన మరో ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్న భద్రత బలగాలు సోమవారం మరో రెండు మృతదేహాలను గుర్తించాయి. దీంతో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. షోపియన్ జిల్లాలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సోమవారం ఉదయం లభ్యమైన మృతదేహాల్లో ఓ వ్యక్తిని లష్కరే తొయిబాకు చెందిన ఆషిక్ హుస్సేన్ భట్‌గా గుర్తించారు. కాల్పులు జరిగిన పహనూ ప్రాంతం నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో అతని మృతదేహం లభించింది. ఆదివారం రాత్రి పహనూ ప్రాంతంలోని ఓ మొబైల్ చెక్‌పోస్టు వద్ద భద్రతా సిబ్బంది రెండు వాహనాలను ఆపమని సిగ్నల్ ఇచ్చారు. హెచ్చరికలను అతిక్రమించి రెండు వాహనాలు చెక్‌పోస్టు దాటి దూసుకెళ్లాయి. దీంతో భద్రతా సిబ్బంది ఆ వాహనాలపై కాల్పులు జరిపారు. కొద్దిసేపటి తర్వాత భద్రతా సిబ్బంది తనిఖీలు చేయగా అమీర్ అహ్మద్ మాలిక్ అనే వ్యక్తి మృతదేహం దొరికింది. అతడు గతేడాది జూలై నుంచి లష్కరే కోసం పని చేస్తున్నాడు. అక్కడి కొద్ది దూరంలో ఓ కారులో ముగ్గురు మరణించి ఉండడాన్ని సైనికులు గుర్తించారు. మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించారు. కొన్ని ఆయుధాలను కూడా భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఉదయం దొరికిన రెండు మృతదేహాల్లో ఒకటి హుస్సేన్ భట్‌ది కాగా మరోకటి షోపియన్‌కు చెందిన గౌహర్ అహ్మద్‌గా గుర్తించారు. ఉగ్రవాదులు కాకుండా మరణించిన వారిని వారి సహాయకులుగా భావిస్తున్నారు. కాల్పుల ఘటన తర్వాత షోపియన్ పరిసరాల్లో భద్రతా దళాలు మొహరించాయి. ఉగ్రవాదుల కోసం గాలింపు చేపడుతున్నాయి. కాగా, కశ్మీర్ వ్యాలీలో జేఆర్ఎఫ్ సోమవారం బంద్‌కు పిలుపునిచ్చింది. రెండు నెలల శీతాకాలం సెలవులు తర్వాత సోమవారం ఈ ప్రాంతంలో పాఠశాలలు, విద్యాసంస్థలు తెరుచుకోవాల్సి ఉంది. బంద్ నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా సోమవారం కూడా సెలవు ప్రకటించారు.

ఉద్యోగుల జేబుకొట్టిన కంపెనీలు

- **జీతాల్లో 'టీడీఎస్' కోత.. సొంతానికి మళ్లింపు**
- **447 సంస్థల్లో 3,200 కోట్ల భారీ కుంభకోణం**
- **ఐటీ అధికారుల తనిఖీల్లో అక్రమం గుట్టురట్టు**

ముంబై, మార్చి 5: మూలంలో ఆదాయపు పన్ను కోత (టీడీఎస్) పేరిట ఉద్యోగుల జీతాల్లో కోతపెట్టిన 447 సంస్థలు ఆ సొమ్మును ఐటీ శాఖకు జమచేయకపోగా, సొంత అవసరాలకు వాడేసుకున్నాయి. నిరుడు ఏప్రిల్ నుంచి 2018 మార్చి 1 మధ్య ఇలా రూ.3,200 కోట్ల మేర సిబ్బంది జేబుకొట్టిన కంపెనీలు ఆ నిధులను సొంత వ్యాపారాలకు మళ్లించుకున్నాయి. ఆదాయపు పన్ను శాఖలోని టీడీఎస్ విభాగం ఈ గుట్టును రట్టు చేసింది. దీనికి సంబంధించి ఇప్పటికే కొన్ని కంపెనీలపై విచారణ చేపట్టామని, మరికొన్నిటికి వారంట్లు జారీచేశామని అధికార వర్గాలు తెలిపాయి. ఆదాయపు పన్ను చట్టం 'సెక్షన్ 274 బి' కింద ఈ ఆరోపణలు రుజువైతే కనిష్ఠంగా మూడు నెలలు, గరిష్ఠంగా ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు జరిమానా విధించే అవకాశం ఉంది. మరోవైపు ఈ సెక్షన్‌సహా భారత శిక్షాస్మృతిలోని మోసం, నేరపూరిత విశ్వాస రాహిత్యం వంటి అంశాలకు సంబంధించిన సెక్షన్లను కూడా చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక ఉద్యోగులను మోసగించిన ఈ ఉదంతంలో పలువురు బిల్డర్లు నిందితులుగా ఉన్నారు. వీరిలో రాజకీయ సంబంధాలున్న ఓ ప్రముఖ బిల్డర్ రూ.100 కోట్ల మేర టీడీఎస్ నిధులను తన వ్యాపార అవసరాలకు మళ్లించేసినట్లు ఐటీ అధికారులు చెప్పారు. అలాగే పలు చిత్ర నిర్మాణ సంస్థలు, మౌలిక వసతుల కల్పన కంపెనీలు, అంకుర సంస్థలు, రాత్రివేళ ప్రయాణ సర్వీసులు నడిపే సంస్థలు వంటివి ఉన్నాయని ఐటీ అధికారవర్గాలు వివరించాయి. సమాచార సాంకేతిక సేవలందించే ఒక రేవుల నిర్మాణ సంస్థ రూ.14 కోట్లు, ఓ బహుళజాతి సంస్థ రూ.11 కోట్ల వంతున సొంతానికి వాడేసుకున్నట్లు పేర్కొన్నాయి.

రామరాజ్యం కోసమే!

- యూపీలో ఎన్‌కౌంటర్లపై కేశవ్‌ప్రసాద్ మౌర్య
- సాయుధ దాడిచేస్తే పోలీసు కాల్పులే జవాబు
- శాంతిభద్రతల పరిరక్షణ మా ప్రభుత్వ బాధ్యత

అలహాబాద్, మార్చి 5: ఉత్తరప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్ల సంఖ్య పెరిగిపోవడాన్ని ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య సమర్థించుకున్నారు. రాష్ట్రంలో రామరాజ్య స్థాపనే ప్రభుత్వ లక్ష్యమని, ఈ దిశగా నేరగాళ్ల నిర్మూలన అవసరమని ఒక పత్రికా ప్రతినిధితో మాట్లాడుతూ స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవడం అన్ని రాష్ట్రాల్లోనూ ఉన్నదేనని, యూపీకి మాత్రమే పరిమితం కాదని ప్రకటించారు. అయితే, నేరగాళ్లను హతమార్చడం తమ ప్రాథమ్యం కాదని, సాయుధ దుండగులు పోలీసులపై తిరగబడితే ఆత్మరక్షణ కోసం కాల్పులు తప్పవని కుండబద్దలు కొట్టారు. ఇదంతా చెడును తుడిచిపెట్టి ప్రశాంత వాతావరణం సృష్టించే ప్రయత్నంలో భాగమేనని, రామరాజ్యమంటే అదేనని వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో తుపాకులు చేతబట్టి తిరుగుతూ ప్రజలను భయభ్రాంతుల్ని చేయడాన్ని చూస్తూ కూర్చోవాలా? అని ప్రశ్నించారు. నిరుడు మార్చి నెలలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది మొదలు ఇప్పటిదాకా 1,240 ఎన్‌కౌంటర్లు చోటుచేసుకోవడం ఈ సందర్భంగా గమనార్హం. ఈ ఎదురుకాల్పుల్లో 40 మంది నేరగాళ్లు హతం కాగా, మరో 305 మంది గాయపడ్డారు. ఇటీవల నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సులో వాణిజ్యవేత్తలు కూడా దీనిపై సంతృప్తి వ్యక్తంచేశారని పేర్కొన్నారు. ఇక కాస్‌గంజ్ హింసాత్మక సంఘటనల నేపథ్యంలో 'త్రివర్ణ యాత్ర' నిర్వహించడాన్ని కూడా మౌర్య సమర్థించారు. 'జాతీయత ప్రకటన స్వేచ్ఛ' కోసమే దీన్ని చేపట్టినట్లు చెప్పారు. ఇక అయోధ్యలో రామాలయ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి గురించి ప్రశ్నించగా– ఈ అంశం ప్రస్తుతం సుప్రీం కోర్టు పరిధిలో ఉందని బదులిచ్చారు. అయితే, అబుధాబిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతులమీదుగా ఆలయానికి శంకుస్థాపన చేయడాన్ని బట్టి అయోధ్యపై బీజేపీ కట్టుబాటు ఏమిటో అర్థం చేసుకోవచ్చునని వ్యాఖ్యానించారు.

ఆర్థిక స్థిరత్వానికే ప్రాధాన్యం

- వృద్ధి రేటు లక్ష్యం 6.5% : చైనా

బీజింగ్, మార్చి 5: ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా పేరొందిన చైనా ఆర్థిక వ్యవస్థ వరుసగా రెండో ఏడాది కూడా కనిష్ఠ వృద్ధి రేటును నమోదు చేయనున్నట్లు అక్కడి ప్రభుత్వం సంకేతాలిచ్చింది. ఈ ఏడాది ఆర్థిక వృద్ధి రేటు లక్ష్యాన్ని 6.5 శాతంగా డ్రాగన్ కంట్రీ ప్రకటించింది. దేశంలో ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగించడానికే ప్రాధాన్యమివ్వనున్నట్లు పేర్కొంది. ఓవైపు సైనిక రంగానికి కేటాయింపులను ఏటేటా పెంచుకుంటూ పోవడం.. మరోవైపు స్టీల్ సెక్టార్‌లో పరిమితికి మించిన ఉత్పాదకత ఈ పరిస్థితికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా చైనా వస్తువులకు డిమాండ్ పడిపోతుండడమూ ఓ కారణమేనని చెప్పారు. ఈ నేపథ్యంలో చైనా తమ ఉత్పత్తుల క్వాంటిటీ(పరిమాణం) మీద కాకుండా క్వాలిటీ(నాణ్యత)పై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తే పాతికేళ్ల క్రితం(1992లో) నమోదైన కనిష్ఠ వృద్ధిరేటు(6శాతం)కు దగ్గర్లో ఈ ఏడాది వృద్ధిరేటు ఉండొచ్చని భావిస్తున్నారు. మరోవైపు బడ్జెట్లో రక్షణ రంగానికి చైనా ఈ ఏడాది కూడా భారీగా నిధులు కేటాయించింది. గతేడాదితో పోలిస్తే బడ్జెట్లో రక్షణ రంగానికి 8.1శాతం నిధులు పెంచినట్లు వెల్లడించింది. మొత్తం 175 బిలియన్ డాలర్ల (1.11 ట్రిలియన్ల)ను రక్షణ రంగానికి కేటాయించినట్లు చైనా అధికారిక న్యూస్ ఏజెన్సీ జున్హూ తెలిపింది. భారత బడ్జెట్లోని రక్షణ రంగం కేటాయింపులతో పోలిస్తే ఇది మూడు రెట్లు అధికం. ఇతర ప్రధాన దేశాలతో పోలిస్తే చైనా జీడీపీలో రక్షణ బడ్జెట్ ప్రభావం చాలా తక్కువగా ఉందని, జాతీయ ఆర్థిక వ్యయం కూడా తక్కువేనని నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జెంగ్ తెలిపారు.



శ్రీదేవి మళ్లీ తెలుగు అమ్మాయిగానే పుట్టాలి

– టి.సుబ్బరామిరెడ్డి

300 సినిమాలతో దక్షిణాదిన, ఉత్తరాదిన స్టార్ హీరోయిన్‌గా రాణించిన శ్రీదేవి. ఇటీవల ప్రమాదవశాత్తు దుబాయ్‌లో ఆమె కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆమకు టాలీవుడ్ సంస్మరణ సభను నిర్వహించారు. తెలుగు చిత్రసీమకు చెందిన పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

''శ్రీదేవితో నాకు నలబై సంవత్సరాలుగా మంచి పరిచయం ఉంది. అలాంటి వ్యక్తి చనిపోయిందని తెలియగానే నాతో పాటు యావత్ భారతదేశం షాక్ అయింది. మన తెలుగు అమ్మాయి 70 సినిమాలకు పైగా బాలీవుడ్‌లో సినిమాలు చేయడం, రాణించడం అంటే మాటలు కాదు. 'లమ్హే', 'చాందిని' సినిమాలను నేను, యశ్‌చోప్రాలు నిర్మించాం. మళ్లీ వచ్చే జన్మలో తెలుగు అమ్మాయిగానే పుట్టాలని కోరుకుంటున్నాను. అందరూ అనుకుంటున్నట్టు శ్రీదేవికి ఆర్థిక సమస్యలేం లేవు. హిందీలో ఆమెతో లమ్హే, చాందినీ అనే రెండు చిత్రాలు నిర్మించా. అవి రెండూ సక్సెస్ అయ్యాయి'' **– టి.సుబ్బరామిరెడ్డి**

''శ్రీదేవితో ఆమెతో నాలుగైదు సినిమాలే చేశాను. అద్భుతమైన నటి. కొన్ని క్యారెక్టర్స్‌ను ఆమె తప్ప మరెవరూ చేయలేరనిపించేలా నటించింది. మంచి సంస్కారం ఉన్న నటి. బొబ్బిలి బ్రహ్మన్న సినిమాను హిందీలో తీసినప్పుడు తనే హీరోయిన్‌గా నటించింది. అడిగిన వెంటనే డేట్స్ అడ్జస్ట్ చేసి నటించింది. నాతోనే కాదు.. తను నటించిన సినిమాల్లో అందరితో మంచి సహకారాన్ని అందించింది'' **– కృష్ణంరాజు**

''ఈరోజు మనసులో తెలియని బాధ. శ్రీదేవి నటిగా ప్రతి విషయంలో తనకు తానే పోటీగా నిలబడింది. మేం ఇద్దరం కలిసి తెలుగు, హిందీలో 15 సినిమాలకు పనిచేశాం. ఇద్దరి మధ్య హెల్దీ మధ్య కాంపిటీషన్ ఉండేది. తను నిజంగా ఈరోజు మన మధ్య లేదని అంటే నమ్మలేకుండా ఉన్నాను. మంచి తల్లిగా తన బిడ్డల్ని తీర్చిదిద్దాలన్న తపన తనలో ఉండేది'' **– జయప్రద**

''శ్రీదేవిగారు బ్యూటీఫుల్, ఫాబులస్ ఆర్టిస్ట్. అనుకోకుండా ఆమె మనల్ని విడిచి పెట్టి పోవడం బాధాకరం. ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను'' **– అమల**

''దేవలోకం నుండి వచ్చిన సుందరిలాగా మన ముందకు వచ్చి.. మనల్ని మరపించి మళ్లీ తన లోకానికి వెళ్లిపోయినట్లు అనిపిస్తుంది. తనకు 8 ఏళ్ల వయసున్నప్పుడు తన కోసం పాట పాడాను. తను హీరోయిన్‌గా నటించిన సినిమాలకు నేను పాటలు పాడాను. మనకు తీపి గుర్తులను మిగిల్చి వెళ్లిపోయారు. ఆమె మనసుకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను'' **– పి.సుశీల**

''శ్రీదేవి మనకు దూరం కావడాన్ని ఆమెతో నటించిన సహనటిగా జీర్ణించుకోలేకపోతున్నాను. ఆమెతో కలిసి 9–10 సినిమాల్లో నటించాను. మా ఫ్యామిలీతో తనకు మంచి అనుబంధం ఉండేది. ఆమె మనసుకు శాంతి కలగాలి. ఆమె ఇద్దరి అమ్మాయిలు గొప్ప హీరోయిన్స్‌గా పేరు తెచ్చుకుని, వారి తల్లి కోరికను తీరుస్తారని నమ్ముతున్నాను'' అన్నారు. **– జయసుధ**

''శ్రీదేవిగారు చిరస్థాయిగా మన మనస్సుల్లోనే ఉన్నారు. నటిగా ఆమె ఏ రోజు ఏ నిర్మాతను, దర్శకుడిని నొప్పించలేదు. కానీ ఈ ఏడాది మన అందరినీ నొప్పించి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. బోనీ, జాన్వీ, ఖుషీలు సహా అందరికీ ఆ దేవుడు ఆత్మస్థైర్యాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను'' **– సి.కల్యాణ్**

''నేను శ్రీదేవిగారితో కలిసి రెండు, మూడు సినిమాల్లో పనిచేశాను. ఆమెను ఆ దేవుడు నటిగా పుట్టించాడు. ఆమె యాబై ఏళ్లు నటించింది. మళ్లీ దేవుడు దగ్గరికే వెళ్లిపోయింది. ఆమె కుటుంబ సభ్యులందరికీ ఆ దేవుడు మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాను'' **– కోట శ్రీనివాసరావు**

''రామ్‌గోపాల్ వర్మ రాసిన లేఖ ఒకటి ఈ మధ్య చదివాను. అది చదివిన తర్వాత తను మనసు ఎంత మెత్తనైనదో అర్థమైంది. ఆమె గురించి వర్మ ఎంత స్టడీ చేశాడో నని కూడా అర్థమైంది. బోనీని శ్రీదేవి పెళ్లి చేసుకున్న తర్వాత.. బోనీ కుంటుంబం వారిని దూరం చేసింది. అందుకు కారణాలు ఏమైనా కావచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయనకు ఆ కుటుంబం దగ్గర కావాలని.. అవుతుందని నమ్ముతున్నాను'' **– అల్లు అరవింద్**

''శ్రీదేవిగారు అమర్ రహే. ఆమె కుటుంబానికి ఆ దేవుడు ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాను'' **– జగపతిబాబు**

''మా నాన్న, శ్రీదేవి వాళ్ళ నాన్న మంచి ఫ్రెండ్స్. దాంతో మా ఇద్దరి మధ్య మంచి అనుబంధం ఉంది. ఆమె మన మధ్య లేకపోవడం బాధాకరం'' **– రాజశేఖర్**

ముహూర్తం ఖరారు

స్వర్గీయ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ బయోపిక్‌ను తెరకెక్కించడానికి ఆయన తనయుడు హీరో బాలకృష్ణ సిద్ధమవుతున్నారు. తేజ దర్శకత్వంలో రూపొందనున్న ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమాను ఈ మార్చి 29న ప్రారంభించనున్నట్లు బాలకృష్ణ తెలిపారు. ఈ సినిమాను ఎన్నికలను దృష్టితో తీయడం లేదని చెప్పిన బాలకృష్ణ.. సినిమాను సంక్రాంతికి విడుదల చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ నటుడిగా రాణించడం, ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడం వరకే ఈ సినిమాలో ఉంటుంది.



బాలకృష్ణ

హీరోయిన్ ఫిక్స్



ఎన్టీఆర్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఏప్రిల్‌లో సినిమా చిత్రీకరణను జరుపుకోనుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంస్థ ట్విట్టర్ ద్వారా తెలియజేసింది. ఎన్టీఆర్ సరసన పూజా హెగ్డే హీరోయిన్‌గా చేయడం రారైంది. ఎస్.తమన్ సినిమాకు సంగీతం సమకూరుస్తుండగా, పి.ఎస్.వినోద్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ప్రస్తుతం 'సాక్ష్యం' సినిమాలో నటిస్తున్న పూజా హెగ్డే ఇప్పుడు ఎన్టీఆర్ చిత్రంతో పాటు మహేష్ 25వ సినిమా లో పూజా హెగ్డే నటిస్తుంది. ప్రభాస్, రాధాకృష్ణ కాంబో లో తెరకెక్కనున్న సినిమా లో కూడా ఈమెనే హీరోయిన్‌గా తీసుకునే అవకాశాలున్నాయని సమాచారం.

విజయ్ దేవరకొండ ద్విభాషా చిత్రం ప్రారంభం



విజయ్ దేవరకొండ, మెహరీన్ హీరో హీరోయిన్లుగా కొత్త చిత్రం సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తెలుగు, తమిళంలో తెరకెక్కనున్న ఈ సినిమాకు ఆనంద్ శంకర్ దర్శకుడు. కె.ఇ.జ్ఞానవేల్‌రాజా నిర్మాత. ముహూర్తపు సన్నివేశానికి అల్లు అరవింద్ క్లాప్‌నివ్వగా, సందీప్ రెడ్డి వంగా కెమెరా స్విచాన్ చేశారు. హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ ''స్క్రిప్ట్ వినగానే చాలా ఎగ్జైట్ అయ్యాను. తొలిసారి తెలుగు, తమిళ్‌లో సినిమా చేస్తున్నాను'' అన్నారు. నిర్మాత కె.ఇ. జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ '''అర్జున్‌రెడ్డి' మూవీ ఐదుసార్లు థియేటర్‌లో చూసి విజయ్‌తో ప్రేమలో పడ్డాను. విజయ్ దేవరకొండ మంచి నటుడు. మంచి టీం కుదిరింది. మార్చి 8 నుండి ఫస్ట్ షెడ్యూల్ హైదరాబాద్‌లో చేసి సెకండ్ షెడ్యూల్ చెన్నైలో చిత్రీకరిస్తాం'' అన్నారు. దర్శకుడు ఆనంద్ శంకర్ మాట్లాడుతూ ''స్క్రిప్ట్ విన్న విజయ్ దేవరకొండ తమిళ్ నేర్చుకొని డైలాగ్స్ చెబుతాననడం గొప్ప విషయం. ప్రముఖ కెమెరామెన్ రవి కె. చంద్రన్ తనయుడు శాంత ఈ సినిమాకి డి.ఓ.పి చేస్తుండటం విశేషం. సత్యరాజ్, నాజర్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. తెలుగు, తమిళ్ ప్రేక్షకులకు నచ్చేవిధంగా ఈ చిత్రం వుంటుంది'' అన్నారు. 'విజయ్ దేవరకొండ, ఆనంద్ శంకర్, జ్ఞానవేల్ రాజా కాంబినేషన్‌లో రానున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించడం ఆనందంగా ఉంది' అని మెహరీన్ తెలిపారు.

అట్టహాసంగా 90వ ఆస్కార్ అవార్డ్స్

ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ కళాకారులు అత్యుత్తమ పురస్కారంగా 'అకాడమీ అవార్డ్'ను పరిగణనలోకి తీసుకుంటారు. తమ సినిమా కెరీర్‌లో ఒక్క అస్కార్ అవార్డునైనా అందుకోవడం వారి జీవితాశయం. ప్రతి సంవత్సరం ఇచ్చే ఆస్కార్ అవార్డులకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ అవార్డుల వేడుక కోసం యావత్ సినీ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంది. ఈ సంవత్సరం 90వ ఆస్కార్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. హాలీవుడ్‌లోని డాల్బీ థియేటర్ ప్రపంచం నలుమూలల నుంచి విచ్చేసిన సినీ కళాకారులతో నిండిపోయింది. సినీ తారల చిరునవ్వుల సందోహాల మధ్య ఆస్కార్ అవార్డుల వేడుక ఘనంగా జరిగింది. ఈ సంవత్సరం 'షేప్ ఆఫ్ వాటర్' చిత్రం ఏకంగా ఏడు అవార్డులను సొంతం చేసుకుంది. ఉత్తమ నటుడుగా గ్యారీ ఓల్డ్‌మన్ (డార్కెస్ట్ హవర్), ఉత్తమ నటిగా ఫ్రాన్సెస్ మెక్‌డార్మ మండ్ (త్రి బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబింగ్, మిసోరి) అవార్డులు అందుకున్నారు. ఉత్తమ దర్శకుడుగా 'ద షేప్ ఆఫ్ వాటర్' సినిమాకుగాను గిలెర్మో డెల్ టోరో ఆస్కార్‌ను అందుకున్నారు. 13 నామినేషన్‌లతో ఆస్కార్ అవార్డుల రేసులో అగ్రభాగంలో నిలిచిన గ్విలెర్మో డెల్ టోరో రొమాంటిక్ ఫాంటసీ 'ద షేప్ ఆఫ్ వాటర్'కు ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడితో పాటు బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్ అవార్డు లభించింది. బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే అవార్డును 'గెట్ ఔట్' సినిమాకు గాను జోర్డన్ పీలె అందుకోగా, బెస్ట్ రైటింగ్ ఫర్ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే అవార్డు 'కాల్ మీ బై యువర్ నేమ్' సినిమాను వరించింది. 8 నామినేషన్‌లతో రెండో స్థానంలో నిలిచిన క్రిస్టోఫర్ నోలాన్ వార్ ఎపిక్ 'డంకిర్క్' మూ డు అవార్డులు సొంతం చేసుకుంది. 90వ ఆస్కార్ అవార్డులను గెలుచుకున్న వారెవరో ఓసారి చూద్దాం. అవార్డులు గెలుచుకున్న చిత్రాలు, నటీనటులు పోషించిన పాత్రల విశేషాల గురించి ఓసారి తెలుసుకుందాం.

ఉత్తమ సహాయ నటుడు: సామ్ రాక్‌వెల్



'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ' చిత్రానికి గానూ రాక్‌వెల్ ఉత్తమ సహాయ నటుడిగా అవార్డు అందుకున్నారు. ఈ చిత్రంలో రాక్‌వెల్ మద్యానికి బానిసైన పోలీస్ అధికారి పాత్రలో నటించారు.



ఉత్తమ చిత్రం: ది షేప్ ఆఫ్ వాటర్

ఎనిమిది చిత్రాలతో పోటీపడి 'ది షేప్ ఆఫ్ వాటర్' ఉత్తమ చిత్రంగా నిలిచింది. 2017లో వచ్చిన ఈ సినిమాను దర్శకుడు గులెర్మో డెల్ టోరో.. అమెరికన్ ఫాంటసీ డ్రామా చిత్రంగా తెరకెక్కించారు. సాల్లీ హాకిన్స్, మైఖెల్ షాన్నన్, రిచర్డ్ జెన్‌కిన్స్, డోగ్ జోన్స్, మైఖెల్ స్టుల్‌బార్గ్, ఆక్టేవియా స్పెన్సర్ తదితరులు ఈ చిత్రంలో ప్రధాన పాత్రల్లో నటించారు. ఓ ప్రభుత్వ ల్యాబొరేటరీలో పనిచేస్తున్న ఓ మూగ యువతి.. అదే ల్యాబొరేటరీలో పరిశోధన నిమిత్తం ఉంచిన హ్యూమనాయిడ్ నీటి జంతువుతో ప్రేమలో పడుతుంది. ఆ కథ ఎన్ని మలుపులు తిరిగింది అనేది ప్రధాన ఇతివృత్తం. 19.5 మిలియన్ డాలర్స్ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. బాక్సాఫీస్ వద్ద 114.3 మిలియన్ డాలర్లు వసూలు చేసింది.



ఉత్తమ సహాయ నటి: ఆల్లిసన్ జాన్నే

'ఐ, టోన్యా' సినిమాకి గానూ జాన్నే ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు. ఈ సినిమాలో జాన్నే తల్లి పాత్రలో నటించారు. సినిమా చూశాక విమర్శకులు సైతం ఆమె నటనను అభినందించకుండా ఉండలేకపోయారు.



ఉత్తమ చిత్రం: ది షేప్ ఆఫ్ వాటర్, **ఉత్తమ దర్శకుడు:** గల్లిర్మో డెల్ టోరో (ది షేప్ ఆఫ్ వాటర్), **ఉత్తమ నటి:** ఫ్రాన్సిస్ మెక్‌డోర్మండ్ (త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైట్ ఎబ్బింగ్, మిస్సోరీ), **ఉత్తమ నటుడు:** గ్యారీ ఓల్డ్‌మ్యాన్ (డార్కెస్ట్ అవర్), **ఉత్తమ సహాయ నటి:** అల్లీసన్ జెన్నీ (ఐ, టోన్యా), **ఉత్తమ సహాయ నటుడు:** సామ్ రాక్‌వెల్ (త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ), **ఉత్తమ యానిమేటెడ్ చిత్రం:** కోకో, **ఉత్తమ యానిమేటెడ్ షార్ట్ ఫిలిం:** డియర్ బాస్కెట్ బాల్, **ఉత్తమ సినిమాటోగ్రఫీ చిత్రం:** బ్లేడ్ రన్నర్ 2049, **ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్:** మార్క్ బ్రిడ్జెస్ (ఫాంటమ్ థ్రెడ్), **ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్:** ఇకారస్, **ఉత్తమ లఘు చిత్రం:** హెవెన్ ఈజ్ ఎ ట్రాఫిక్ జామ్ ఆన్ ది 405, **ఉత్తమ ఎడిటర్:** లీ స్మిత్ (డన్‌కర్క్), **ఉత్తమ అలంకరణ, కేశాలంకరణ:** కజుహిరో సుజి, డేవిడ్ మాలినోవ్‌స్కీ, లూసీ సిబ్బిక్ (డార్కెస్ట్ అవర్), **బెస్ట్ సౌండ్ మిక్సింగ్:** మార్క్ వీన్‌గార్టెన్, గ్రెగ్ ల్యాన్‌డార్కర్, గ్యారీ ఎ.రిజ్జో (డన్‌కర్క్), **బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్:** పాల్ డెన్‌హామ్, ఆస్టర్‌బెర్రీ (ది షేప్ ఆఫ్ వాటర్), **ఉత్తమ విదేశీ చిత్రం:** ఎ ఫెంటాస్టిక్ ఉమెన్ (చిలీ), **ఉత్తమ యానిమేటెడ్ షార్ట్ ఫిలిం:** డియర్ బాస్కెట్ బాల్, **బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్:** జాన్ నీల్సన్, గెర్డ్ నెఫ్జర్, పాల్ లాంబర్ట్, రిచర్డ్ ఆర్. హూవర్(బ్లేడ్ రన్నర్ 2049), **బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిలిం:** ది సైలెంట్ చైల్డ్, **బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే:** జేమ్స్ ఐవరీ (కాల్ మి బై యువర్ నేమ్), **బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే:** జోర్డన్ పీలే (గెటౌట్), **బెస్ట్ ఒరిజినల్ పాట:** రిమెంబర్ మీ(కోకో)



ఉత్తమ నటి: ఫ్రాన్సెస్ మెక్‌డోర్మండ్

'త్రీ బిల్‌బోర్డ్స్ ఔట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ' అనే చిత్రానికి గానూ ఫ్రాన్సెస్ ఉత్తమ నటిగా ఆస్కార్ అవార్డును అందుకున్నారు. ఓ హత్య కేసులో కూతుర్ని పోగొట్టుని న్యాయం కోసం పోరాడుతున్న తల్లి పాత్రలో ఫ్రాన్సెస్ నటించారు. ఈ సినిమాలో ఆమె నటనకు గానూ గోల్డెన్ గ్లోబ్, బాఫ్టా అవార్డులను సొంతం చేసుకున్నారు.



ఉత్తమ నటుడు: గ్యారీ ఓల్డ్‌మ్యాన్

'డార్కెస్ట్ అవర్' చిత్రానికిగానూ గ్యారీ ఓల్డ్‌మ్యాన్ ఉత్తమ నటుడిగా ఆస్కార్ అవార్డు అందుకున్నారు. ఈ చిత్రంలో గ్యారీ.. మాజీ బ్రిటన్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ పాత్రలో నటించారు. అవార్డు అందుకోగానే గ్యారీ మొదట 99 ఏళ్ల తన తల్లిని గుర్తుచేసుకున్నారు. ఈ అవార్డు ఇంటి తెస్తానని తన తల్లి వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

ఆస్కార్ వేదికపై నివాళి





90వ ఆస్కార్ అవార్డులు ప్రకటించిన ఏడాదిలోనే కన్నుమూసిన సినీ ప్రముఖులకు నివాళులర్పించడం ఆస్కార్‌లో సంప్రదాయంగా వస్తోంది. దీనిలో భాగంగా ఇటీవల కన్నుమూసిన అందాల తార శ్రీదేవిని ఆస్కార్ వేదిక గౌరవించింది. శ్రీదేవి జ్ఞాపకార్థం ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవ వేదికపై అమెకు నివాళులర్పించారు. శ్రీదేవితో పాటు ప్రముఖ బాలీవుడ్ నటుడు, నిర్మాత శశికపూర్‌కు కూడా స్మృత్యంజలి ఘటించారు. వీరిద్దరి చిత్రాలను బిగ్ స్క్రీన్ పై చూపుతూ చలనచిత్ర రంగానికి వీరు చేసిన సేవలను సభా వేదిక గుర్తు చేసుకుంది. శ్రీదేవి, శశికపూర్‌లను స్మరించుకుంటూ ఎడ్డీ వెడ్డర్ ప్రదర్శన జరిగింది. 'ఇన్ మెమొరియం' పేరుతో జరిగిన ఈ కార్యక్రమంలో జేమ్స్‌బాండ్ స్టార్ రోజర్ మూర్, మేరీ గోల్డ్‌బెర్గ్, జోహాన్ జోన్సన్, జాన్ హెర్డ్, శామ్ షెఫర్డ్‌లకు కూడా అకాడమీ అవార్డుల వేదిక నివాళులర్పించింది.

అభివృద్ధి ఆగకూడదు

మన కష్టంతో ముందుకు.. మూడేళ్లుగా రెండంకెల వృద్ధి.. దేశానికి నమూనాగా ఏపీ

- ఉపాధి నిధుల విషయంలో కేంద్రంపై ఎంపీల ఒత్తిడి
- 80 కరువు మండలాల్లో 150 పనిదినాలు కల్పిస్తాం
- నీరు-ప్రగతి టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు


కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

అమరావతి, మార్చి 5 (మనం ప్రతినిధి): ''విభజన తర్వాత కష్ట సమయంలో సమిష్టి కృషితో ముందుకు సాగాం. మన కష్టార్జితంతోనే మనం నిలబడాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ అభివృద్ధి ఆగిపోకూడదు'' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం, అధికారుల సమిష్టి కృషితోనే మూడేళ్లుగా రెండంకెల వృద్ధి రేటును సాధించామని గుర్తు చేశారు. యావత్ భారతదేశానికే ఆంధ్రప్రదేశ్ ఒక నమూనాగా ఉండాలని ఆయన చెప్పారు. సోమవారం తన నివాసం నుంచి నీరు-ప్రగతి, వ్యవసాయం పురోగతిపై ఆయన అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతీయ స్థాయిలో వృద్ధిరేటు 6.8% ఉంటే.. ఏపీలో సగటున 11.22% సాధించామని చంద్రబాబు అన్నారు. 17.79% వృద్ధి వ్యవసాయం అనుబంధ రంగాలలో వచ్చే పరిస్థితి ఉందన్నారు. రెండేళ్లుగా లోటు వర్షపాతం నమోదవుతున్నప్పటికీ పంట దిగుబడుల ఏ మాత్రం తగ్గకుండా కృషి చేశామని చెప్పారు. సమర్థ నీటి నిర్వహణ ద్వారా భూగర్భ జలాలు పడిపోకుండా కాపాడడంపై అధికార యంత్రాంగాన్ని అభినందించారు. నీరు-ప్రగతి, జల సంరక్షణ విజయవంతం వల్లే ఇది సాధ్యం అయ్యిందన్నారు. ఇదే స్ఫూర్తితో రబీ సీజన్‌లో ఒక్క ఎకరంలో కూడా పంటలు ఎండిపోకుండా చూడాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ నిధుల విడుదలలో జాప్యంపై పార్లమెంటులో రాష్ట్ర ఎంపీలు ప్రస్తావిస్తారని, కేంద్రంపై ఒత్తిడి తెస్తారని, ఉపాధి పనుల వేగం తగ్గకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఉపాధి కూలీలకు చెల్లింపులకు ఇబ్బంది లేకుండా కేంద్రం నుంచి నిధులు సకాలంలో విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో 80 కరవు మండలాలలో 150 రోజులు ఉపాధి కల్పించాలని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి పని పారదర్శకంగా జరగాలని, ఎక్కడా ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా చూసుకోవాలని చెప్పారు. మెటీరియల్ కాంపోనెంట్ 40 శాతానికి మించకుండా చూడాలని, వేజ్ కాంపోనెంట్‌ను ప్రతి జిల్లాలో 60 శాతానికి పెంచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

కందులు, అపరాలకు గిట్టుబాటు ధర

రైతుల్లో ఎక్కడా అశాంతి తలెత్తకూడదని, కందులు, మినులు, అపరాలకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని సీఎం అన్నారు. మార్కెట్ జోక్యం ద్వారా రైతుకు గిట్టుబాటు ధర లభించేలా చేయాలని సూచించారు. రాబోయే ఖరీఫ్‌కు భూసార పరీక్షలపై దృష్టి సారించాలని అన్నారు. తెగుళ్ల బెడద నియంత్రణలో, పీల్చే గాలి నాణ్యత(ఎయిర్ క్వాలిటి)లో వ్యవసాయ శాఖ, వాతావరణ శాఖ, ఇస్రో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమస్య రాకముందే నివారించే సామర్థ్యం పెరగాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. అసెంబ్లీ ఉన్నా, సదస్సులు ఉన్నా క్రమం తప్పకుండా టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహించడాన్ని బట్టి 'నీరు-ప్రగతి'కి ఇచ్చే ప్రాధాన్యాన్ని గుర్తించాలన్నారు. ఒక్క రోజు కూడా దీనిపై అలక్ష్యం చేయకూడదనే ఇంతగా దీనికి ప్రాధాన్యం ఇస్తున్నామని సీఎం చెప్పారు.

ఎమ్మెల్యేలంతా రావాలి

సమావేశాలకు హాజరు కావాలి: చంద్రబాబు

గవర్నర్ ప్రసంగానికి కేబినెట్ ఆమోదం

అమరావతి, మార్చి 5 (మనం ప్రతినిధి): ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరిగే అన్నీ రోజులు ఎమ్మెల్యేలు హాజరు కావాలని టీడీపీ అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. ఎమ్మెల్యేలు ఎవరూ ప్రైవేట్ కార్యక్రమాలు పెట్టుకోవద్దన్నారు. సభలో ప్రతిపక్షం లేదని సమావేశాలను తేలికగా తీసుకోవద్దని ఆదేశించారు. ఎమ్మెల్యేల హాజరు బాధ్యతను ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు తీసుకోవాలని సూచించారు. సోమవారం ఉదయం గవర్నర ప్రసంగానికి ముందుగా ఏపీ కేబినెట్ అమోదం తెలిపింది. ఈ నెల 8న ఉదయం 11.30కి ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారని వెల్లడించారు. ఢిల్లీలో కేంద్రాన్ని అడగాల్సిన అంశాల గురించి యనమల చర్చించారు.


నేడు టీడీపీలోకి చలమలశెట్టి

- చంద్రబాబు సమక్షంలో సునీల్ చేరిక

గత రెండు ఎన్నికల్లో కాకినాడ లోక్‌సభ నియోజకవర్గానికి పోటీ చేసి ఓడిపోయిన చలమల శెట్టి సునీల్ మంగళవారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో సునీల్‌తో పాటు అతని అనుచరులు చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరబోతున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం నుంచి పోటీ చేసిన సునీల్ గట్టిపోటీ ఇవ్వడంతో పాటు రెండో స్థానంలో నిలిచారు. గత ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసిన ఆయన టీడీపీ అభ్యర్థి చేతిలో కేవలం మూడు వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. అయినా సునీల్ నిత్యం ప్రజల్లోనే ఉంటారన్న పేరుంది.

28 వరకూ అసెంబ్లీ

- 17 రోజులు సమావేశాలు
- 8న బడ్జెట్: చీఫ్ విప్ పల్లె
- బీఏసీ సమావేశంలో నిర్ణయం



అమరావతి, మార్చి 5 (మనం ప్రతినిధి): ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 28వ తేదీ వరకూ జరుగుతాయని ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథ రెడ్డి చెప్పారు. 17 రోజులు సమావేశాలు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. సోమవారం శాసనసభ ప్రాంగణంలో మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. సమావేశాలకు మధ్యలో 5 రోజులు సెలవులు ఉంటాయని తెలిపారు. గవర్నర్ ప్రసంగంపై జరిగే చర్చకు 7వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమాధానం ఇస్తారన్నారు. 8వ తేదీన ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు బడ్జెట్‌ను ప్రవేశపెడతారని తెలిపారు. సమావేశాల్లో విభజన చట్టంలోని అంశాలను చర్చించనున్నట్లు పల్లె తెలిపారు. సమావేశాలు జరిగే రోజుల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. గవర్నర్ ప్రసంగంలో రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాలను వెల్లడించినట్లు తెలిపారు. 84 లక్షల మంది రైతులకు రూ.24 వేల కోట్ల రుణాలు మాఫీ చేసినట్లు వివరించారు.


ఢిల్లీలో ధర్నా చేస్తున్న వైసీపీ ఎంపీలు, పార్టీ నాయకులు

ఢిల్లీ వీధుల్లో మహాధర్నా

- వెల్లువెత్తిన వైఎస్‌ఆర్‌సీపీ శ్రేణులు
- హోదా కోసం నినదించిన నేతలు
- ప్యాకేజి వద్దు.. మోసం చేయద్దు
- స్వార్థం కోసం చంద్రబాబు యత్నం
- ఎంపీలు సహా పలువురు నేతల అరెస్టు
- సంసద్ మార్గ్‌లో తీవ్ర ఉద్రిక్తత
- ధర్నాకు పలు పార్టీల సంఘీభావం

న్యూఢిల్లీ, మార్చి 5: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ ఢిల్లీ వీధుల్లో వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పలువురు నాయకులు సోమవారం మహాధర్నాకు దిగారు. రాష్ట్ర సంక్షేమాన్ని పణంగా పెట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సొంత డబ్బా కొట్టుకుంటున్నారని, తాము మాత్రం ప్రత్యేక హోదా లక్ష్యం నెరవేరేవరకు పోరాటం కొనసాగిస్తూనే ఉంటామని ప్రతినబూనారు. ఏపీ ప్రత్యేక హోదా అంశం జాతీయస్థాయికి వెళ్లాలన్న ఉద్దేశంతోనే ఢిల్లీ వరకు వచ్చి.. ఇక్కడ పలు పార్టీల మద్దతు తీసుకుని మరీ ధర్నా చేసినట్లు పార్టీ సీనియర్ నేతలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, బొత్స సత్యనారాయణ, పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీలు విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, వరప్రసాద్, మిథున్ రెడ్డి, తదితరులు చెప్పారు. ప్రత్యేక ప్యాకేజి తమకొద్దని, ఆ పేరుతో మోసం చేయొద్దని.. హోదాయే కావాలని నినదించారు. ఎన్నికల సమయంలో ఐదేళ్లు, పదేళ్లు కాదు.. పదిహేనేళ్లు ప్రత్యేక హోదా కావాలన్న చంద్రబాబు, తాను అధికారంలోకి వచ్చాక హోదా ఏమైనా సంజీవనా అని ప్రశ్నించారని గుర్తుచేశారు. ప్యాకేజితో తనకు, తన కోటరీకి లబ్ధి కలుగుతుందని దానికి తలూపారని విమర్శించారు. ఈనెల 21వ తేదీ వరకు పార్లమెంటులో కూడా ఈ అంశంపై పోరాడుతామని, ఆ తర్వాత ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టడంతో పాటు.. తమ ఎంపీలు పదవులకు కూడా రాజీనామా చేస్తారని చెప్పారు. చంద్రబాబుకు ఈ అంశంపై చిత్తశుద్ధి లేదని.. అందుకే ఆయన ఎంపీలిద్దరు ఇంకా కేంద్రమంత్రివర్గంలో కొనసాగుతున్నారని ఎద్దేవా చేశారు.

నాయకుల అరెస్టు.. ఉద్రిక్తత

ధర్నా అనంతరం కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వినతి పత్రం ఇవ్వడానికి పార్లమెంటుకు బయల్దేరిన వైఎస్‌ఆర్‌సీపీ నాయకులను పోలీసులు అరెస్టుచేసి పార్లమెంటు హౌస్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సమయంలో సంసద్ మార్గ్‌లో ఉద్రిక్తత నెలకొంది. ఎంపీలు విజయసాయిరెడ్డి, వరప్రసాద్, వైవీ సుబ్బారెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి తదితరులను అరెస్టు చేసి.. వాహనంలో పోలీసు స్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా ప్రత్యేక హోదా కోసం ఆందోళన చేస్తున్న తమను అరెస్టు చేయడంపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము రాజీనామాలకు సిద్ధపడ్డామని, అలాంటిది అరెస్టులకు భయపడతామా అని ఎంపీలు ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధించేవరకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. కాగా.. తమ నేతల అరెస్టుపై పార్టీ నేతలు మండిపడ్డారు. ఢిల్లీ పెద్దలను ఎదిరించడం తమకు కొత్త కాదని.. బీజేపీ గతంలో చేసినట్లే ఇప్పుడూ చేస్తోందని.. ప్రత్యేకహోదా హామీని కేంద్రం నెరవేర్చాలని వైఎస్‌ఆర్‌సీపీ నేత కురసాల కన్నబాబు అన్నారు. టీడీపీ-బీజేపీ కుట్రలతో ఏపీకి అన్యాయం జరుగుతోందని.. అరెస్టులు చేసినా భయపడేది లేదని, మరింత ఉధృతంగా పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి, పార్టీ నేతలు తమ్మినేని సీతారాం, విశ్వరూప్ తెలిపారు.


వైసీపీ ఎంపీలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

నేతల సంఘీభావం

వైఎస్‌ఆర్‌సీపీ నేతల మహాధర్నాకు పలువురు నేతలు, ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. సీపీఐ నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఆప్ నేత రామారావు, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు సదాశివారెడ్డి, ఆంధ్ర మేధావుల సంఘం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. తర్వాత సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు కూడా ధర్నాకు సంఘీభావం తెలిపారు.


పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేస్తున్న టీడీపీ ఎంపీలు

మలివిడత తొలిరోజే..!

- నినాదాలతో దద్దరిల్లిన లోక్‌సభ
- విభజన హామీలపై స్పష్టత ఇవ్వాల్సిందే
- పోడియం వద్ద టీడీపీ ఎంపీల ప్లకార్డులు
- కావేరీ జలాలపై నినదించిన అన్నాడీఎంకే
- రాజ్యసభలోనూ ప్లకార్డులు.. నినాదాలు
- టీడీపీ ఎంపీల తీవ్రస్థాయి నిరసన పర్వం
- పార్లమెంటు ఉభయసభలు నేటికి వాయిదా

న్యూఢిల్లీ, మార్చి 5: పార్లమెంటు మలివిడత బడ్జెట్ సమావేశాలు తొలిరోజు దద్దరిల్లాయి. పలు రాష్ట్రాలకు చెందిన ప్రతిపక్ష సభ్యులు తమ తమ డిమాండ్లతో సభను హోరెత్తించారు. టీడీపీ ఎంపీలు లోక్‌సభ ప్రారంభం కాగానే వెల్‌లోకి దూసుకెళ్లి విభజన హామీలపై స్పష్టత ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. సభలో తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొనడంతో స్పీకర్ సుమిత్రామహాజన్ సభను గంటపాటు వాయిదా వేశారు. వాయిదా అనంతరం తిరిగి ప్రారంభమైన సభలో టీడీపీ ఎంపీలు తమ నిరసనను కొనసాగించారు. ఏపీకి న్యాయం చేయాలంటూ పోడియంను చుట్టుముట్టి నినాదాలు చేశారు. విభజన హామీలు తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చూస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అదే సమయంలో కావేరి జలాల అంశంపై తమిళనాడుకు చెందిన అన్నాడీఎంకే సభ్యులు కూడా నినాదాలు చేశారు. పరిస్థితి అదుపులోకి వచ్చేలా లేకపోవడంతో స్పీకర్ సభను మంగళవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలోనూ...

అటు రాజ్యసభలోనూ అదే పరిస్థితి నెలకొంది. ఏపీకి న్యాయం చేయాలంటూ టీడీపీ ఎంపీలు ప్లకార్డుల ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. టీడీపీ ఎంపీల ఆందోళనకు టీఆర్ఎస్, టీఎంసీ మద్దతు తెలిపాయి. దీంతో సభలో గందరగోళం నెలకొనడంతో రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు సభను పదినిమిషాల పాటు వాయిదా వేశారు. తిరిగి మొదలైన సభలోనూ టీడీపీ ఎంపీలు తమ నిరసనను కొనసాగించారు. చైర్మన్ వెంకయ్యనాయుడు సభ్యులకు నచ్చజెప్పేందుకు యత్నించినప్పటికీ వారు వినకపోవడంతో సభను రెండోసారి మధ్యాహ్నం 2గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా సభలో అదే పరిస్థితి నెలకొంది. డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్ సభ్యులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకుండా.. ఏపీ ఎంపీలు పోడియంను చుట్టుముట్టారు. ఏపీకి న్యాయం చేయాలని కోరుతూ నినాదాలు చేయడంతో.. సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు కురియన్ ప్రకటించారు.

వాయిదా తీర్మానాలు


రాజ్యసభలో తక్షణం చర్చించాల్సిన అంశాలున్నాయంటూ బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు వాయిదా తీర్మానాలు ఇచ్చారు. కొందరు మాజీ మంత్రుల బంధువులు వారిని అడ్డుపెట్టుకుని అవినీతికి పాల్పడిన అంశంపై బీజేపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. ప్రధానంగా కార్తీ చిదంబరం అంశాన్ని వాళ్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక పంజాబ్ నేషనల్ బ్యాంకు సహా పలు బ్యాంకులకు బురిడీ కొట్టించి విదేశాలకు చెక్కేసిన నీరవ్ మోదీ వ్యవహారంలో ప్రధాని మోదీ సమాధానం చెప్పాలంటూ ప్రతిపక్షం డిమాండ్ చేసింది. పీఎన్‌బీ స్కాంతో కాంగ్రెస్‌కే సంబంధం ఉందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ఆరోపించారు. జనవరి 29వ తేదీన ప్రారంభమైన పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 9వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మధ్యలో ఫిబ్రవరి 9 నుంచి 23 రోజుల సెలవు ఇచ్చారు.

రోజంతా ఇక్కడే ఉండాలనిపిస్తోంది

చంద్రబాబు సీఎం కావడం.. ప్రజల అదృష్టం: నరసింహన్

అమరావతి, మార్చి 5 (మనం ప్రతినిధి): నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో గవర్నర్ నరసింహన్ దంపతులు ఉత్సాహంగా గడిపారు. సచివాలయానికి వచ్చిన గవర్నర్ దంపతులు.. రియల్‌టైమ్ గవర్నెన్స్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్టీజీ సెంటర్ పనితీరుపై సీఎం చంద్రబాబు ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనికి గవర్నర్ నరసింహన్ ఆనందం వ్యక్తం చేశారు. 'గంట కాదు.. రోజంతా ఇక్కడే ఉండాలనిపిస్తోంది'అని వ్యాఖ్యానించారు. ఆర్టీజీ సెంటర్ సహాయంతో పనిచేస్తే వృద్ధి రేటు అతి త్వరలోనే ఏపీ 15 శాతం దాటుతోందని కితాబిచ్చారు. చంద్రబాబు లాంటి విజన్ ఉన్న ముఖ్యమంత్రి ఉండటం ఏపీ ప్రజల అదృష్టం అని గవర్నర్ ప్రశంసించారు.


ఆర్టీజీని సందర్శించిన గవర్నర్ దంపతులు



29న ఎన్టీఆర్ సినిమా!

చేతికట్టుతో అసెంబ్లీకి బాలయ్య.. పరామర్శించిన ఎమ్మెల్యేలు

అమరావతి, మార్చి 5 (మనం ప్రతినిధి): ఈ నెల 29న ఎన్టీఆర్ సినిమా షూటింగ్ ప్రారంభిస్తామని హిందూపూరం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ ప్రకటించారు. నందమూరి తారక రామారావు జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం ఇదని, ఎన్నికల సందర్భంగా తీసే సినిమా కాదన్నారు. ఈ నెలాఖరున తొలిషెడ్యూల్ షూటింగ్ ప్రారంభిస్తామన్నారు. షూటింగ్‌ను వేగవంతంగా పూర్తి చేసి వచ్చే సంక్రాంతికి సినిమా విడుదల చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ మీద ఉన్న అభిమానంతో చాలా మంది సినిమాకు చాలా పేర్లు సూచించారని, కానీ ఎన్టీఆర్‌ను మించిన పేరు లేదని భావించి ఆపేరునే ఖరారు చేశామని చెప్పారు. పార్టీలకు అతీతంగా ఎన్టీఆర్‌కు అభిమానులున్నారని, ప్రతిఒక్కరూ ఎన్టీఆర్‌ను అభినందించిన వారేనని బాలకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బాలకృష్ణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా అసెంబ్లీ లాబీల్లో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఇటీవల తన కుడిభుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న బాలయ్య.. చేతికట్టుతోనే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. సహచర ఎమ్మెల్యేలు పరామర్శించడంతో పాటు గాయాన్ని సైతం లెక్కచేయకుండా అసెంబ్లీకి రావడాన్ని వారు అభినందించారు. జీవితంలో తగిలిన ఎన్నో ఎదురు దెబ్బలతో పోలిస్తే.. ఇది పెద్ద దెబ్బేమీ కాదని బాలయ్య వారికి సమాధానమిచ్చారు. మార్చి 31 నుంచి ఏప్రిల్ 1 వరకూ లేపాక్షి ఉత్సవాలు నిర్వహిస్తామని ప్రకటించారు. హంద్రీనీవా సుజల స్రవంతికి జలహారతి నిర్వహించి ఉత్సవాలను ప్రారంభిస్తామని తెలిపారు.

టార్గెట్ టీడీపీ



అసెంబ్లీ సమావేశాలకు బీజేపీ రెఢీ

- విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రస్తావన
- విద్యాశాఖ మంత్రిపై ఆరోపణలు
- అస్త్రశస్త్రాలతో ఎమ్మెల్యేలు సిద్ధం
- ఈసారి పూర్తిగా ప్రతిపక్ష పాత్రే
- కేంద్రపథకాలపై విస్తృత ప్రచారం
- 'మోదీ విలన్' ఫ్లెక్సీలపై మండిపాటు

అమరావతి, మార్చి 5 (మనం ప్రతినిధి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ప్రధాన ప్రతిపక్షం వైఎస్‌ఆర్‌సీపీ గైర్హాజరు అవుతుండటంతో... ఈసారి ప్రతిపక్ష పాత్ర పోషించడానికి బీజేపీ సిద్ధమవుతోంది. అధికార పార్టీకి మిత్రపక్షమే అయినా.. రాష్ట్రంలో బీజేపీని టార్గెట్ చేస్తూ టీడీపీ నాయకులే మాటల తూటాలు పేల్చడంతో.. బీజేపీ కూడా ఎదురుదాడికి సిద్ధమైంది. ఓవైపు కేంద్రం రాష్ట్రానికి ఏవేం కేటాయింపులు చేసిందనే అంశాన్ని వివరిస్తూనే.. మరోవైపు రాష్ట్రంలో టీడీపీ పాలనను ఎండగట్టే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో టీడీపీ పాటే పాడిన బీజేపీ.. ఇప్పుడు ఉన్నట్టుండి ప్రతిపక్షంగా మారిపోవడంతో అసెంబ్లీ వాతావరణం వేడెక్కింది. లాబీల్లోనూ, మీడియా పాయింట్లలోనూ ఈ సమావేశాల్లో తాము ఎలా వ్యవహరిస్తామనే అంశాన్ని బీజేపీ నాయకులు కళ్లకు కట్టినట్లు చూపించారు. ఇది శాంపిలేనని, ఇకముందు మరింత ఘాటుగా వ్యవహారం ఉంటుందని హెచ్చరించారు.

ఎదురు దాడి వ్యూహం

రాష్ట్ర అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలు నలుగురే ఉన్నారు. శాసనమండలిలో ఇద్దరు సభ్యులు ఉన్నారు. అయినా తాము తగ్గేది లేదని స్పష్టం చేస్తున్నారు. విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పెన్మత్స విష్ణు కుమార్ రాజు, రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆకుల సత్యన్నారాయణ, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, మంత్రి పైడికొండల మాణిక్యాలరావు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మరో ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్... వీళ్లంతా టీడీపీపై ఎదురు దాడికి సిద్ధమయ్యారు. ముందుగా వీరంతా రాష్ట్రంలో ఇటీవల విపరీతంగా జరుగుతున్న విద్యార్థుల మరణాలపై చర్చించేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్రంలోని కార్పొరేట్ కళాశాలల్లో జరుగుతున్న అకృత్యాలపై ప్రభుత్వాన్ని నిలదీయబోతున్నారు. రాష్ట్రంలో దిగజారిపోతున్న ఇంటర్మీడియట్ విద్యా విలువల గురించి పోరాటం చేయనున్నారు. ఇంటర్మీడియట్ విద్య, విద్యార్థుల బలవన్మరణాల్లో రాష్ట్ర మంత్రి నారాయణకు చెందిన కళాశాలలే ఎక్కువగా ఉండటంతో బీజేపీ దీనిపై దృష్టిపెట్టింది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా నారాయణ వియ్యంకుడు గంటా శ్రీనివాసరావే ఉండటంతో ఈ అంశాన్ని వారు ప్రధాన అస్త్రంగా చేసుకున్నారు.


కేంద్ర పథకాలు, సహాయంపై వివరణ

ఏపీకి కేంద్రం ఎన్నో విధాలుగా సాయం చేసిందని, ఇకముందు కూడా చేస్తుందని బీజేపీ నాయకులు స్పష్టం చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో దీని గురించి గణాంకాలతో సహా వివరిస్తామని అంటున్నారు. ఇటీవల టీడీపీ వాళ్లు ప్రత్యేక హోదా అంశాన్ని మళ్లీ తెరపైకి తీసుకొచ్చి, బీజేపీని ప్రజల ముందుగా దోషిగా చేస్తుండటంతో ఈ అంశాన్ని కూడా సీరియస్‌గా తీసుకున్నారు. కొత్తగా ఏ రాష్ట్రాలకూ హోదా ఇవ్వడం లేదని, ఈ అంశంలో ఏపీ సీఎం చంద్రబాబును కూడా తప్పుదోవ పట్టిస్తున్నారని బీజేపీ నాయకులు మండిపడుతున్నారు. అసెంబ్లీలోని బీజేపీ లాబీలో వీరంతా చర్చించారు. ఇక రాష్ట్రంలో మోదీని, బీజేపీని విలన్‌గా చిత్రీకరిస్తూ వేస్తున్న ఫ్లెక్సీలపై కూడా బీజేపీ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశాలన్నింటిపై అసెంబ్లీలోనే టీడీపీని నిలదీస్తామని వారు స్పష్టం చేస్తున్నారు.

కామినేని ఎటువైపు?


బీజేపీ ఎమ్మెల్యే, మంత్రి కామినేని శ్రీనివాస్ తమ సొంత పార్టీ నేతలకు దూరంగా ఉన్నారు. అసెంబ్లీ సమావేశాలలో గానీ, మీడియా పాయింట్‌లో గానీ, లాబీలో గానీ బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి కూర్చోలేదు... మాట్లాడలేదు. కొంతకాలం నుంచి ఆయన బీజేపీ కార్యక్రమాల పట్ల అంత సానుకూలంగా ఉన్న సూచనలు లేవు. దీంతో కామినేని పూర్తిగా టీడీపీ మంత్రిగానే ఉన్నారనే ప్రచారం బీజేపీ శ్రేణుల్లో జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో బీజేపీ నుంచి కాకుండా.. టీడీపీలోకి చేరి, ఆ పార్టీ నుంచి పోటీ చేస్తారనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాల్లోనూ కామినేని లేకుండానే.. మిగిలిన వారంతా ఒక జట్టుగా ముందుకెళ్లాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

సెన్సెక్స్ మార్చి 5 2018



పెరిగినవి	%	తగ్గినవి	%
సన్ ఫార్మా	2.50	టాటా మోటార్స్	-5.04
టీసీఎస్	2.21	టాటా మోటార్స్(డి)	-3.92
ఎం అండ్ ఎం	0.81	టాటా స్టీల్	-2.95
ఎస్‌బీఐ	0.48	బజాజ్ ఆటో	-2.73
కోటక్ మహీంద్రా	0.25	రిలయన్స్	-2.48

నిఫ్టీ మార్చి 5 2018



పెరిగినవి	%	తగ్గినవి	%
టెక్ మహీంద్రా	3.10	టాటా మోటార్స్	-5.04
సన్ ఫార్మా	2.46	హిందాల్కో	-4.65
టీసీఎస్	2.24	అరబిందో	-3.74
ఎం అండ్ ఎం	0.96	టాటా స్టీల్	-2.84
యు.పి.ఎల్	0.93	అంబుజా	-2.78

టాప్ లూజర్స్ 5 మార్చి

33,746.78


పాయింట్లు	బి.ఎస్.ఇ సెన్సెక్స్	%
352.15	టాటా మోటార్స్	-5.04%
655.35	టాటా స్టీల్	-2.95%
2942.50	బజాజ్ ఆటో	-2.73%
924.20	రిలయన్స్	-2.48%
305.50	కోల్ ఇండియా	-2.33%
185.50	ఓఎన్‌జీసీ	-2.14%
2182.45	డాక్టర్ రెడ్డీస్	-2.05%
314.50	యస్ బ్యాంకు	-1.95%
1300.50	హెచ్.యు.ఎల్	-1.90%
421.20	భారతీ ఎయిర్‌టెల్	-1.30%

-300.16

బులియన్ | గత 7 రోజులు




రూపాయి వర్సెస్ డాలర్



ఆరు నెలల కనిష్ఠానికి సర్వీస్ ఇండెక్స్

న్యూఢిల్లీ: భారతీయ సేవల రంగం ఫిబ్రవరిలో సంకోచించి ఆరు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయిందని అంతర్లీనంగా బలహీనంగా ఉన్న డిమాండ్ పరిస్థితులతో కొత్త పనుల ఆర్డర్లు దెబ్బతిన్నాయని నెలవారీ సర్వే ఒకటి వెల్లడించింది. సీజన్ పరంగా సర్దుబాట్లకు లోనయ్యే నికాయ్ ఇండియా సర్వీసెస్ బిజినెస్ కార్యకలాపాల సూచి జనవరిలో ఉన్న 51.7 నుంచి ఫిబ్రవరిలో 47.8కి పడిపోయింది. ఆగస్టు తర్వాత అది ఇంత కనిష్ఠ స్థాయికి దిగజారడం ఇదే మొదటిసారి. సంకోచానికి, వ్యాకోచానికి తేడా తెలిపే 50 పాయింట్ల గీటురాయి దిగువకు ఇండెక్స్ గత మూడు నెలల్లో మొదటిసారిగా పడిపోయింది. అంతర్లీనంగా పేలవంగా ఉన్న డిమాండ్ పరిస్థితులు కార్యకలాపాలు మందగించేట్లు చేశాయి. ''నవంబరు తర్వాత మొదటిసారిగా కార్యకలాపాలు, కొత్త పనులు రెండూ క్షీణించాయి. సంకోచ రేట్లు ఆగస్టు తర్వాత బలంగా కనిపించాయి. భారతదేశపు సర్వీసు రంగం ఇటీవలి కాలంలో వీక్షించిన రికవరీ దీనితో అంతమైనట్లయింది'' అని ఐ.హెచ్.ఎస్ మార్కిట్‌లో ఆర్థికవేత్త, ఈ నివేదిక రూపశిల్పి అయిన ఆష్నా దోధియా చెప్పారు. అయితే, వచ్చే 12 నెలల్లో ఉత్పత్తిలో వృద్ధి పట్ల సంస్థలు విశ్వాసంతోనే ఉన్నాయి. ఉద్యోగాలలో వృద్ధి 2011 జూన్ తర్వాత ఎక్కువ వేగాన్ని కనబరచడమే దీనికి కారణం. ''క్షీణ దశ తాత్కాలికమేనని సంస్థలు నమ్మకంతో ఉన్నట్లుంది. అవి 2011 జూన్ తర్వాత సిబ్బంది సంఖ్యలను వేగంగా పెంచుకున్నాయి. కార్యకలాపాల వృద్ధిలో సానుకూల అంచనాలకు అది అనుగుణంగా ఉంది'' అని దోధియా చెప్పారు. డిమాండ్ పరిస్థితులు అనుకూలంగా లేనప్పటికీ, సర్వీసులు సమకూర్చే సంస్థలు ఫిబ్రవరిలో తమ సిబ్బంది స్థాయిలను పెంచుకున్నాయి. పైగా, ఉద్యోగాల సృష్టి 2011 జూన్ తర్వాత వేగంగా ఉంది. సంయుక్తంగా పటిష్ఠంగా ఉంది. కాగా, వస్తూత్పత్తి, సేవల పరిశ్రమలు రెండింటినీ మేళవించుకున్న నికాయ్ ఇండియా కాంపొజిట్ పి.ఎం.ఐ ఉత్పత్తి సూచి కూడా జనవరిలో ఉన్న52.5 నుంచి ఫిబ్రవరిలో 49.7కి పడిపోయింది. సేవల రంగంలో కార్యకలాపాలు మందగించినా, వస్తూత్పత్తి ఎగువ ధోరణిలో ఉండడం తూనికలో కొంత సమతూకాన్ని తెచ్చింది. ధరల విషయానికి వస్తే, ఉత్పాదక సామగ్రి వ్యయ ద్రవ్యోల్బణం నవంబరు తర్వాత పటిష్ఠమైన రీతిలో వేగం పుంజుకుంది. వివిధ వస్తువుల ధరలు జూలై తర్వాత తిరిగి అత్యధిక స్థాయిలను చూశాయి. ''సంస్థల మార్జిన్లకు ఉన్న మరో అనివార్య ముప్పు ఇంధన ధరలు పెరగడం. అవి మొత్తంమీద, ఆర్థిక వ్యవస్థ (వస్తూత్పత్తి, సర్వీసులు)లో ఉత్పాదక సామగ్రి వ్యయ ద్రవ్యోల్బణం 2014 జూలై తర్వాత తిరిగి వేగవంతమయ్యేట్లు చేశాయి'' అని దోధియా చెప్పారు.

ఇండియా సర్వీసెస్ పి.ఎం.ఐ



ఆధారం: నికాయ్, మార్కిట్

పిపావ్‌కు ఆర్‌ఇన్‌ఫ్రా నోటీసు

న్యూఢిల్లీ: కొనుగోలు ఒప్పందం కింద వారంటీల ఉల్లంఘనకు పాల్పడినందుకు రూ. 5,440.38 కోట్లను క్లెమ్ చేస్తూ రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఆర్‌ఇన్‌ఫ్రా) తన అనుబంధ సంస్థ రిలయన్స్ డిఫెన్స్ సిస్టమ్స్ (ఆర్డీఎస్పీఎల్)తో కలసి పిపావ్ డిఫెన్స్ అండ్ ఇంజనీరింగ్ సంస్థ స్థాపక ప్రమోటర్లకు మధ్యవర్తిత్వ నోటీసు జారీ చేసింది. పిపావ్ డిఫెన్స్ అండ్ ఇంజనీరింగ్ షేర్ల స్వాధీనానికి సంబంధించి ఆర్‌ఇన్‌ఫ్రా, దాని అనుబంధ సంస్థ ఆర్డీఎస్పీఎల్ 2015 మార్చి 4న ఒక ఒప్పందానికి వచ్చాయి. పిపావ్ డిఫెన్స్ అండ్ ఇంజనీరింగ్ సంస్థని ఇప్పుడు రిలయన్స్ నేవల్ అండ్ ఇంజనీరింగ్ లిమిటెడ్ (ఆర్ఎన్ఈఎల్)గా పిలుస్తున్నారు. నిఖిల్ గాంధీ, భవేశ్ గాంధీ వారి కంపెనీలైన ఎస్.కె.ఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, గ్రెవెక్ ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్.కె.ఎల్ షిప్‌యార్డ్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లకు మధ్యవర్తిత్వ నోటీసులు జారీ చేసినట్లు ఆర్‌ఇన్‌ఫ్రా తెలిపింది. పిపావ్ డిఫెన్స్ అండ్ ఆఫ్‌షోర్ ఇంజనీరింగ్‌లో నియంత్రణను చేజిక్కించుకునే వాటాను రూ. 2,082.3 కోట్లు పెట్టి కైవసం చేసుకుంటున్నట్లు అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 2015 మార్చిలో ప్రకటించింది.

అశోక్ లేలాండ్‌లో తగ్గిన ఎల్.ఐ.సి. వాటా

న్యూఢిల్లీ: హిందూజా గ్రూప్ ప్రధాన కంపెనీ అశోక్ లేలాండ్‌లో జీవిత బీమా సంస్థ (ఎల్.ఐ.సి) తన వాటా 2.04 శాతం తగ్గించుకుంది. అది 5.97 కోట్ల షేర్లను ఓపెన్ మార్కెట్‌లో విక్రయించింది. అశోక్ లేలాండ్‌లో ఇంతకుముందు ఎల్.ఐ.సికి 5.16 శతతం వాటా ఉండేది. దాన్ని ఇప్పుడు 3.11 శాతానికి తగ్గించుకుంది. అశోక్ లేలాండ్ షేర్లను ఎల్.ఐ.సి 2015 అక్టోబరు 16 నుంచి 2018 మార్చి 1 మధ్య కాలంలో విక్రయించింది. అశోక్ లేలాండ్ 2018 ఫిబ్రవరిలో మొత్తం 18,181 యూనిట్లను విక్రయించి మొత్తం అమ్మకాల్లో 29 శాతం పెరుగుదల నమోదు చేసినట్లు గత వారం వెల్లడించింది. అది 2017 ఫిబ్రవరిలో 14,067 యూనిట్లను విక్రయించింది. అశోక్ లేలాండ్ షేర్ ధర బి.ఎస్.ఇలో రూ. 139.95 వద్ద కోట్ అవుతోంది.

చతికిలపడిన స్టాక్ మార్కెట్లు



300 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

• 10,400 దిగువకు నిఫ్టీ

ముంబయి: భారతీయ ఈక్విటీలు వరుసగా నాల్గవ సెషన్‌లోనూ పతనాన్ని కొనసాగించడంతో బి.ఎస్.ఇ సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా పతనమవగా, ఎన్.ఎస్.ఇ నిఫ్టీ దాదాపు 100 పాయింట్లు కోల్పోయింది. ప్రపంచ వాణిజ్య యుద్ధ భయాలు మదుపరులను వణికించాయని చెప్పాలి. దేశీయ స్టాక్ మార్కెట్లకు గీటురాయిగా భావించే సెన్సెక్స్ రెండు వారాల కనిష్ఠ స్థాయి 33,747కు పతనమైంది. ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై కఠిన టారిఫ్‌లు విధించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేస్తున్న పథకాలు చూపగల ప్రభావాన్ని మదుపరులు బేరీజు వేయడంతో లోహ రంగ కంపెనీల షేర్ల ధరలు ఎక్కువ పతనమయ్యాయి. అమెరికా సుంకాల పథకం నుంచి రేకెత్తిన ఒత్తిడికి ఆసియాలోని ఇతర మార్కెట్లు కూడా చతికిలపడ్డాయి. భారతదేశపు సేవల రంగంలో వృద్ధి ఫిబ్రవరిలో కుంచించుకుపోయి, ఆరు నెలల కనిష్ఠానికి పడిపోయిందని నెలవారీ సర్వే ఒకటి వెల్లడించడం కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను నీరుగార్చింది. సోమవారం, తక్కువ స్థాయిలోనే మొదలైన సెన్సెక్స్ ఇంట్రా-డే ట్రేడ్‌లో 33,653.41 పాయింట్ల కనిష్ఠ స్థితిని చూసింది. డాలరుతో రూపాయి మారకం విలువ కొద్దిగా పెరగడంతో చివరలో కోలుకునేందుకు మార్కెట్లు స్వల్పంగా ప్రయత్నించాయికానీ, అంతగా ఫలితం లేకపోయింది. దానితో సెన్సెక్స్ 33,746.78 పాయింట్ల వద్ద ముగిసింది. గత మూడు సెషన్లలో సెన్సెక్స్ 398.81 పాయింట్లను కోల్పోయింది. ఫిబ్రవరి 20 తర్వాత సెన్సెక్స్ ఇంత తక్కువ స్థాయిలో ముగియడం ఇదే మొదటిసారి. అది ఫిబ్రవరి 20న 33,703.59 పాయింట్ల వద్ద ముగిసింది. యాభై కంపెనీల షేర్ల ధరల్లో హెచ్చు తగ్గులను ప్రతిబింబించే నిఫ్టీ కూడా 10,400 దిగువ స్థాయికి పతనమైంది. అది 10,358.85 పాయింట్ల వద్ద ముగిసింది.



ఊతమివ్వని ఎన్నికల ఫలితాలు

మూడు ఈశాన్య రాష్ట్రాలలో ఎన్నికల్లో బి.జె.పి గణనీయమైన ఫలితాలు సాధించినప్పటికీ, ఆ సానుకూలత ఏదీ భారతీయ ఈక్విటీల పతనాన్ని నిరోధించలేకపోయింది. విదేశీ మదుపు సంస్థలు ఫిబ్రవరిలో ముమ్మరంగా అమ్మకాలకు పాల్పడి నిధులు వెనక్కి తీసుకోవడం, బ్యాంకింగ్ రంగంలో కొనసాగుతున్న సంక్షోభం మదుపరులను ఇప్పటికీ కలవరపెడుతూనే ఉన్నాయి.

అరబిందో ఫార్మాకు అమెరికా షాక్

హైదరాబాద్‌లో ఉన్న అరబిందో ఫార్మా యూనిట్ ఫోర్‌పై అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ కొన్ని వ్యాఖ్యలు చేసిందని, సదరు నివేదిక కంపెనీకి అందిందని వార్తలు రావడంతో అరబిందో ఫార్మా షేర్లు సోమవారం 3.73 శాతం తగ్గాయి. మందుల తయారీలో నాణ్యతా ప్రమాణాలలో తీవ్ర లొసుగులను ఎత్తిచూపుతూ అమెరికా నియంత్రణ సంస్థ 9 వ్యాఖ్యలతో ఫామ్ 483 జారీ చేసిందని చెబుతున్నారు.

అమ్మకాల్లో 35 లక్షల యూనిట్ల
మైలురాయి దాటిన ఆల్టో



న్యూఢిల్లీ: దేశంలోని అతి పెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి ఇండియా అత్యధికంగా అమ్ముడుపోయే ఆల్టో కారు 35 లక్షల సమష్టి అమ్మకాల మైలురాయిని దాటినట్లు సోమవారం వెల్లడించింది. బ్రాండ్ ఆల్టో 2017-18లో 6 శాతం వృద్ధి రేటు నమోదు చేసిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తాము మార్కెట్‌లో 33 శాతం వాటా సమీకరించుకున్నామని మారుతి ఒక ప్రకటనలో తెలిపింది. దేశీయ మార్కెట్‌లో గత 14 ఏళ్ళుగా అత్యధికంగా అమ్ముడుపోతున్న కారుగా ఆల్టో అగ్ర స్థానంలో నిలుస్తోంది. ''దాదాపు 55 శాతం మంది కస్టమర్లు 2017-18లో తమ మొదటి కారు కొనుగోలుకు ఆల్టోనే ఎంచుకున్నారు. ఆల్టో కొనుగోలుదార్లలో 25 శాతం మంది ఆసక్తిక రంగా, అదనపు కారుగా కూడా ఆల్టోనే కొనుగోలు చేస్తున్నారు'' అని మారుతి సుజుకి ఇండియా (మార్కెటింగ్-అమ్మకాల) సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.ఎస్. కల్సీ చెప్పారు. ఆల్టో 2006 నుంచి ప్రతి రెండేళ్ళకు 5 లక్షల మంది కొత్త కస్టమర్లను జోడించుకుంటూ వస్తోందని ఆయన చెప్పారు. ఆల్టో అమ్మకాల్లో దాదాపు 44 శాతం 35 ఏళ్ళ లోపు యువ కస్టమర్ల వర్గం నుంచే ఉంది. ఈ వర్గం నుంచి కొనుగోళ్ళు గత మూడేళ్ళలో 4 శాతం వృద్ధి చెందాయని కంపెనీ తెలిపింది. ఆల్టో 2008లో 10 లక్షల యూనిట్లు, 2010లో 15 లక్షల యూనిట్లు అమ్ముడుపోయింది.

ఆదిత్య మిత్తల్ చేతికి
ఆర్సిలార్ పగ్గాలు



న్యూఢిల్లీ: ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచ దిగ్గజం ఆర్సిలార్‌మిత్తల్ కంపెనీ అధ్యక్షుడుగా ఆదిత్య మిత్తల్ నియమితులయ్యారు. ఆర్సిలార్‌మిత్తల్ యూరప్‌కి ప్రస్తుతం సి.ఎఫ్.ఓగా, సి.ఇ.ఓగా ఉన్న ఆదిత్య మిత్తల్ ఆ బాధ్యతలకు తోడుగా కంపెనీ అధ్యక్షుడుగా కూడా వ్యవహరిస్తారని లగ్జెంబర్గ్ కేంద్రంగా ఉన్న ఆ కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. చైర్మన్, సి.ఇ.ఓ లక్ష్మీమిత్తల్‌కు చేయూతగా నిలుస్తూ, గ్రూప్ మొత్తంలో ఆదిత్యకు పెరుగుతున్న ప్రపంచ వ్యూహాత్మక పాత్రను ఈ నియామకం ప్రతిబింబిస్తోందని కంపెనీ పేర్కొంది. ''గ్రూప్ సి.ఎఫ్.ఓగా, మా ఐరోపా కార్యకలాపాల సి.ఇ.ఓగా ప్రభావశీలమైన, కార్యసాధకుడైన మేనేజర్‌గా ఆదిత్య తనను తాను రుజువు చేసుకున్నారు. ఫలితాలు చూపుతున్నారు. కంపెనీకి విలువను సృష్టించిపెడుతున్నారు. గ్రూప్ భవిష్యత్ వ్యూహాత్మక దిశను తీర్చిదిద్దడంలో ఆయన నాతో కలసి పనిచేస్తారు'' అని లక్ష్మీ మిత్తల్ పేర్కొన్నారు. కంపెనీ చైర్మన్, సి.ఇ.ఓకు విషయాలు నివేదించడాన్ని ఆదిత్య కొనసాగిస్తారని కంపెనీ పేర్కొంది. ఆర్సిలార్‌మిత్తల్ 60 దేశాలలో ఉనికితో , 18 దేశాల్లో పారిశ్రామిక అడుగుజాడతో ప్రపంచంలోనే అతి పెద్ద ఉక్కు ఉత్పత్తి, గనుల తవ్వక కంపెనీగా ఉంది. ఆటోమోటివ్, నిర్మాణం, గృహోపయోగ ఉపకరణాలు, ప్యాకేజింగ్‌తో సహా ప్రధానంగా ప్రపంచ ఉక్కు మార్కెట్లకు మేలిమి ఉక్కు సరఫరా చేసే అగ్ర సంస్థగా కొనసాగుతోంది.


రెండు బ్యాంకులకు జరిమానా

ముంబయి: నిరర్థక ఆస్తుల (ఎన్.పి.ఎ) వర్గీకరణ నిబంధనలను ఉల్లంఘించినందుకు యాక్సిస్ బ్యాంక్‌పై 3 కోట్ల రూపాయల, మీ కస్టమరు గురించి తెలుసుకోండి(కె.వై.సి) నిబంధనలు పాటించనందుకు ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్‌పైన 2 కోట్ల రూపాయల జరిమానా విధించినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్.బి.ఐ) సోమవారం వెల్లడించింది. చట్టబద్ధమైన తనిఖీ కింద 2016 మార్చి 31 నాటికి ప్రైవేటు రంగ యాక్సిస్ బ్యాంక్ ఆర్థిక స్థితిగతులు ఎలా ఉన్నదీ పరిశీలించినట్లు ఆర్.బి.ఐ తెలిపింది. ఈ పరిశీలనలో ''ఎన్.పి.ఎల మదింపునకు సంబంధించి ఆర్.బి.ఐ జారీ చేసిన వివిధ నియమాలు ఉల్లంఘనకు గురైనట్లు'' తేలిందని కేంద్ర బ్యాంక్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆదాయ గుర్తింపు, ఆస్తి వర్గీకరణ (ఐ.ఆర్.ఎ.సి) నిబంధనలపై ఆర్.బి.ఐ జారీ చేసిన సూచనలను యాక్సిస్ బ్యాంక్ పాటించలేదని వెల్లడైంది. దానితో ఆర్.బి.ఐ 2018 ఫిబ్రవరి 27న యాక్సిస్ బ్యాంకుపై రూ. 3 కోట్ల జరిమానా విధించింది. ఇక ప్రభుత్వ రంగ ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ శాఖల్లో ఒక దానిలో చోటుచేసుకున్న ''మోసాన్ని కనిపెట్టినట్లు'' కేంద్ర బ్యాంక్ మరో ప్రకటనలో తెలిపింది. ఐ.ఓ.బి అంతర్గత తనిఖీ నివేదికతో సహా, బ్యాంకునకు చెందిన వివిధ డాక్యుమెంట్లను పరిశీలించిన మీదట కె.వై.సి నిబంధనలకు సంబంధించి ఆర్.బి.ఐ జారీ చేసిన ఆదేశాలను అది పాటించలేదని తేలింది. దాంతో ఐ.ఓ.బిపై ఆర్.బి.ఐ రూ. 2 కోట్ల జరిమానా విధించింది. నియంత్రణ నిబంధనలను పాటించడంలో లోపాల ఆధారంగా ఆ రెండు బ్యాంకులకు జరిమానా విధిస్తున్నామని, అంతమాత్రాన ఇవి, ఆయా బ్యాంకులు జరిపిన లావాదేవీలకుగానీ, కస్టమర్లతో కుదుర్చుకున్న ఒప్పందాలకుగానీ యోగ్యత చేకూరుస్తున్నట్లు కాదని ఆర్.బి.ఐ స్పష్టం చేసింది.

ఎన్.బి.సి.సి.కి రూ. 192 కోట్ల ఆర్డరు

న్యూఢిల్లీ: గురుగ్రామ్‌లో ఒక టౌన్‌షిప్‌ను నిర్మించి, అభివృద్ధి చేసేందుకు గ్రామీణ విద్యుదీకరణ సంస్థ (ఆర్.ఇ.సి) నుంచి రూ. 192 కోట్ల ఆర్డరు పొందినట్లు ప్రభుత్వ యాజమాన్యంలోని భవన నిర్మాణ సంస్థ ఎన్.బి.సి.సి సోమవారం వెల్లడించింది. గురుగ్రామ్‌లోని సెక్టార్-57లో ఈ టౌన్‌షిప్ నిర్మిస్తారు. ఎన్.బి.సి.సి 7 శాతం రేటు చొప్పున ఫీజులు తీసుకుని ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా వ్యవహరిస్తుంది.


సామాజిక బాధ్యతలో మెరుగుదల



ముంబయి: భారతదేశంలో కంపెనీలు సామాజిక బాధ్యత (సి.ఎస్.ఆర్) నిర్వహించడంలో ముందంజ వేస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 100 కంపెనీల సమష్టి సి.ఎస్.ఆర్ వ్యయం రూ. 7,215.9 కోట్లకు పెరిగినట్లు కన్సల్టింగ్ సంస్థ కె.పి.ఎం.జి సర్వే వెల్లడించింది. గత మూడేళ్ళలో ఇది 41 శాతం పెరిగినట్లు కూడా సర్వేలో తేలింది. 2014-15 సంవత్సరంలో 10 కంపెనీలు సి.ఎస్.ఆర్ బడ్జెట్‌కు ఎక్కువ నిధులు కేటాయిస్తే 2017-18లో అటువంటి కంపెనీల సంఖ్య 22కు పైగా ఉందని సర్వే తెలిపింది. నిర్దేశిత 2 శాతం కన్నా తక్కువగా సి.ఎస్.ఆర్‌కి నిధులు వెచ్చించిన కంపెనీల సంఖ్య కూడా గణనీయంగా 29 శాతానికి తగ్గింది. అలాగే, 2014-15లో 32 కంపెనీలు 2 శాతం లేదా అంతకుమించిన మొత్తాన్ని వెచ్చించగా 2017-18లో అటువంటి కంపెనీల సంఖ్య 58కి పెరిగింది. 2017-18లో సి.ఎస్.ఆర్ ప్రాజెక్టులపై నేరుగా వెచ్చించిన మొతాన్ని లేదా నిర్దేశించిన దానికన్నా అదనంగా వెచ్చించిన మొత్తాన్ని 36 కంపెనీలు మాత్రమే వెల్లడించాయని కె.పి.ఎం.జి సర్వే తెలిపింది. 100 కంపెనీలలో 2 కంపెనీలకు పబ్లిక్ డొమైన్‌లో సి.ఎస్.ఆర్ విధానం లేదని, ఆ వివరాలు అందుబాటులో ఉంచడంలో అవి వరుసగా మూడవ ఏడాదిలోనూ విఫలమయ్యాయని సర్వే పేర్కొంది. మూడు కంపెనీలు సి.ఎస్.ఆర్ కింద ఏ విభాగంలో సేవలందిస్తున్నదీ తెలుపలేదు. సి.ఎస్.ఆర్ కార్యక్రమాలు, ప్రాజెక్టులకు కేటాయించుకున్న బడ్జెట్లలో మిగిలిపోయిన మొత్తాలను ఏం చేస్తున్నదీ సర్వేలో పాల్గొన్నవాటిలో 30 శాతం పైగా కంపెనీలు వెల్లడించలేదు. అవి వాటిని గోప్యంగా ఉంచడాన్ని ''కలవరపరచే'' అంశంగా నివేదిక పేర్కొంది. అయితే, ఆశావహమైన అంశం కూడా ఒకటుందని సర్వే పేర్కొంది. సి.ఎస్.ఆర్ పాలనకు సంబంధించిన వ్యవస్థ వివరాలను తమ సి.ఎస్.ఆర్ విధానంలో 92 కంపెనీలు వెల్లడించాయి. సామాజిక బాధ్యత కింద ఏ విధంగా నిధులు వెచ్చిస్తున్నదీ వివరాలు తెలిపిన కంపెనీల సంఖ్య 2014-15లో 75గా మాత్రమే ఉంది. అలాగే, 94 కంపెనీలు తమ సి.ఎస్.ఆర్ కార్యక్రమాల వెనుకనున్న దార్శనికత, లక్ష్యం, తాత్త్వికతల వివరాలు వెల్లడించాయి. రాష్ట్రాలలో మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, తమిళ నాడు, కర్ణాటక, ఒడిశాలలో సి.ఎస్.ఆర్ ప్రాజెక్టులు అత్యధికంగా 629 ఉన్నాయి. మణిపూర్, త్రిపుర, చండీగఢ్, దామన్ అండ్ దియు, దాద్రా అండ్ నగర్ హవేలీలు ఉపేక్షకు గురవుతున్నాయి. అక్కడ 10 ప్రాజెక్టులకన్నా తక్కువే అమలయ్యాయి.



జెస్ట్ స్పెషల్ ఎడిషన్



ముంబయి: కాంపాక్ట్ సెడాన్ జెస్ట్ స్పెషల్ ఎడిషన్‌ను మార్కెట్లోకి ప్రవేశపెడుతున్నట్లు టాటా మోటార్స్ సోమవారం ప్రకటించింది. ఇది 1.3 లీటర్ల డీజిల్ ఇంజన్, 13 అదనపు అంశాలతో రూ. 7.53 లక్షలకు (ఎక్స్-షోరూమ్ ఢిల్లీ) లభిస్తుందని కంపెనీ పేర్కొంది. మార్చి 1న మార్కెట్లోకొచ్చిన జెస్ట్ ప్రీమియో దేశంలోని అన్ని టాటా మోటార్స్ అమ్మకాల కేంద్రాలలోనూ అందుబాటులో ఉన్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. 2014 ఆగస్టులో మొదలైన జెస్ట్ కారు ఇంతవరకు 85,000 యూనిట్లు అమ్ముడుపోయినట్లు ఆ ప్రకటన తెలిపింది. కొత్త విలువను సంతరించుకున్న జెస్ట్ స్పెషల్ ఎడిషన్ కస్టమర్లను ఆకర్షించగలదన్న నమ్మకం ఉందని టాటా మోటార్స్ పాసింజర్ వాహన విభాగ అధ్యక్షుడు మయంక్ పరీక్ చెప్పారు. దేశంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో టాటా మోటార్స్ 58,993 యూనిట్లు విక్రయించింది. దేశీయ అమ్మకాల్లో 38 శాతం పెరుగుదల సాధించింది. వాణిజ్య, పాసింజర్ వాహనాల విభాగాలు రెండూ పటిష్ఠమైన అమ్మకాలను కొనసాగిస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో 17,771 పాసింజర్ వాహనాలు అమ్ముడైనట్లు కంపెనీ వెల్లడించింది. ఈ సంఖ్య 2017 ఫిబ్రవరిలో 12,272గా ఉంది.

మనం
www.manamnews.com
మందిరం
మంగళవారం, 6 మార్చి 2018

నివాళి



పుట్టినవారు మరణించక తప్పదు. మరణించిన వారు తిరిగి జన్మించక తప్పదు. జన్మించని వారు మరణించడం సాధ్యం కాదు. అలే మరణించనివారు తిరిగి జన్మించేందుకూ వీలు లేదు. ఒకరు జన్మించారు అంటే అంతకుముందు మరణించి ఉండాలి. ఇదే భగవద్గీత మనకు చెబుతోంది. వేదాలలోని ఉపదేశం కూడా ఇదే.

జన్మ... పునర్జన్మ

మరణించినవారే మళ్లీ జన్మిస్తున్నారు అని చెప్పడానికి గుర్తేమిటంటే మనిషి మరణించేముందు అనేక విధాలుగా దుఃఖిస్తూ మరణిస్తాడు. అతని చుట్టూ ఉన్నవారు కూడా దుఃఖిస్తూ ఉంటారు. ఆ ఆలోచనలు, జ్ఞాపకాలు అతని మనసులో ముద్ర పడతాయి.

తరువాత మళ్లీ పునర్జన్మ తీసుకుంటాడు. ఒక పసిపాపలా జన్మిస్తాడు. అక్కడ జన్మించినప్పుడు ఆ పాప ఏడ్వవలసి ఉంది. అప్పుడు మనందరం ఆనందంగా నవ్వుతాం. అలా ఆ పసివాడు ఏడవకుండా జన్మిస్తే మనందరం ఏడవవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇలా జన్మించినప్పుడు కానీ మరణించినప్పుడు కానీ దుఃఖించవలసిన పరిస్థితి ఏర్పడుతూనే ఉంటుంది. మరణించినప్పుడు దుఃఖించవలసిన సంస్కారాలు, ఆలోచనల వల్ల మరుజన్మలో దుఃఖిస్తూనే జన్మించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇది పునర్జన్మ సిద్ధాంతానికి ఒక ఉదాహరణ. ఏ ప్రాణిగా జీవించినా తిరిగి జన్మించకుండా ఉండేందుకు వీలుకాదు. ముందు జన్మకి, ఇప్పటి జన్మకి మధ్య ఒక సంబంధం ఉంటుంది.

అందువల్లనే సహజంగా మరణించినా, ప్రమాదాల వల్ల మరణించినా ఏ విధమైన మరణం సంభవించినా పునర్జన్మ తప్పక ఉంటుంది. కర్మకు ఫలితం తప్పనిసరిగా ఉంటుంది.

మరణించిన ప్రతివారూ తమ కర్మవిశేషానికి అనుగుణంగా వేరే లోకానికి వెళతారు. అక్కడ అనుభవించవలసిన పుణ్య లేదా పాపఫలాన్ని అనుభవించిన తరువాత మళ్లీ జన్మ తీసుకుంటారు. ఈ పాపపుణ్య విచారణ మన కర్మపై ఆధారపడి ఉంటుంది. పుణ్యలోకాలను సాధించాలంటే దైవానుగ్రహం కావాలి. ఆత్మను శోధించి దైవాన్ని తెలుసుకోవాలి. దైవం

గేయం గీతానామ సహస్రం ధ్యేయం
శ్రీపతి రూపమజస్రమ్
నేయం సజ్జన సంగే చిత్తం దేయం
దీనజనాయ చవిత్తమ్

మనలోనే కొలువున్నాడని తెలుసుకున్న నాడు మన అడుగులు పుణ్యకార్యాలవైపు పడతాయి.

ప్రారబ్ధ, సంచిత, ఆగామి కర్మలు ఏవీలేని మహాత్ములకు, జ్ఞానులకు, యతులకు మాత్రమే పునర్జన్మ ఉండదు. మిగిలినవారందరూ మళ్లీ ఏదో ఒక జన్మ తీసుకోక తప్పదు. ప్రారబ్ధ, సంచిత కర్మలను నిశ్శేషం చేసుకోవడానికి కొందరు ఉపవాస దీక్షలు చేస్తారు. మరికొందరు పుణ్యనదుల్లో స్నానం చేస్తారు. యోగమార్గం అవలంబిస్తారు. ఏ మార్గంలో పయనించినా జ్ఞానం పొందడం ప్రధానం.

మానవ జన్మకు సార్థకత ఎప్పుడు లభిస్తుందంటే, 'పరోపకారార్థ మిదం శరీరం' అనే ఆచార్యసూక్తిని అర్థం చేసుకున్నప్పుడు. ఇతరులకు సహాయం అందించడం అంటే తనకు తానే సాయం చేసుకోవడమని మా పరమాచార్యులు శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి చెప్పేవారు. ఇతరులకు సాయం చేయడంలో మనం పడే ఇబ్బందులతో పోలిస్తే పొందే సంతృప్తి గొప్పదనేవారాయన. మానవుడై పుట్టిన ప్రతివాడూ ఇతరులకు చేయూతనందించడంలో ఆనందాన్ని వెతుక్కోవాలి.

(కంచి కామకోటి పీఠ 69వ జగద్గురువులు శ్రీజయేంద్ర సరస్వతీ మహాస్వామి ప్రవచనాల నుంచి. వచ్చే మంగళవారం కంచిపీఠంలో పూజ్యస్వామి ఆరాధన జరగనుంది.)

క్రీస్తు సందేశం

ఆయనే దైవం



ప్రభువు ఒక ఇంటిలో ప్రజలకుబోధిస్తుండగా అనేకమంది చుట్టుముట్టారు. కొందరు ఒక పక్షవాత రోగిని మోసికొని వచ్చారు. ఇంటిలోనికి ప్రవేశించడానికి దారిలేకపోవడంతో ఇంటి కప్పు విప్పి, పైనుంచి ప్రభువు సమీపాన దింపారు. నీ పాపాలు క్షమించానని ప్రభువు వానితో పలికాడు.పాపాలు క్షమించడానికి వీడు భగవంతుడా? అని కొందరు సణగడం వినిపించింది. అప్పుడు ప్రభువు,పాపాన్ని క్షమించే అధికారం, శక్తి మనుష్య కుమారునికి ఉన్నాయి. చూడండి అంటూ పక్షవాత రోగితో, 'నీ పడక నెత్తుకొని పొమ్మ'ని పలికాడు. ఆతడు వెంటనే తన మంచమెత్తుకొని పోయాడు. జనులు ప్రభువును కీర్తించారు.

యూదయలో నానా వేదనలచే కృశించే వారిని ప్రభువు బాగుచేశాడు. అనేక దయ్యాలను వెళ్లగొట్టాడు. పేతురు అత్త జ్వరంతో బాధపడుతూ ఉంటే ఏసు ఆమెకు బాగుచేశాడు. ఆమె ప్రభువుకు ఆతిధ్యమిచ్చింది.ప్రభువు కుష్టరోగులను స్పృశించి బాగుచేశాడు. ఆయన కాలి ధూళి సోకి పాపపు కొండలు కరిగాయి. యేసు పండ్రెండుగురిని శిష్యులుగా చేసికొని వారికి అపొస్తలులని పేరు పెట్టాడు. వారు ఆయనతో నుండి సువార్త చాటించారు1.

బైబిల్ లో ఎక్కడా నేనే దేవుడను అని ఏసు కచ్చితంగా చెప్పలేదు. యోహాను 1:1 ప్రకారంవాక్యము దేవుడై యుండెను. యోహాను 1:14 ప్రకారం ఆ వాక్యము శరీర ధారియై యుండెను. ఇది శరీరంలో ఏసు దేవుడైయున్నాడని సూచిస్తుంది. అపొస్తలు 20:28 ప్రకారం ఏసే దేవుడు.ఏసు గురించి శిష్యుడు, నా ప్రభువా నా దేవా అన్నప్పుడు ప్రభువు అతనిని సరిచేయలేదు. ఆయనే దైవం కనుకనే సర్వలోక పాపములను తీసుకునిమరణించి- పాపం, మరణాలను జయించి పునరుత్థానమయ్యాడు.

ధర్మసందేహం

తెల్లవారి నిద్రలేవగానే ఏం చూస్తే మంచిది?



నిద్రలేవ గానే శుభప్రద మైన వాటిని చూస్తే ఆ రోజంతా బాగుంటుందని మనవారి విశ్వాసం. ఉల్లాసంగా రోజు మొదలైతే రోజంతా ఆ ఉల్లాసం కొనసాగు తుంది. 'శ్రోత్రియం శుభదం గాంచ అగ్నిమగ్నిశితం తథా ప్రాతరుత్థాయ పశ్యేత్' - వేదం చెప్పిన మార్గంలో నడుచుకునే శ్రోత్రియుని, అదృష్టవంతుని, అగ్నిని, అగ్నిని ప్రార్థిస్తున్న వారిని ఉదయవేళ నిద్రలేచిన వెంటనే చూస్తే శుభం కలుగుతుందంటారు. నిద్రలేచిన వెంటనే తులసిని చూసినట్లైతే జగత్తులోని సర్వతీర్థాలనూ సేవించిన పుణ్యం లభిస్తుంది.

కరాగ్రే వసతే లక్ష్మికరమూలే సరస్వతి
కరమూలే స్థితా గౌరి ప్రభాతే కరదర్శనం

మన అరచేతిలోనే సమస్త దేవతలూ కొలువై ఉన్నారు. అందుకే ఉదయవేళ, దీపాలవేళ కూడా అరచేతిని దర్శిస్తే మంచిది.

– సమాధానం : డా. కాకునూరి సూర్యనారాయణమూర్తి

మారేడుదళం

యుగళావతారం


శ్రీమహావిష్ణు అవతారాలలో ప్రతి అవతారాన్ని విడివిడిగా ధ్యానిస్తారు. రెండు అవతారాలను కలిపి పూజించే సందర్భం వరాహ నరసింహస్వామి రూపంలో కనిపిస్తుంది. వరాహస్వామి శాకాహారి, శాంతుడు. తమోగుణం కలిగిన హిరణ్యాక్షుని వధించడానికి ఆవిర్భవించినవాడు. నృసింహస్వామి సాత్విక, రాజస సాధనాపద్ధతుల్లో భక్తులకు సులభసాధ్యుడు. నృసింహుడు లక్ష్మీసంయుతుడైనప్పుడు సాత్వికుడు. అయితే వరాహనృసింహుడు అంకపీఠంపై లక్ష్మి లేకుండా పరమ శాంతమూర్తి. వరాహస్వామిని, నృసింహస్వామిని ధ్యానించిన మిశ్రమ ఫలితాలు పొందాలంటే వరాహనృసింహస్వామిని ఆశ్రయించాలి. దశావతారాలలో ఈ అవతారం లేదు. హిరణ్యకశిపుణ్ణి సంహరించిన తరువాత ప్రహ్లాదుని కోరికమేరకు స్వామి ఈ జమిలి రూపాన్ని ప్రదర్శించినట్లు పురాణగాథ. తెలుగునాట సుప్రసిద్ధ సింహాచల క్షేత్రం వరాహనృసింహస్వామిది. దక్షిణసింహాచలంగా పేరున్న శింగరకొండ కూడా వరాహనృసింహునిదే. అహోబిలం, కశింకోట, అనకాపల్లి, రాజమండ్రి, లక్ష్మీపురం వంటిచోట్ల వరాహనృసింహ స్వామి ఆలయాలున్నాయి. వాటి పరిచయాలు, వరాహనృసింహస్వామి తత్త్వాలతో పాటుగా ప్రాచీనకాలంనాటి వరాహస్వామి శిల్పాలకు సంబంధించిన అరుదైన ఫోటోలతో అరిశెట్టి సాయిప్రసాద్ రూపొందించిన గ్రంథం శ్రీవరాహనరసింహస్వామి అవతారం. నృసింహభక్తులకు ఇది మంచికానుక.



శ్రీవరాహనరసింహస్వామి అవతారం
రచన : అరిశెట్టి సాయిప్రసాద్,
ప్రచురణ : అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం, గుంటూరు, పేజీలు : 51, వెల : రూ. 40, ప్రతులకు : శ్రీఅన్నమయ్య సేవాసమితి, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, 5వ వీధి, బృందావన్ గార్డెన్స్, గుంటూరు – 6
ఫోన్ నెం: 7396100173

దైవవాణి

దివ్య ఔషధం



మనం ఆరోగ్యంగా ఉంటేనే ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించగలం. ఆరోగ్యం పట్ల ఉపేక్ష తగదని, ఆరోగ్యంగా ఉన్నవారే ఇతరుల శ్రేయస్సుకు కూడా కృషి చేయగలరని దివ్య ఖురాన్ చెబుతోంది. చెదపురుగులు ఉద్గ్రంథాలను సైతం పాడు చేసినట్లు ఆరోగ్యం పట్ల మనం చూపే నిర్లక్ష్యం మన జీవితాన్ని నాశనం చేస్తుంది. అందుకే ఆరోగ్య పరిరక్షణలో ఏ మాత్రం అలసత్వం చూపకూడదని అంతిమ మహాప్రవక్త (స) బోధించారు.

మానవుడు తన జీవితకాలంలో ఎన్నో పనులు చక్కబెట్టాలి. అలాగే ఎన్నో బాధ్యతలు నెరవేర్చాలి. ఇవన్నీ సక్రమంగా, సజావుగా నిర్వర్తించాలంటే శరీరంలో సత్తువ ఉండాలి. బుద్ధి వివేకాల్లో బలం ఉండాలి. సంకల్పంలో స్థిరత్వం ఉండాలి. ఆశయాల్లో ఔన్నత్యం ఉండాలి. అందుకే ప్రవక్త, 'నైతిక రుగ్మతలు, మనసులోని సమస్యలు మీ జీర్ణాశయాన్ని తలకిందులు చేస్తాయి' అన్నారు.

మరో సందర్భంలో, 'నిరాడంబరంగా ఉండండి. మధ్యేమార్గాన్ని అవలంబించండి. ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూ, నిత్యం సంతోషంగా, ఉల్లాసంగా మెలగండి' అని ప్రబోధించారు. ప్రాతఃకాలంలో నిర్మలమైన గాలి ఆరోగ్యానికి దివ్య ఔషధంగా ఉపకరిస్తుంది. కాబట్టి ప్రాతఃకాలపు ప్రార్థన తరువాత ప్రకృతి వెదజల్లే స్వచ్ఛమైన, నిర్మలగాలులను ఆస్వాదించడానికి చెట్లమధ్య గడపమని ప్రవక్త ఉపదేశించారు. ప్రవక్తకు చెట్లంటే ఎంతో ప్రేమ. ఆయన తరచుగా తోటలో చెట్లమధ్య గడపడానికి ఇష్టపడేవారు.

– ముహమ్మద్ లియాఖత్ ఉద్దీన్

మీరూ రాయండి!

మందిరం పేజీపై మీ అభిప్రాయాలను, రచనలను, ధర్మసందేహాలను manammandiram@gmail.comకు పంపండి. మారేడుదళం శీర్షికలో సమీక్ష కోసం మీ ఆధ్యాత్మిక ప్రచురణలను పంపవలసిన మా చిరునామా : మందిరం పేజీ, మనం దినపత్రిక, 5-3-864/4/బి, ఎస్.బి.ఎన్. ఆర్కేడ్, ఫోర్త్ అండ్ ఫిఫ్త్ ఫ్లోర్, గ్రీన్ ల్యాండ్స్, గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా, హైదరాబాద్ - 500016

గీతరామాయణం - 2


వానమామలై వరదాచార్యులు అభినవపోతన బిరుదాంకితులు. మరాఠీ భాషలో గేయరూపంలో సుప్రసిద్ధమైన గీతరామాయణాన్ని వారు తెలుగులోకి అనువదించారు. దీని మూలరచయిత గజానన దిగంబర మాడ్గూళ్కర్. కాగా తెలుగులో వరదాచార్యులు కలం తేనెలూరింది. ఆచార్యుల వారి సహజపాండిత్య ప్రతిభతో శ్రీరామకథ సర్వజనామోదం పొందింది.

అయోధ్యకాండ

దేవతల పక్షాన శంబరాసురునితో దండకారణ్యంలో నువ్వు యుద్ధం చేసేవేళ నీ రథచక్రాన్ని సంరక్షణ చేసినది నేను. రమణీ! రెండు వరాల నిచ్చితిని. నీ ఇష్టమేదో తెలుపమన్నావు నాడు. నేడు చెపుతున్నాను. మొదటి వరంగా భరతునికి సింహాసనం అప్పగించు. రెండో వరంగా రాముణ్ణి పదునాలుగేళ్లు వనవాసానికి పంపు.

కొడుకు మమతలోబడి పిచ్చివియై
కుంటిసాకులను గూర్చకు మిటుపై
వచన భంగమెటు వలె శోభిలు? రఘు
వంశవీరులకు నీ ధరణి?

– అన్నది కైకేయి.



దశరథుని తరపున కైకయే రాజాజ్ఞను రామునికి తెలియచేసింది. తల్లికి ఈ సంగతిని చెప్పడానికి రాఘవుడు కౌసల్య వద్దకు వచ్చాడు. సవతి కన్నులిక చల్లబడగనీ. నీ తండ్రి కోరిక నెరవేర్చు అని తల్లి దీవించి పంపింది. వెళ్లేముందు ఒకసారి నీ తండ్రిని చూడు. జమదగ్ని వలె నీ తండ్రి మాతృవధను ప్రోత్సహిస్తాడేమో కనుక్కో. హాయిగా నీ చేతుల్లో మరణించి ఒక ఛాయగా నిన్ను అరణ్యాలలో అనుసరిస్తాను అన్నది కౌసల్య.

రామువినా నెవడు నిల్చు రాజ్యపదవిని
కరమున ఖడ్గమును బూని కాంతును నేను


– అని క్రోధపడ్డాడు లక్ష్మణుడు.

నాతో చెప్పగనేలా నాథా
ఎచ్చట రాముడో అచ్చట సీతా
పతియె భూషణము పతియే ఛాయ
ఆపతి పదముల కఖండ పూజ
ఆర్యస్త్రీలకు అదే జీవనము
దానికి నంతరాయమేల రఘునాథా!

– అన్నది సీతామహాలక్ష్మి.

అయోధ్యానగర పౌరులైన పురుషులు శ్రీరామరథాన్ని నిలువరించారు.

రాముడు నడచునదే సత్పథము
ఆపు సుమంతా ఆపుము రథము
భూమిజ ఆగుము రామా ఆగుము
చరణధూళి మస్తకమున దాల్తుము
ఏమి ఘటించెను ఇది
యకల్పితము



– అని వారంతా దుఃఖపడ్డారు. అయోధ్యా పురస్త్రీలు అనుకున్నారట కదా... ''హరితో సిరి వనాలకు వెళ్లిపోతోంది'' శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతంగా గంగాతీరానికి చేరుకున్నాడు. శృంగబేరిపుర రాజైన గుహుని ప్రేమార పలకరించాడు.

అమలము గంగా విమలుడు రాముడు
రాముని పావన నామమె దరినిడు
దివ్య ప్రవాసము త్రిదోషనాశము
గంగా నీకిది మంగళయోగము
పొంగును గని వెనుదిరుగకు నౌకా
గంగా నీవుప్పొంగకుమా

– అని పాడుకుంటూ గుహుడు ముప్పురినీ గంగ దాటించాడు. అప్పటివరకు తోడుగా వచ్చిన సుమంతునితో శ్రీరాముడు తన తమ్ముడైన భరతునికి ఒక సందేశం పంపాడు.

తండ్రి గొడుగు నీతలపై వెలుగును
జనకవాక్య పాలన మొనర్చుచును
సార్థక పరుచుము జనక
వృద్ధతను
నీతిగ రాజ్యము నేలుచు
బెంచుము
రఘువంశీయుల నామము

– అన్నాడు. అక్కడ అయోధ్యాపురిలో పుత్రవియోగంతో దశదిశల అంధకారం కమ్ముకొనగా దశరథుడు నాడు శ్రవణకుమారుని తల్లిదండ్రులిచ్చిన శాపాన్ని గుర్తుచేసుకున్నాడు. కైకేయిని తిట్టిపోశాడు.

అంత్యమందు నీ నామోచ్చారణ పెదవుల
గంగానీరము శ్రీరామా శ్రీరామ శ్రీరామ
రామ

– అంటూ తనువు చాలించాడు. తండ్రి మరణవార్త విని హుటాహుటిన నగరు చేరిన భరతుడు తల్లిని శత్రువులా చూశాడు. 'ఎచటనున్న నచ్చటనె రాము తలనిడవలయు కిరీటమ్ము' అనుకుంటూ రాముణ్ణి వెతుకుతూ వనాలకు బయలుదేరాడు. రాముని మ్రోలవాలి తన తల్లి తప్పును క్షమించమన్నాడు.

దుఃఖమిచ్చు దైవమె భరతా!
దోషమెవరిదిందు
ధరణిలోన మానవమాత్రుడు పరాధీనుడెందు

– అంటూ రాముడు తమ్ముణ్ణి ఓదార్చాడు.

రాము బదులుగ పాదుకాద్వయి రంజిలుత
మందిరమున
నగరసీమను వీడి యందెందైన నే
నాదరమున
సవిత్ర కరరేఖలకు బదులుగ సంజదీపము
వెలుగుచుండు

– అంటూ భరతుడు రామపాదుకలను శిరస్సున ధరించి వెళ్లిపోయాడు.

– ముకుందప్రియ

మనం స్పోర్ట్స్
మంగళవారం 6 మార్చి 2018
www.manamnews.com

వార్నర్ ఓవరాక్షన్



డికాక్‌పై తిట్ల పురాణం • విచారణకు క్రికెట్ ఆస్ట్రేలియా ఆదేశం

డర్బన్: ఆస్ట్రేలియా –దక్షిణాఫ్రికా మధ్య ముగిసిన తొలి టెస్ట్‌లో ఆదివారం ఆట నాలుగో రోజుఈ అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. 417 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు దక్షిణాఫ్రికా బ్యాటింగ్ చేస్తుండగా టీ విరామ సమయంలో ఆస్ట్రేలియా ఓపెనర్ వార్నర్ వ్యవహరించిన తీరు పెద్ద దుమారం రేపుతోంది. డ్రస్సింగ్ రూమ్‌లోకి వెళుతున్న సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్ డికాక్‌పై వార్నర్ మాటల యుద్ధానికి దిగాడు. మెట్లు ఎక్కుతున్న డికాక్‌పై మాటలతో విరుచుపడ్డాడు. అసభ్య పదజాలంతో దూషించాడు. తోటి ఆటగాళ్లు వద్దంటున్నా ఆగకుండా వార్నర్ చిందులు తొక్కాడు. తీరిగ్గా కెప్టెన్ స్మిత్ వచ్చి వార్నర్‌ను డ్రెస్సింగ్ రూమ్‌లోకి తీసుకెళ్లాడు. ఇదంతా సీసీ కెమెరాలో రికార్డయింది. ఇంకో వికెట్ పడగొడితే ఆస్ట్రేలియా తొలి టెస్ట్‌లో విజయం సాధిస్తుంది. నాలుగో రోజే ఆట ముగుస్తుంది. అయితే డికాక్ ఆసీస్‌బౌలర్లను తీవ్రంగా ప్రతిఘటిస్తూ ఆడుతుండటంతోను కడుపుమండిన వార్నర్ తిట్ల పురాణం మొదలుపెట్టి ఉండొచ్చని అంచనా. ఈ వీడియో స్థానిక మీడియా బయటపెట్టడంతో కలకలం మొదలైంది. ఈ మొత్తం వ్యవహారంపై క్రికెట్ ఆస్ట్రేలియా విచారణకు ఆదేశించింది. అసలేం జరిగిందో తెలుసుకునే పనిలో భాగంగా మ్యాచ్ అంపైర్లతో క్రికెట్ ఆస్ట్రేలియా అధికారులు మాట్లాడారు. మ్యాచ్ రెఫరీనీ సంప్రదించారు. టీమ్ మేనేజర్ నుంచి సమాచారం సేకరించారు. ఇలాంటి దురదృష్టకర సంఘటన క్రికెట్‌లో చోటు చేసుకోవటం విచారకరమని, క్రీడా స్ఫూర్తి దెబ్బతింటుందని దక్షిణాఫ్రికా జట్టు మేనేజర్ మూసాజే తెలిపాడు. ఈ వ్యవహారంలో ఐసిసి తీసుకోబోయే యాక్షన్‌పై వేచి చూస్తున్నామన్నాడు. ఆస్ట్రేలియా ఆటగాళ్ల తీరుపై దక్షిణాఫ్రికా మీడియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. అభిమానులు నిరసనలు మొదలుపెట్టారు.

> స్లెడ్జింగ్‌కు మారుపేరు ఆస్ట్రేలియా జట్టు. ఆటతో పాటు నోటికీ పనిచెప్పే ఆస్ట్రేలియా ఆటగాళ్లు మరోసారి క్రికెట్ పరువు తీశారు.

నాథన్ లయన్‌కు జరిమానా

డర్బన్ టెస్ట్‌లో రూల్స్ అతిక్రమించిన ఆస్ట్రేలియా స్పిన్నర్ నాథన్ లయన్‌పై ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ భారీ జరిమానా విధించింది. ఆదివారం సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ ఆడుతుండగా డివిలియర్స్ రనౌట్ అయ్యాడు. బౌలింగ్ చేస్తున్న లయన్ డివిలియర్స్‌ను రనౌట్ చేసిన ఉత్సాహంలో బాల్‌ను అతనిపైకి విసిరాడు. దీంతో లయన్‌పై ఆగ్రహించిన ఐసిసి మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించింది. దీంతో పాటు అతనిపై రెండు డిమెరిట్ పాయింట్లు జరిమానా విధించింది.


చిత్తుగా ఓడిన సౌతాఫ్రికా

డర్బన్ : దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియా 118 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 417 పరుగుల భారీ లక్ష్య సాధనకు దిగిన దక్షిణాఫ్రికా జట్టు చివరి రోజు 298 పరుగులకే ఆలౌట్ అయింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు పడగొట్టిన ఆసీస్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గెలుచుకున్నాడు. ఓవర్ నైట్ స్కోరు 9 వికెట్ల నష్టానికి 293 రన్స్‌తో సోమవారం ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా సోమవారం ఆట ప్రారంభించాక ఐదు పరుగుల వ్యవధిలోనే చివరి వికెట్ కోల్పోయింది. డేవిడ్ వార్నర్‌తో గొడవపడి అసాధారణ ఇన్నింగ్స్ ఆడిన డికాక్ 83 పరుగుల వద్ద ఎల్బీడబ్ల్యూ కావడంతో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది. రెండు జట్ల మధ్య రెండో టెస్ట్ పోర్ట్ ఎలిజిబెత్‌లో శుక్రవారం ప్రారంభమవుతుంది. ఈ విజయంతో నాలుగు టెస్ట్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0 ఆధిక్యంతో నిలిచింది.

సంక్షిప్త స్కోర్లు : ఆస్ట్రేలియా ఫస్ట్ ఇన్నింగ్స్ 351ఆలౌట్, రెండో ఇన్నింగ్స్ 227ఆలౌట్, దక్షిణాఫ్రికా ఫస్ట్ ఇన్నింగ్స్ :189 ఆలౌట్, రెండో ఇన్నింగ్స్ 298 ఆలౌట్.



ధోనీ న్యూలుక్



ముంబాయి : టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ కొత్త గెటప్‌లో అదిరిపోయాడు. శ్రీలంకలో మొదలయ్యే టి 20 ట్రై సిరీస్‌కు దూరంగా ఉన్న ధోని ఓ చాక్లెట్ కంపెనీ యాడ్‌లో కొత్త లుక్‌లో కనిపించాడు. గతంలో ఎన్నడూ కనిపించని గెటప్‌లో ఈ యాడ్‌లో ధోని నటించాడు. క్రికెట్‌లోఅడుగు పెట్టిన సమయంలో ధోనికి పొడవాటి జుట్టు ఉండేది. అలాంటి జుట్టుతోనే ధోనీ నటించిన యాడ్ ఇప్పుడు అభిమానులకు ఆకట్టుకుంటోంది.

కుర్రాళ్ల సత్తాకు పరీక్ష

నేటి నుంచి టి20 ట్రై సిరీస్ • శ్రీలంకతో భారత్ తొలి మ్యాచ్

కొలంబో: సౌతాఫ్రికా టూర్ ను విజయవంతంగా ముగించిన భారత జట్టు శ్రీలంకలో మంగళవారం మొదలయ్యే టి20 సిరీస్‌లో కొత్త కుర్రాళ్లతో భారత్ బరిలోకి దిగుతోంది. రోహిత్ శర్మ సారథ్యంలోని యంగ్ ఇండియా తొలి మ్యాచ్‌ను శ్రీలంకతో ఆడుతుంది. బంగ్లాదేశ్ కూడా పాల్గొనే ఈ టి20 ట్రై సిరీస్‌లో యువ ఆటగాళ్లతో బరిలోకి దిగుతున్నప్పటికీ భారత జట్టే ఫేవరిట్. విరాట్ కోహ్లీ లాంటి రెగ్యులర్ ప్లేయర్లు లేనప్పటికీ రోహిత్ శర్మ సారథ్యంలో భారత్ ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది. 2019 ప్రపంచ కప్ కోసం ప్రయోగాలు చేస్తున్న భారత సెలెక్టర్లు ఈ టోర్నీలో కొత్త ఆటగాళ్లకు అవకాశం కల్పించారు. జట్టులో స్థానాన్ని సుస్థిర పరచుకోవాలనుకుంటున్న యువ ఆటగాళ్లకు ఈ టోర్నీ చక్కటి అవకాశంగా మారింది. రిషబ్ పంత్, మహ్మద్ సిరాజ్‌లతో పాటు విజయ్ శంకర్ లాంటి యువ ఆటగాళ్ల సత్తాకు కీలకంగా మారింది. రెగ్యులర్ బౌలర్లు జట్టులో లేకపోవడంతో గతంలో రెండు టి ట్వంటీ మ్యాచ్‌లు ఆడి నిరాశ పరిచిన హైదరాబాద్ స్టార్ మహ్మద్ సిరాజ్‌కు తుది జట్టులో చోటు ఖాయంగా కనిపిస్తోంది. జట్టులో పర్మినెంట్ ప్లేస్ కొట్టేయటానికి సిరాజ్‌తో పాటు మిగతా ఆటగాళ్లకూ ఈ టోర్నీ పరీక్షే. ముఖ్యంగా ధోనీ వారసుడిగా తెరపైకి వచ్చిన పంత్ ఇటీవల దేశవాళీ టీ20 టోర్నీలో అదరగొట్టాడు. ఐపీఎల్‌లో రాణించిన ఈ వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ లంక టూర్‌లో తన అదృష్టాన్ని మరో సారి పరీక్షించుకోనున్నాడు. యువ పేస్ బౌలర్లు ఉనద్కత్, శార్దూల్ ఠాకూర్‌లకూ ఈ టోర్నీ సవాల్. జాతీయ జట్టులో చోటు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ ఇద్దరి మధ్యా పోటీకి ఈ టోర్నీ వేదికకానుంది. ఇక స్పిన్నర్ అక్షర్ పటేల్‌కూ ఈ సిరీస్ కీలకమే. ఇక ఈ టోర్నీకి ఆతిథ్యమిస్తున్న శ్రీలంక జట్టును గాయాలు వేధిస్తున్నాయి. గుణరత్నే, ఏంజెలో మాథ్యూస్, మధుశంకలు గాయాలపాలై ఈ టోర్నీ కి దూరమయ్యారు. చండీమాల్ ఉపల్ తరంగ, త్రిసర ఫెరీరా, సురంగ లక్మల్ లాంటి ప్లేయర్లపై లంక ఆశలు పెట్టుకుంది. బంగ్లాదేశ్‌తో జరిగిన టి20 సిరీస్‌లో జట్టుకు దూరమైన కుశాల్ పెరీరా జట్టులోకి రావడంతో లంక ఉత్సాహంగా ఉంది.





టి 20 ట్రై సిరీస్ షెడ్యూల్

మార్చి 6:	భారత్ X శ్రీలంక
మార్చి 8:	భారత్ X బంగ్లాదేశ్
మార్చి 10:	శ్రీలంక X బంగ్లాదేశ్
మార్చి 12:	భారత్ X శ్రీలంక
మార్చి 14:	భారత్ X బంగ్లాదేశ్
మార్చి 16	శ్రీలంక X బంగ్లాదేశ్
మార్చి 18:	ఫైనల్

మ్యాచ్‌లన్నీ ప్రేమదాస స్టేడియంలో

సాయంత్రం 7 గంటల నుంచి డి స్పోర్ట్స్,డిడి స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్ ధావన్ (వైస్ కెప్టెన్), కేఎల్, రాహుల్, సురేశ్ రైనా, మనీష్ పాండే, దినేశ్ కార్తీక్ (వికెట్ కీపర్), దీపక్ హూడా, వాషింగ్టన్ సుందర్, యజువేంద్ర చాహల్, అక్షర్ పటేల్, విజయ్‌శంకర్, శార్దూల్ ఠాకూర్, జైదేవ్ ఉనద్కత్, మహ్మద్ సిరాజ్, రిషబ్ పంత్

శ్రీలంక : దినేశ్ చండీమాల్(కెప్టెన్), సురంగ లక్మల్, ఉపుల్ తరంగ, ధనుష్క గుణతిలక, కుశాల్ మెండిస్, దసున్ శనక, కుశాల్ పెరీరా, తిసారా పెరీరా, జీవన్ మెండిస్, ఇరుసు ఉదాన, అఖిల ధనంజయ, అమిల అపోన్సో, నువాన్ ప్రదీప్, ధనంజయ డిసిల్వా

ఇమ్రాన్‌ను గుర్తు తెస్తున్నాడు



కోహ్లీకి రవిశాస్త్రి కితాబు

కోల్‌కతా: అసాధారణ ఆటతీరుతో సౌతాఫ్రికా టూర్‌లో రికార్డులు తిరగరాసిన టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ లెజెండ్ క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్‌ను తలపిస్తున్నాడని కోచ్ రవిశాస్త్రి ప్రశంసల జల్లు కురిపించాడు. 'విరాట్‌కు ఇది ఆరంభం మాత్రమే, వయసులో చాలా చిన్నవాడైనప్పటికీ అత్యుత్తమ ఆటగాళ్ల స్థాయికి చేరుకున్నాడు' అని రవిశాస్త్రి ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు. కోహ్లీ ఆడుతుంటే ఇమ్రాన్ ఖాన్ గుర్తుకొస్తున్నాడు, కుర్రాడైనప్పటికీ జట్టును నడిపించడంలో ఇమ్రాన్ ఖాన్ లక్షణాలు చాలా ఉన్నాయని రవిశాస్త్రి పొగిడాడు. వన్డేల్లో నంబర్ వన్ ర్యాంక్‌లో ఉన్న కోహ్లీ సౌతాఫ్రికా టూర్‌లో చారిత్రక ఇన్నింగ్స్ ఆడాడు. సౌతాఫ్రికా గడ్డపై వన్డేల్లో 500 పైగా పరుగులు సాధించిన తొలి బ్యాట్స్‌మెన్‌గా కోహ్లీ రికార్డు సృష్టించాడు. మోడ్రన్ క్రికెట్‌లో బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా రికార్డులు తిరగరాస్తున్న కోహ్లీ మూడు సెంచరీతో సౌతాఫ్రికా టూర్‌లో 558 పరుగులు చేశాడు. ఈ సిరీస్‌లో ఆరు ఇన్నింగ్స్‌ల్లో 112, 46 నాటౌట్, 160 నాటౌట్, 75, 36, 129 రన్స్ చేశాడు. 1992లో ప్రపంచ కప్ గెలుచుకున్న పాకిస్తాన్ జట్టు కెప్టెన్ కూడా ఇలాంటి ఇన్నింగ్సే ఆడాడని రవిశాస్త్రి కితాబిచ్చాడు. ఎప్పుడూ టాప్ ప్లేస్‌లో ఉండాలనుకోవటం, జట్టులోమిగతా ఆటగాళ్లకు స్ఫూర్తి దాయకంగా నిలవ టం వంటి అంశాల్లోనూ ఇమ్రాన్‌తో కోహ్లీని పోల్చవచ్చని రవిశాస్త్రి అన్నాడు. 'ఎలాంటి పరిస్థితుల్లో అయినా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవటానికి, మిగతా ఆటగాళ్లను ప్రోత్సహించటానికి కోహ్లీ కనబరిచే ఉత్సాహం ఇమ్రాన్‌లోనూ కనిపించేది' అని శాస్త్రి చెప్పాడు. కోహ్లీ దూకుడు తగ్గించాలంటూ కొంత మంది క్రికెటర్లు చేస్తున్న వ్యాఖ్యానాలను రవిశాస్త్రి కొట్టిపారేశాడు. ' ఎవరి పని వారు చూసుకోవటం మంచిదని నా సలహా' అని కోహ్లీపై విమర్శలు చేసే వారికి రవిశాస్త్రి సమాధానం ఇచ్చాడు. కోహ్లీతో ఎలాంటి సమస్యా లేదని, ఎదైనా సమస్య ఉంటే అంపైర్లు, మ్యాచ్ రిఫరీలు పరిష్కరిస్తారన్నాడు. జొహన్నెస్‌బర్గ్ టెస్ట్‌లో భారత ఆటతీరు అసాధారణమని రవిశాస్త్రి ప్రశంసించాడు.



మనూ భకర్‌కు స్వర్ణం

ప్రపంచ కప్ షూటింగ్‌లో అదరగొడుతున్న భారత్

న్యూఢిల్లీ : మెక్సికోలో జరుగుతున్న సీనియర్ షూటింగ్ ప్రపంచ కప్ పోటీల్లో భారత్ పతకాల పంట పండిస్తోంది. మహిళల 10 మీటర్ల ఎయిరిపిస్టల్ విభాగంలో 16 ఏళ్ల హర్యానా షూటర్ మనూ భకర్ స్వర్ణం సాధించి మరోసారి త్రివర్ణ పతకాన్ని రెపరెపలాడించింది. మెక్సికోకు చెందిన రెండు సార్లు ప్రపంచ చాంపియన్ అరెజెంద్ర జవాలను ఓడించిన మనూ237.5 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచి స్వర్ణం కైవసం చేసుకుంది. జవాల 237.1 పాయింట్‌తో , ఫ్రాన్స్‌కు చెందిన సీలైన్ గోబర్ విల్లే 217 పాయింట్లతో ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఇదే పోటీలో మరో భారత స్టార్ యశస్విని సింగ్ 196.1 పాయింట్‌తో నాలుగో స్థానంలో నిలిచింది. ఇప్పటి వరకూ ఈ ప్రపంచ కప్ పోటీల్లో భారత్‌కు ఐదు పతకాలు దక్కాయి. ఇందులో రెండు స్వర్ణ, మూడు కాంస్య పతకాలున్నాయి.

మహిళల జట్టు శుభారంభం

తొలి మ్యాచ్‌లో దక్షిణకొరియాపై 1-0 గోల్స్‌తో విజయం

సియోల్ : ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా దక్షిణకొరియాతో జరిగిన తొలి పోరులో భారత మహిళల హాకీ జట్టు 1-0 గోల్స్‌తో విజయం సాధించి శుభారంభం చేసింది. ఆట ఆరంభంలో ఐదో నిమిషంలోనే భారత్ గోల్ సాధించి దక్షిణకొరియాపై ఆధిక్యం కనబరిచింది. లాల్‌రెమిసిమి చేసిన ఈ గోల్‌తో 1-0 గోల్స్‌తో పై చేయి సాధించిన భారత జట్టు ఆ తర్వాత పూర్తి ఆధిక్యం కనబరిచింది. ప్రత్యర్థి జట్టుపై దాడులుపెంచుతూ దూకుడు ప్రద్శించిన భారత జట్టుకు రెండో క్వార్టర్‌లో పెనాల్టీ కార్నర్ లభించింది. అయితే మిజిన్ హాన్ గోల్ చేసే అవకాశాన్ని చేజార్చుకుంది. 23వ నిమిషంలో కొరియా కు పెనాల్టీ కార్నర్ లభించింది. భారత గోల్ కీపర్ స్వాతి అద్భుతంగా అడ్డుకోవటంతో గోల్ చేయాలన్న కొరియా ప్రయత్నాలు ఫలించలేదు. ఆ తర్వాత భారత జట్టు పెనాల్టీ కార్నర్‌లను గోల్స్ చేసేందుకు ప్రయత్నాలు చేసినా కొరియా అద్భుతంగా ఆడి అడ్డుకుంది. ఈ టూర్‌లో రెండో మ్యాచ్‌ను భారత జట్టు మంగళవారం ఆడుతుంది.



ఆస్ట్రేలియాతో అమీతుమీ

అజ్లాన్ షా హాకీ టోర్నీ

ఇపో (మలేసియా) : అజ్లాన్ షా హాకీ టోర్నీలో భారత హాకీ జట్టు మంగళవారం జరిగే కీలక మ్యాచ్‌లో ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియాతో అమీతుమీకి రెడీఅయ్యింది. ఈ టోర్నీలో తొలి మ్యాచ్‌లో అర్జెంటీనా చేతిలో ఓడిన భారత జట్టు ఇంగ్లండ్‌తో జరిగిన రెండో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ఆరు జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో ఒక్క పాయింట్‌తో భారత జట్టు నాలుగో స్థానంలో ఉంది. ఇక ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన ఆస్ట్రేలియా నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. ఈ టోర్నీలో మిగతా జట్లతో పోటీలో నిలవాలంటే ఈ మ్యాచ్‌లో భారత జట్టు తప్పనిసరిగా గెలవాల్సి ఉంటుంది. అయితే మంచి ఫామ్‌లో ఉన్న ఆస్ట్రేలియాను ఓడించటానికి భారత జట్టు తీవ్రంగా శ్రమించాల్సి ఉంటుంది. అగ్రశ్రేణి ఆటగాళ్లతో ఈ టోర్నమెంట్‌లో అడుగుపెట్టిన ఆస్ట్రేలియా గోల్స్‌తో ప్రత్యర్థి జట్లను బెంబేలెత్తిస్తోంది. అయితే అంతగా అంతర్జాతీయ అనుభవం లేని అటగాళ్లతో బరిలోకి దిగిన సర్దార్ నేతృత్వంలోని భారత జట్టు అర్జెంటీనా, ఇంగ్లండ్‌లతో జరిగిన మ్యాచ్‌ల్లో చేజేతులా అవకాశాలను చేజార్చుకుంది. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో 9 పెనాల్టీ కార్నర్‌లను వృథా చేసుకుని గెలిచే అవకాశాన్ని జారవిడుచుకుంది. ప్రత్యర్థులపై విరుచుకుపడే ఆస్ట్రేలియా జట్టుపై ఇలాంటి ఆటతీరును కనబరిస్తే భారత జట్టు భారీమూల్యం చెల్లించుకోక తప్పదు. వచ్చే నెల్లో జరిగే కామన్‌వెల్త్ క్రీడలకు సన్నాహకంగా జరుగుతున్న ఈ టోర్నీలో మెరుగైన ఆటతీరును ప్రదర్శించేందుకు యువ ఆటగాళ్లు చెమటోడ్చాల్సిందే.



ఐపీఎల్ నిర్వాహకులకు బీసీసీఐ షాక్

ప్రారంభ వేడుకల తేదీ, వేదిక మార్పు

న్యూఢిల్లీ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ మెగా గ్రాండ్ ఈవెంట్ ప్రారంభ వేడుకల తేదీ, వేదిక మారింది 2018 ఐపీఎల్ టోర్నీ వచ్చే నెల 7 నుంచి ప్రారంభం కానుంది. పోటీల ప్రారంభానికి ఒక్క రోజు ముందు అంటే ఏప్రిల్ ఆరున ఐపీఎల్ 11 సీజన్ ప్రారంభ వేడుకలను ముంబైలోని క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా మైదానంలో జరపాలని నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.అయితే ఐపీఎల్ నిర్వాహకుల ప్రయత్నాలకు బీసీసీఐ పాలక మండలి బ్రేక్ వేసింది. టోర్నీ మొదలయ్యే రోజునే అంటే ఏప్రిల్ ఏడున మొదటి మ్యాచ్ జరిగే వాంఖడే స్టేడియంలోనే ప్రారంభ వేడుకలను నిర్వహించాలని బీసీసీఐ పాలక కమిటీ నిర్ణయించింది. ఈ ప్రారంభ వేడుకలను 50 కోట్లతో నిర్వహించాలన్న ఐపీఎల్ గవర్నింగ్ బాడీ ఆశలపైనా బీసీసీఐ నీళ్లు చల్లింది. ఈ వేడుకలకు అయ్యే ఖర్చును 20 కోట్లు తగ్గించి 30 కోట్లతో పూర్తి చేయాలని సూచించినట్టు సమాచారం. వాంఖడే స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్ జట్టు చెన్నై సూపర్ కింగ్స్‌తో తొలి మ్యాచ్ ఆడుతుంది.ఏ చివరి మ్యాచ్ కూడా ఇదే స్టేడియంలో మే 27న జరుగుతుంది.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.